అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

శనివారం 6-1-2018 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 4 సంచిక : 9 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు వెల : 5.00

ఆధార్‌కు భద్రత లేదు..

- దబ్బులిస్తే..చాలు సమాచారం బయటకు :

అమెరికా సీఐఏ మాజీ ఉద్యోగి ఎడ్వర్డ్ స్నోడెన్

న్యూఢిల్లీ : 'ఆధార్' సమాచార భద్రతపై కేంద్ర ప్రభుత్వం, యూఐడీఏఐ చెబుతోన్న మాటలు నిజం కాదన్న వాదనకు బలం చేకూరుతోంది. ఆధార్ సమాచారానికి భద్రతలేదని, దాన్ని ఎవరైనా చోరీ (హ్యాక్) చేయగలరని అమెరికా కంప్యూటర్ ప్రొఫెషనల్, సీఐఏ మాజీ ఉద్యోగి ఎడ్వర్డ్ స్నోడెన్ తాజాగా ట్విట్టర్‌లో అభిప్రాయపడ్డారు. స్టింగ్ ఆపరేషన్ నిర్వహించి 'ఆధార్' సమాచార భద్రత డొల్లతనాన్ని 'ట్రిబ్యూన్' మ్యాగజైన్ బయటపెట్టిన సంగతి తెలిసిందే. ఈ కథనాన్ని ఉద్దేశిస్తూ, స్నోడెన్ 'ఆధార్'పై ట్విట్టర్‌లో తాజాగా సందేశం పోస్ట్ చేశారు. అమెరికా జాతీయ భద్రతా సంస్థ (ఎన్ఎస్ఏ) కీలక పత్రాల్ని 2013లో ఎడ్వర్డ్ స్నోడెన్ లీక్ చేశాడు. ప్రపంచవ్యాప్తంగా అమెరికా గూఢాచార్య కార్యకలాపాలు, కుట్రలు ఈ పత్రాల ద్వారా బహిర్గతమయ్యాయి. స్నోడెన్ ప్రస్తుతం మాస్కోలో తలదాచుకున్నారు. ఆధార్‌పై 'ట్రిబ్యూన్' మ్యాగజైన్ స్టింగ్ ఆపరేషన్‌ను ప్రస్తావిస్తూ ఒక వ్యక్తి ట్విట్టర్‌లో అడిగినదానికి ఎడ్వర్డ్ స్నోడెన్ పై విధంగా స్పందించారు. ఆధార్



(ఫైల్)

సమాచారం భద్రంగా లేదని, అదంతా కేంద్ర ప్రభుత్వం సహజధోరణిలో చెప్పుకునేదని స్నోడెన్ తేల్చేశాడు. సంబంధిత వర్గాలకు డబ్బులు ఇస్తే చాలు...సమాచారం బయటకు వస్తుందని, అదేమంత పెద్ద కష్టమైన పనేమీ కాదని వ్యాఖ్యానించారు. ప్రజల వ్యక్తిగత సమాచారం చాలా భద్రంగా ఉందని ప్రభుత్వాలు నమ్మబలుకుతాయి, కానీ అది నిజం కాదని అన్నారు. ఇందుకు చరిత్రలో అనేక ఉదాహరణలున్నాయన్నారు. ఇటీవల ట్రిబ్యూన్ ...9లో

మొదటి దశ భూ ప్రక్షాళన పూర్తి

- భూరికార్డుల్లో వ్యవసాయ ఖాతాలు 71,75,096
- సీఎం కేసీఆర్ సమీక్ష

9

పథకాల అమలు చేతకాకనే కులాల చిచ్చు

- సర్కారుపై మత్స్యకార సంఘాల నేతల ఆగ్రహం
- మిషన్‌కాకతీయలో భాగస్వామ్యం చేయండి : మత్స్యకారుల మహాగర్జనలో వక్తలు

9




మత్స్యకారుల మహాసభలో అభివాదం చేస్తున్న సంఘాల నాయకులు


లెక్క తప్పింది..

జీడీపీ వృద్ధి రేటు నాలుగేండ్ల కనిష్టానికి..

- 6.5 శాతానికే పరిమితం..
- జీడీపీ అంచనా రూ.129.85 లక్షల కోట్లు
- దెబ్బతిన్న తయారీ, వ్యవసాయరంగం : సీఎస్‌వో



నోట్లరద్దు, జీఎస్టీ ఎఫెక్ట్



తాను చేపట్టే ఆర్థిక సంస్కరణలు అభివృద్ధికి ఊతం ఇస్తాయంటూ ప్రధాని మోడీ పదేపదే చెబుతున్న మాటలు నీటి మూటలేనని మరోసారి స్పష్టమైంది. సాక్షాత్తూ ప్రభుత్వ ఆర్థిక గణన సంస్థ (సీఎస్‌వో) వెల్లడించిన ఈ ఆర్థిక ఏడాది జీడీపీ వృద్ధిరేటు గణాంకాలు..మోడీ ప్రభుత్వ ఆర్థిక నిర్వహణ తిరోగమనం దిశగా పయనించటానికి నోట్ల రద్దు,జీఎస్టీ కారణమని ప్రముఖ ఆర్థికవేత్తలు చేసిన వ్యాఖ్యలు నిజమేనని తేల్చి చెప్పాయి. ఇప్పటివరకూ ఐఎంఎఫ్, వరల్డ్‌బ్యాంక్‌సహా ఆర్‌బీఐ వేసిన అంచనాలు చూశాం.,తాజాగా సీఎస్‌వో వెల్లడించిన లెక్కలు ఏ కోణంలోనూ మోడీ ప్రభుత్వ ఆర్థిక నిర్వహణతీరును సమర్థించేలా లేకపోవడం చూస్తే..అభివృద్ధి మంత్రం పఠించే బీజేపీ నేతల నోట్లో పచ్చి వెలక్కాయ పడ్డట్టేనని అర్థమవుతోంది. గత 14 నెలల్లో మోడీ ప్రభుత్వం తీసుకున్న రెండు నిర్ణయాలు.. నోట్లరద్దు, జీఎస్టీని హడావుడిగా అమలులోకి తేవడం తప్పని ఈ లెక్కలు తేల్చి చెబుతున్నాయి. బడ్జెట్ సమావేశాలు దగ్గరపడుతున్న వేళ ప్రభుత్వ సంస్థకు సైతం వాస్తవ గణాంకాలు చెప్పక తప్పని పరిస్థితి..అయితే, ఇది కేంద్రంలోని ప్రభుత్వ పెద్దలకు మాత్రం మింగుడు పడటంలేదు..

9

తల్లిని చంపి.. ఆత్మహత్యగా చిత్రీకరించి..

- గుజరాత్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఘాతుకం..



అహ్మదాబాద్ : నవమాసాలు మోసి కని పెంచిన తల్లి .. అతడికి భారంగా మారింది. అల్లారు ముద్దుగా చూసుకుంటూ ప్రయోజకుడిని చేసిన మాతృమూర్తిని కానరాని లోకాలకు పంపాడు ఆ దుర్మార్గుడు. తల్లిని భవనంపై నుంచి తోసి చంపడమే కాక.. ఆత్మహత్య చేసుకుందంటూ నమ్మబలికాడు. గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఘాతుకం ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం.. రాజ్‌కోట్‌లోని రామేశ్వర్ పార్కు ప్రాంతానికి చెందిన జయశ్రీ కొడుకు సందీప్ నత్వాని ఓ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నాడు. కాగా.. జయశ్రీ మెదడులో రక్తం గడ్డకట్టడంతో గతేడాది సెప్టెంబర్‌లో ఆస్పత్రిలో చేరింది. కొద్దిరోజుల తర్వాత ఆమెను సందీప్ ఇంటికి తీసుకొచ్చాడు. ఆమెకు కొద్దిగా పక్షవాతం కూడా రావడంతో స్వతహాగా లేచి నిలబడలేని పరిస్థితి తలెత్తింది. దీంతో ఆమెకు సపర్యలు చేయాల్సి రావడంతో సందీప్‌కు విరక్తి పుట్టింది. ఎలాగైనా ఆమెను వదిలించుకోవాలని భావించాడు. సెప్టెంబర్ 27న ఆమెను వారు నివాసముండే భవనం పై అంతస్థుకు తీసుకెళ్లాడు. తీసుకెళ్లే సమయంలో జయశ్రీని మెట్లపై ఈడ్చుకెళ్లాడు. అనంతరం భవనం కిందికి తోసి చంపేసి ఏమీ తెలియనట్టు నటించాడు. ఆత్మహత్య చేసుకుందని పోలీసులను నమ్మించాడు. అయితే.. ఈ కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులకు ఆది నుంచి అనుమానాలే ఉన్నాయి. చివరకు సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించడంతో సందీప్ బండారం బయటపడింది. సందీప్ తన తల్లిని పైకి ఈడ్చుకెళ్లి.. తిరిగి వచ్చి తలుపులు పెట్టుకున్నట్టు అక్కడే ఉన్న సీసీటీవీలో రికార్డయ్యింది. ఈ కోణంలో సందీప్‌ను విచారించగా చేసిన ఘాతుకాన్ని ఒప్పుకున్నాడు. ఆయనను అరెస్టు చేసినట్టు పోలీసు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

అయ్యప్ప దర్శనానికి...
మహిళలకు వయో నిర్ధారణ పత్రాలు తప్పనిసరి



న్యూఢిల్లీ : శబరిమల అయ్యప్ప ఆలయ దర్శనానికి వచ్చే మహిళలు తమ వెంట వయస్సును నిర్ధారించే ధ్రువీకరణ పత్రాలను కూడా తెచ్చుకోవాలి. శబరిమలై దిగువన సెక్యూరిటీ సిబ్బందికి వాటిని చూపించాల్సి ఉంటుంది. ఈ విషయాన్ని ఆలయ నిర్వహణ బోర్డు ప్రకటించింది. 12 నుంచి 50 ఏండ్ల మధ్య వయస్సు మహిళలకు ఆలయప్రవేశానికి అనుమతిలేదని, ఈ మధ్య కాలంలో చాలా మంది మహిళలు అయ్యప్ప ఆలయానికి వస్తున్న నేపథ్యంలో ఈ నిబంధన అమలుచేయవలసి వస్తున్నదని బోర్డు ప్రతినిధి తెలిపారు. అలా అని ప్రతి ఒక్కరినీ నిలదీస్తామని అనుకోవద్దని, అనుమానం వచ్చిన వారి విషయంలో అవసరమైతే ఈ పత్రాలు చూపించాలని బోర్డు వివరణ ఇచ్చింది. ఆలయ అధికారుల నిర్ణయాన్ని సీపీఐ నేత అన్నీ రాజా తప్పుపట్టారు. మహిళల ఆరాధనా స్వేచ్ఛకు గల హక్కులను ఇది హరించివేస్తోందని ఆయన విమర్శించారు.

హక్కుల సాధన కోసం
ముందుకు రావాలి : బిమన్‌బసు

కోల్‌కతా : ప్రజలు తమ హక్కుల సాధన కోసం ధైర్యంతో ముందుకురావాలని బర్ద్వాన్‌లో లక్షలాది మందితో జరిగిన బహిరంగసభలో లెఫ్ట్‌ఫ్రంట్ చైర్మన్ బిమన్‌బసు పిలుపునిచ్చారు. భయంతో బతికే పరిస్థితి అంతం కావాలని, తలెత్తుకొని తిరగాలని ఆయన ఆద్బోధించారు. అప్పుడు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న యంత్రాంగం కూలిపోతుందని ఆయన చెప్పారు. మమతాబెనర్జి రాష్ట్రాన్ని వినాశకరమైన భవిష్యత్ వైపుకు తీసుకుపోతున్నదని చెప్పారు. రాష్ట్రం ఉపాధి హామి పథకం అమలులో అగ్రస్థానంలో ఉన్నదని మమతాబెనర్జి, టీయంసీలు అబద్ధాలు చెబుతున్నాయి. పథకం అమలులో బెంగాల్ 29వ స్థానంలో ఉండగా త్రిపుర అగ్రస్థానంలో ఉన్నదని ఆయన చెప్పారు. బీజేపీ ఆవులకు రక్షణ కల్పిస్తానని చెబుతున్నదని, ఆవుల స్థానంలో సామాన్యప్రజలకు రక్షణ కల్పించాలని ఆయన బీజేపీని ఉద్దేశించి చెప్పారు.

తక్కువ శిక్ష విధించండి

- కోర్టును అభ్యర్థించిన లాలూ
- శిక్ష ఖరారు నేటికి వాయిదా



పాట్నా: పశుదాణా కుంభకోణం కేసులో తనకు వీలైనంత తక్కువ శిక్షను విధించాలని రాష్ట్రీయ జనతాదళ్(ఆర్జేడీ) చీఫ్ లాలూప్రసాద్ యాదవ్.. సీబీఐ ప్రత్యేక కోర్టును అభ్యర్థించారు. ఈ కేసులో లాలూను కోర్టు ఇటీవల దోషిగా తేల్చిన విషయం తెలిసిందే. కాగా.. బిర్సాముండా జైలులో ఉంటున్న ఆయన.. ప్రత్యేక కోర్టులో శుక్రవారం హాజరయ్యారు. ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని వీలైనంత తక్కువ శిక్ష విధించాలని న్యాయమూర్తి శివ్‌పాల్ సింగ్‌కు ఆయన విజ్ఞప్తి చేశారు. తనకు గుండె శస్త్రచికిత్స జరిగిందని, దాంతోపాటు డయాబెటిస్, మూత్రాశయ వ్యాధితో బాధపడుతున్నట్టు విన్నవించుకున్నారు. అంతేకాక, బిర్సాముండా జైలులో శుభ్రమైన తాగునీరు అందుబాటులో లేదని తెలిపారు. దీంతో కిడ్నీలపై ప్రభావం పడే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. జైలులో మెరుగైన వైద్య సదుపాయాలు కూడా లేవని చెప్పారు. వాదనలు విన్న న్యాయ మూర్తి శివ్‌పాల్‌సింగ్.. శిక్ష ఖరారును శనివారానికి వాయిదా వేశారు.



కొత్త ఏడాదిలో తొలి ఉపగ్రహం

బెంగళూరు: కొత్త ఏడాదిలో తొలి ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి పంపేందుకు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) సన్నాహాలు చేస్తోంది. గత ఆగస్టు నెలలో దేశంలో ప్రైవేటు రంగంలో తయారయిన తొలి ఉపగ్రహ ప్రయోగంలో విఫలమైన ఇస్రో, నాలుగు నెలల విరామానంతరం ఆత్మవిశ్వాసాన్ని కూడగట్టుకుని మరో ఉపగ్రహ ప్రయోగానికి సిద్ధమయింది.

త్రిపుర సర్కారును కూల్చే కుట్ర

బీజేపీవి 'మురికి కుయుక్తులు' : బృందాకరత్



న్యూఢిల్లీ : త్రిపురలో లెఫ్ట్ పార్టీల నేతృత్వంలోని ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు బీజేపీ అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నదనీ, 'మురికి కుయుక్తుల'కు పాల్పడుతున్నదని సీపీఐ(ఎం) విమర్శించింది. అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న త్రిపురలో రాష్ట్రం వెలుపలి వ్యక్తులను పరిశీలకులుగా నియమించాలనీ, గరిష్ట సంఖ్యలో పారా మిలిటరీ దళాలను మోహరించాలని బీజేపీ ఎన్నికల కమిషన్‌ను డిమాండ్ చేయడాన్ని సీపీఐ(ఎం) తప్పుపట్టింది. ఈశాన్య రాష్ట్రాల్లో భయానక వాతావరణాన్ని సృష్టించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ పీటీఐ సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో విమర్శించారు. త్రిపుర శాంతికి, సామరస్యానికి చిహ్నమని అన్నారు. సామాజిక, అభివృద్ధి సూచీలో బీజేపీ పాలిత రాష్ట్రాల కంటే త్రిపురలోని సీపీఐ(ఎం) ప్రభుత్వం మెరుగైన ఫలితాలను సాధించిందని ఆమె స్పష్టం చేశారు. 'బీజేపీ నేతలు చేస్తున్న తప్పుడు ఆరోపణలు, సృష్టిస్తున్న అసత్యాలు, దూషించే ప్రకటనలతో రానున్న ఎన్నికలతో ఆ పార్టీ (త్రిపురలో) భారీ మూల్యాన్ని చెల్లించు కోవాల్సి వస్తుందన్నారు. వామపక్ష కూటమి మరింత బలపడుతుందని ఆమె చెప్పారు. త్రిపురలో 1993 నుంచి సీపీఐ(ఎం) నేతృత్వంలోని వామపక్ష ప్రభుత్వం అధికారంలో ఉన్న విషయం తెలిసిందే. 60 మంది శాసనసభ్యులుగల త్రిపుర అసెంబ్లీ పదవీ కాలం మార్చి 6న ముగియనున్నది.



ట్రిపుల్ తలాక్

ఉభయ సభల్లో 13 బిల్లుల ఆమోదం



న్యూఢిల్లీ : ట్రిపుల్ తలాక్‌ను నేరంగా పరిగణించే బిల్లుపై ఎటువంటి చర్చా జరగకుండానే పార్లమెంటు శీతాకాల సమావేశాలు ముగిశాయి. వాడీ వేడిగా సాగిన పార్లమెంట్ ఉభయసభలూ శుక్రవారం నిరవధిక వాయిదా పడ్డాయి. దీంతో తలాక్ బిల్లు ఫిబ్రవరిలో జరిగే బడ్జెట్ సమావేశాల్లో చర్చకు వచ్చే అవకాశం ఉంది. దేశంలోనే చర్చనీయాంశమైన ట్రిపుల్ తలాక్ బిల్లు లోక్‌సభలో ఆమోదం పొంది, రాజ్యసభలో ఆ బిల్లులో కొన్ని లోపభూయిష్టమైన అంశాలున్నాయని, కనుకు బిల్లును సెలక్ట్ కమిటీకి పంపాలని ప్రతిపక్షాల డిమాండ్‌కు అధికార బీజేపీ సమ్మతించకపోవడంతో బిల్లుపై ఎటువంటి నిర్ణయం తీసుకోకుండానే సమావేశాలు ముగిశాయి. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు డిసెంబర్ 15 నుంచి జనవరి 5 వరకు జరిగాయి. పార్లమెంట్ ఉభయ సభలు మొత్తం 22 రోజుల పాటు, 13 సిట్టింగ్స్ జరిగాయి. అందులో లోక్‌సభలో 91.58శాతం సభా కార్యకాలాపాలు జరగగా,

ముగిసిన పార్లమెంట్ సమావేశాలు

56.29శాతం రాజ్యసభ కార్యకలాపాలు జరిగాయి. లోక్‌సభ 61 గంటల, 48 నిమిషాలు పాటు జరిగింది. ఆరు గంటల సేపు డిమాండ్ ఫర్ గ్రాంట్స్ రెండో, మూడో బ్యాచ్-2017-18 చర్చ జరిగింది. 280 స్వల్ప కాలిక ప్రశ్నలు లిస్టులో ఉన్నాయి. 48 ప్రశ్నలకు మంత్రులు సమాధానమిచ్చారు. సరాసరి రోజుకు 3.46 ప్రశ్నలకు సమాధానాలను మంత్రులు ఇచ్చారు. మిగతా ప్రశ్నలకు రాత పూర్వక సమాధానాలిచ్చారు. 3220 ఇతర ప్రశ్నలు సభలో ప్రస్తావించారు. ప్రజా అవసరాలకు సంబంధించిన 198 అంశాలను ఎంపీలు లేవనెత్తారు. 377 రూల్ ప్రకారం 226 అంశాలను ఎంపీలు సభలో ప్రస్తావించారు. 53 స్టాండింగ్ కమిటీ రిపోర్టులను ఈ సమావేశాల్లోనే ప్రవేశపెట్టారు. వివిధ అంశాలపై మంత్రులు 55 ప్రకటనలు చేశారు. సభ కార్యకలాపాలకు సంబంధించి పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి రెండు ప్రకటనలు చేశారు. 2255 పత్రాలను కేంద్ర మంత్రులు సభలో ప్రవేశపెట్టారు. లోక్‌సభ 14 గంటల 51 నిమిషాలు పాటు వాయిదా పడింది. సభ ఆలస్యంగా ప్రారంభమవ్వడంతో 8 గంటల 10 నిమిషాల పాటు సభా సమయం వృథా అయ్యింది. ఈ సమావేశాల్లో లోక్‌సభలో 14 బిల్లులు ప్రవేశపెట్టారు. లోక్‌సభలో 13 బిల్లులు ఆమోదం పొందగా, రాజ్యసభలో 9 బిల్లులు ఆమోదం పొందాయి. పార్లమెంట్ ఉభయ సభల్లో మొత్తం 13 బిల్లులు ఆమోదం పొందాయి. ఒక బిల్లును కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకుంది. లోక్‌సభలో రూల్ 193 ప్రకారం ఓఖీ తుఫాన్‌పై స్వల్పకాలిక చర్చ జరిగింది. రాజ్యసభలో రూల్ 176 ప్రకారం ఢిల్లీ కాలుష్యం, దేశంలో ఉపాధి కల్పన-ఆర్థిక, పెట్టుబడి వాతావరణం రెండు అంశాలపై స్వల్ప కాలిక చర్చ జరిగింది.

ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 29 నుంచి ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 1న ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. రెండు దశల్లో జరిగే ఈ సమావేశాలు తొలి విడత ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 9 వరకు జరగనున్నాయి. మార్చి 5 నుంచి ఏప్రిల్ 6 వరకు రెండో విడతలో సమావేశాలు నిర్వహించేందుకు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి వర్గ సంఘం(సీసీపీఏ) నిర్ణయం తీసుకుందని ఆ శాఖ మంత్రి అనంత్ కుమార్, సహాయ మంత్రులు విజయ్ గోయల్, అర్జున్ రామ్ మేఘ్వాల్‌లతో కలసి శీతాకాల సమావేశాల ముగింపు అనంతరం విలేకరులకు తెలిపారు. మరోవైపు శీతాకాల సమావేశాల్లో రాజ్యసభలో ఆమోదం పొందలేక పోయిన ట్రిపుల్ తలాక్ బిల్లు బడ్జెట్ సమావేశాల్లో మరోసారి చర్చకు వచ్చే అవకాశం ఉంది.

శాంతియుత ర్యాలీలకు హక్కు లేదా?

- ప్రధాని నరేంద్రమోడీని ప్రశ్నించిన జిగ్నేశ్
- మనుస్మృతి, రాజ్యాంగం పుస్తకాలతో మోడీ దగ్గరకువెళతా
- ఏది ఎంచుకుంటారో అడుగుతా: దళిత నేత



న్యూఢిల్లీ : మహారాష్ట్రలో భీమా-కొరేగావ్‌లో హింసాత్మక ఘటనలపై ప్రధాని నరేంద్రమోడీ ఎందుకు మౌనంగా ఉన్నారని దళిత నేత, గుజరాత్ ఎమ్మెల్యే ప్రశ్నించారు. అలాగే పుణె సభలో రెచ్చగొట్టే ప్రసంగం చేసినట్టు తనపై వచ్చిన ఆరోపణలను ఖండించారు. రెచ్చగొట్టే ప్రసంగం చేసినట్టు వచ్చిన ఫిర్యాదుతో జిగ్నేశ్, విద్యార్థినేత ఉమర్ ఖాలిద్‌లపై పోలీసులు గురువారం కేసు నమోదుచేసిన విషయం తెలిసిందే. 'దళితులపై రోజురోజుకూ పెరుగుతున్న హింసాత్మక ఘటనలపై ప్రధాని మాట్లాడాలి. హైదరాబాద్‌లో రోహిత్ వేముల ఘటన నుంచి మొదలుపెడితే.. గుజరాత్‌లోని ఉనా, ఉత్తరప్రదేశ్‌లోని షహరన్ పూర్, ఇప్పుడు భీమా-కొరేగావ్ ఘటనలపై ప్రధాని ఎందుకు నోరుమెదపడంలేదు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే ఈ దాడులు ఎందుకు జరుగుతున్నాయి?' అని మెవానీ ప్రశ్నించారు. 'దేశంలో శాంతియుతంగా ఆందోళనలు చేసుకునే హక్కు దళితులకు ఉందో లేదో ప్రధాని స్పష్టం చేయాలి. దళితులపై జరుగుతున్న దురాగతాలపై ఆయన ఎందుకు స్పందించడంలేదు?' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీలోని ప్రెస్ క్లబ్‌లో మీడియా సమావేశంలో జిగ్నేశ్ ప్రసంగించారు. తాను భీమా కోరేగావ్ వెళ్లలేదనీ, రెచ్చగొట్టే ప్రసంగం చేయలేదని ఆయన స్పష్టం చేశారు. నా ప్రతిష్టను దెబ్బతీయడం ద్వారా గుజరాత్‌లో జరిగిన నష్టాన్ని పూడ్చుకోవాలని బీజేపీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. 'కుల రహిత సమాజం కావాలని మేం కోరుకుంటున్నాం. ఒకపక్క చంద్రుడిపై నీటి కోసం అన్వేషణలు జరుగుతున్నాయి. అదే సమయంలో కులం పేరుతో కొట్టిచంపుతున్నారు. నన్ను లక్ష్యంగా పెట్టుకున్నారు. నేను ఎన్నికైన ప్రజా ప్రతినిధిని. బీజేపీ ప్రతీకార చర్యల్లో భాగంగానే నాపై కేసు పెట్టారు. దళితుల కోసం గళం విప్పినవారిని, రైతులను లక్ష్యంగా చేసుకొని వేధిస్తున్నారు' అని మెవానీ అన్నారు. ఈ నెల 9న యువ హంకర్ ర్యాలీని ఢిల్లీలో నిర్వహించనున్నట్టు ప్రకటించారు. ర్యాలీ తర్వాత ఒక చేతిలో మనుస్మృతి, మరో చేతిలో రాజ్యాంగాన్ని పట్టుకొని తాను ప్రధాన మంత్రి కార్యాలయానికి వెళతానని చెప్పారు. రెండిటిలో ఏదో ఒకటి ఎంచుకోవాల్సిందిగా ఆయనను కోరతానన్నారు.

లక్నో హజ్ హౌస్‌కు కాషాయ రంగు

యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వ వివాదాస్పద చర్య




లక్నో : విద్యార్థులకు ఇచ్చే ప్రశంసా సర్టిఫికెట్లతో మొదలు పెట్టి.. బస్సులు, ఆ తర్వాత సచివాలయం ఇలా వరుసపెట్టి కాషాయమయం చేస్తున్న యూపీ ప్రభుత్వం మరో వివాదాస్పద చర్యకు పాల్పడింది. లక్నోలోని పలు భవనాలకు కాషాయరంగువేయిస్తున్నది. ఇందులో భాగంగా ముస్లింలకు సంబంధించి 'హజ్ హౌస్' గోడలకు కూడా కాషాయ రంగు వేయించారు. హజ్ హౌస్ గోడలు తెలుపు, ఆకుపచ్చ రంగులతో ఉండగా.. ఇప్పుడు ఆ గోడలన్నింటికీ కాషాయరంగు వేసేశారు. ముస్లింలతో సహా ప్రతిపక్షాలన్నీ ఈ చర్యను ఖండిస్తున్నాయి.. నిరసన వ్యక్తం చేస్తున్నాయి.

ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా మతపర ఉద్రేకాలను రెచ్చగొడుతోందని ఆరోపిస్తున్నారు. గతేడాది మార్చిలో అధికారాన్ని చేపట్టిన యోగి సర్కార్ 'కాషాయ' ఎజెండాతో ముందుకు పోతోంది. తన కార్యాలయం ఉండే లాల్‌బహుదూర్ శాస్త్రి భవన్‌కు కాషాయరంగు వేయించారు. ప్రభుత్వ ప్రజా సంబంధాల శాఖ విడుదల చేసే బుక్‌లెట్స్, పోస్టర్లను కాషాయ రంగులోనే ముద్రిస్తున్నారు. ముఖ్యమంత్రి యోగి కూర్చునే రూమ్‌లో కర్టెన్స్, ఆయన కాన్ఫరెన్స్‌లో ఉండే కుర్చీలకు వేసే కవర్లు, అన్నీ కాషాయరంగువే. 43 ఏండ్ల యోగి ఎప్పుడూ కాషాయ దుస్తుల్లోనే కనిపిస్తుండటం తెలిసిందే. ముస్లిం పండుగలకు సెలవులు తగ్గించుకోవాలనీ, హిందూ పండుగలకు కూడా సెలవులు ఇవ్వాలని మదర్సాలకు యోగి ప్రభుత్వం రెండు రోజుల క్రితం ఆదేశాలు జారీసిన విషయం తెలిసిందే.

అందులో తప్పేముంది : యూపీ మంత్రి

హజ్ హౌస్‌కు కాషాయరంగు వేయడంపై వస్తున్న విమర్శలపై ఆ రాష్ట్ర మంత్రి మొహ్సిన్ రాజా స్పందించారు. అందులో తప్పేముందంటూ ప్రశ్నించారు. కాషాయపు రంగు ఉత్సాహాన్ని నింపుతుందని, ఆ కలర్ వేయడంతో హజ్ భవనం చాలా అందంగా కనిపిస్తుందని అన్నారు. దీనిపై ప్రతిపక్షాలు రాద్ధాంతం చేయాల్సిన అవసరంలేదని వ్యాఖ్యానించారు.

తొగాడియా, బీజేపీ ఎమ్మెల్యేపై వారెంట్



గాంధీనగర్: విశ్వహిందూ పరిషత్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రవీణ్‌తొగాడియా, సిట్టింగ్ ఎమ్మెల్యే బాబూజమ్నాదాస్ పటేల్‌సహా మరో 38మందికి అహ్మదాబాద్ మెట్రోపాలిటన్ కోర్టు నాన్ బెయిలెబుల్ వారెంట్(ఎన్‌బీడబ్ల్యూ) జారీ చేసింది. 1996లో ఓ హత్యా యత్నం కేసులో వీరందరినీ జనవరి 30లోగా తమ ముందు హాజరు కావాలని కోర్టు ఆదేశించింది. ఈ కేసులో మరో నిందితుడు తాను ఎప్పుడు పిలిచినా కోర్టుకు హాజరవుతా నంటూ హామీ ఇవ్వడంతో ఎన్‌బీడబ్ల్యూ నుంచి మినహాయించింది. వివరాలు ఇలా ఉన్నాయి: 1996లో గుజరాత్‌లోని బీజేపీలో ముఠాపోరు తారాస్థాయికి చేరుకున్నది. ఆ సందర్భంగా 1996, మే 26న అహ్మదాబాద్‌లోని సర్దార్‌పటేల్ స్టేడియంలో ఆ పార్టీ ఓ సమావేశాన్ని నిర్వహించింది. ఆ సమావేశంలో కేశూభాయిపటేల్ గ్రూపుకు చెందినవారు శంకర్‌సింగ్‌వాఘేలాకు చెందినవారిపై దాడికి పాల్పడ్డారు. వాఘేలా గ్రూపుకు చెందిన ఆత్మారాంపటేల్ ప్రాణభయంతో అక్కడి నుంచి పారిపోతుండగా ఆయన దోతీని లాగేసి దాడికి యత్నించారు. అర్ధనగ్నంగా ఆయన అలాగే పరుగెత్తి దుండగుల దాడి నుంచి తనను తాను కాపాడుకున్నారు. అప్పట్లో ఈ సంఘటన ఆత్మారాం దోతీకాండగా ప్రచారం పొందింది. బీజేపీ-సంఘ్‌పరివార్ దాడిని పలు రాజకీయ పార్టీలు తీవ్రంగా ఖండించాయి. ఈ సంఘటన తర్వాత బీజేపీ నుంచి వేరు పడిన వాఘేలా గ్రూపు కాంగ్రెస్‌లో చేరింది. ఇటీవలి గుజరాత్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ నుంచి వేరుపడిన వాఘేలా జనవికల్ప్ మోర్చా పేరుతో సొంతపార్టీ స్థాపించారు. కేశూభాయిపటేల్ కూడా 2012లో బీజేపీకి రాజీనామా చేసి గుజరాత్ పరివర్తన్ పార్టీ పేరుతో సొంత కుంపటి పెట్టి రెండేండ్లపాటు కొనసాగించారు. ఆ తర్వాత తిరిగి బీజేపీలో చేరిపోయారు. పటేల్, వాఘేలా ఇద్దరూ గుజరాత్‌కు ముఖ్యమంత్రులుగా పని చేసినవారే కావడం గమనార్హం. దేశంలోని కోర్టుల్లో పదేండ్లకుపైగా పేరుకుపోయిన కేసుల్ని పరిష్కరించాలంటూ సుప్రీంకోర్టు ఇటీవల సూచించిన నేపథ్యంలో ఈ కేసుపై తిరిగి విచారణ ప్రారంభించినట్టు తెలుస్తోంది.

తమిళనాట ఆర్‌టీసీ బంద్

- బకాయిల చెల్లింపు, వేతనాల సవరణపై కుదరని అంగీకారం

చెన్నై : తమిళనాడులో రోడ్డు రవాణా స్థంభించింది. తమిళనాడు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు చెందిన ఉద్యోగులకు ప్రభుత్వం ఇవ్వజూపిన వేతనాల ఒప్పందాన్ని నిరసిస్తూ వివిధ ఆర్‌టీసీ ఉద్యోగుల సంఘాలకు చెందిన సభ్యులు గురువారం అర్ధరాత్రి నుంచి సమ్మె ప్రారంభించారు. తమిళనాడు రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి ఎం. ఆర్. విజయ్ భాస్కర్‌తో బకాయిల చెల్లింపు, వేతన సవరణకు సంబంధించిన ఒప్పందంపై ఉద్యోగుల సంఘాలు జరిపిన చర్చలు విఫలమవ్వడంతో ఆర్‌టిసి సిబ్బంది సమ్మెకు దిగారు.

ఇది ఆంధ్రప్రదేశా.. కర్నాటకనా?





మైనార్టీ కవిత్వ పుస్తకావిష్కరణను అడ్డుకున్న బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ శక్తులు
బెజవాడ పుస్తక మహోత్సవంలో రెచ్చిపోయిన కాషాయ మూకలు

విజయవాడ : రెండు తెలుగురాష్ట్రాల్లోని రచయితలు, కవులు ఆందోళన చెందే ఘటన రెండు రోజుల క్రితం విజయవాడలో జరిగింది. స్కై బాబా, షాజహాన్‌లపై విజయవాడ పుస్తక మహోత్సవంలో జరిగిన దాడి వెనుక బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ శక్తులు ఉన్నాయన్న అనుమానాలు కలుగుతున్నాయి. కాషాయ మూకలు కర్నాటక, మహారాష్ట్రలలో ఎంతోమంది అభ్యుదయ రచయితల గొంతునులిమేశాయి. అలాంటి భీతావహ పరిస్థితి విజయవాడ పుస్తక మహోత్సవ్‌లో నేడు కనపడింది. ఆంధ్రాని తిడుతూ స్కై బాబా కవిత్వాలు రాశాడని ఆరోపిస్తూ, ప్రాంతీయవాదంతో ఆంధ్రా ప్రజల్ని రెచ్చగొట్టే పనిని, తద్వారా తాము చేసిన దాడిని సమర్థించుకునే పనిని బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ చేస్తున్నాయి. మైనార్టీ రచయితలపై దాడికి దిగటాన్ని చూసినవారంతా...ఇది ఆంధ్రప్రదేశా, కాషాయ మూకలు పాలిస్తున్న ఉత్తరప్రదేశా...అన్న అనుమానం కలిగింది.

అసలేం జరిగింది ?

స్కైబాబా, షాజాహానాల సంపాదకత్వంలో 35 మంది మైనార్టీ రచయితలు రాసిన కవితల సంకలనం'మొఖామి'ని పుస్తక మహోత్సవ్(గత బుధవారం రాత్రి)లో ఆవిష్కరించాల్సి ఉంది. అంతకుముందే అక్కడకు చేరుకున్న బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ శక్తులు స్కైబాబాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వాతావరణాన్ని ఉద్రిక్తంగా మార్చారు. నిర్వాహకులతో తీవ్రస్థాయిలో వాగ్వివాదానికి దిగారు. ప్రాంతీయవాదంతో విషయాన్ని ముడిపెట్టి, కావాలనే మైనార్టీ రచయితలపై దాడికి తెగబడ్డారు. దీంతో పుస్తకావిష్కరణ వాయిదా పడింది. స్కైబాబాను నిర్వాహకులు, రచయితలు రక్షణగా నిలబడి అక్కడి నుంచి తరలించాల్సివచ్చింది.

ఆవిష్కరిస్తున్నది స్కైబాబా రాసిన పుస్తకం కాదని, ఆయన సంపాదకత్వంలో వచ్చిన మైనార్టీ కవిత్వ పుస్తకాన్ని మాత్రమేనని నిర్వాహకులు నచ్చచెప్పడానికి ప్రయత్నించినా బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు ఖాతరు చేయలేదు. కార్యక్రమానికి హాజరైన పలువురు కవులు, రచయితలు స్కైబాబా కవితలతో తాము ఏకీభవించడం లేదని, అయితే పుస్తకాన్ని ఆవిష్కరించుకునే హక్కు ఆయనకుందని చెప్పడానికి ప్రయత్నించినా వారు వినలేదు. దీంతో కార్యక్రమాన్ని వాయిదా వేయాల్సివచ్చింది.

ఎవరైనా కార్యక్రమాలు నిర్వహించుకోవచ్చు : విజయకుమార్

విజయవాడ పుస్తక మహోత్సవ్‌లో ఎవరైనా కార్యక్రమాలను నిర్వహించుకోవచ్చని పుస్తక మహోత్సవ్ సమన్వయకర్త, ఎమెస్కో బుక్‌హౌస్ అధినేత కె.విజయకుమార్ అన్నారు. అందుకే అనుమతించామని పుస్తక మహోత్సవ్‌లో ఎవరైనా ఒక్కటేనని అన్నారు. అయితే కొంత మంది మనోభావాలు దెబ్బతిన్నకారణంగా స్కై బాబా పుస్తకావిష్కరణను నిలుపుదల చేస్తున్నట్టు ప్రకటించారు.

వివాదాస్పదమైన పోలీసుల తీరు

ముందుగా ప్రకటించిన కార్యక్రమాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నించిన బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నేతల్ని వారించడానికి బదులుగా నిర్వాహకులపై పోలీసులు ఆగ్రహం వ్యక్తం చేసిన తీరు వివాదాస్పదంగా మారింది. ఏసీపీ కె.శ్రీనివాసులు ఒక దశలో నిర్వాహకులను, ప్రచురణకర్తలను ఆరునెలల పాటు లోపలేస్తానని హెచ్చరించడం వినిపించింది.

నేడు నేరెళ్లకు పాదయాత్ర...

సిద్దిపేటలో ప్రారంభం :

వామపక్షాలు, టీజేఏసీ, టీపీఎఫ్

- సికింద్రాబాద్ క్లాక్ టవర్ సెంటర్‌లో అమరులకు నివాళి
- ప్రశ్నించే హక్కునే ప్రశ్నిస్తున్నారు : తమ్మినేని
- అనుమతినిచ్చినా ఇవ్వకపోయినా నిర్వహిస్తాం : చాడ



మాట్లాడుతున్న తమ్మినేని, చిత్రంలో మురహరి, జానకిరాములు, వెంకటరెడ్డి, చాడ, చలపతిరావు, రమ, గోవింద్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నేరెళ్ల బాధితులకు అండగా నిలబడాలని నిర్ణయించిన నేపథ్యంలో.. వామపక్షాలు, టీజేఏసీ, టీపీఎఫ్ శనివారం సిద్దిపేట జిల్లా కేంద్రం నుంచి నేరెళ్ల వరకు పాదయాత్ర నిర్వహించనున్నాయి. ఇందులో భాగంగా ఉదయం 7.30 గంటలకు సికింద్రాబాద్ క్లాక్ టవర్ సెంటర్‌లో అమరవీరులకు నాయకులు నివాళులర్పించనున్నారు. అనంతరం సిద్దిపేటకు బయల్దేరి వెళ్లి.. అక్కణ్నుంచి పాదయాత్ర నిర్వహిస్తామని సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో జె.చలపతిరావు, కె.రమ (సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ), జానకిరాములు, గోవింద్ (ఆరెస్పీ), మురహరి (ఎస్‌యుసీఐ-సీ), వెంకటరెడ్డి (టీజేఏసీ), రవిచంద్ర (టీపీఎఫ్) తదితరులతో కలిసి వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. తమ్మినేని మాట్లాడుతూ.. కేసీఆర్ సర్కారు ప్రశ్నించే హక్కునే ప్రశ్నిస్తున్నదని విమర్శించారు. ఇది ఎల్లకాలం కొనసాగబోదని అన్నారు. ఒకవేళ అలా భావిస్తే అది వారి అవివేకమని ఎద్దేవా చేశారు. దేశవ్యాప్తంగా దళితులపై మతోన్మాదుల దాడులు కొనసాగుతున్న క్రమంలో టీఆర్ఎస్ ప్రభుత్వం కూడా వాటిని సమర్థిస్తున్నదని అన్నారు. జీఎస్టీ, పెద్ద నోట్ల రద్దు తదితర ఆర్థిక విషయాల్లోనేగాక యజ్ఞాలు, యాగాలు చేయటం ద్వారా కేసీఆర్ మతాంశాల్లో కూడా బీజేపీకి మద్దతునిస్తున్నారని తెలిపారు. నేరెళ్ల ఘటనను ఈ కోణంలోంచే చూడాలని అన్నారు. ఇసుక దందాకు, మాఫియాకు వత్తాసు పలుకుతున్న పాలకులు.. ఆ పేరుతో అట్టడుగు వర్గాలవారిని, దళితులను అణచివేస్తున్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలో పాదయాత్ర నిర్వహించటం ద్వారా నేరెళ్ల బాధితులకు అండగా నిలబడతామని చెప్పారు. చాడ మాట్లాడుతూ.. పాదయాత్రకు అనుమతినివ్వాలంటూ వారం రోజుల క్రితమే పోలీసు అధికారులకు వినతిపత్రమిచ్చామని తెలిపారు. అయినా ఇప్పటి వరకూ ప్రభుత్వం స్పందించలేదని విమర్శించారు. అనుమతినిచ్చినా ఇవ్వకపోయినా పాదయాత్ర నిర్వహించి తీరతామని స్పష్టం చేశారు.

ఎస్సీ వర్గీకరణపై ఉద్యమిస్తున్న మందకృష్ణ మాదిగపట్ల ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తున్నదని అన్నారు. ఆయన్ను పదేపదే అరెస్టు చేయటం దారుణమని వ్యాఖ్యానించారు. మందకృష్ణను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రమ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పౌర హక్కులు పూర్తిగా కాలరాయబడుతున్నాయని అన్నారు. నేరెళ్ల ఘటన జరిగి ఆర్నెల్లు పూర్తయినా ప్రభుత్వం నిందితులపై ఎందుకు చర్యలు తీసుకోవటం లేదని ప్రశ్నించారు. అసలు ఈ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా? లేదా? అని ప్రశ్నించారు.

మాదాసుకు సహకారం అందించండి

- అధికారులకు బుర్రా వెంకటేశం ఆదేశం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అర్జున అవార్డు గ్రహీత, ప్రస్తుతం పార ఒలంపిక్స్ ఆఫ్ ఇండియా సభ్యుడు మాదాసు శ్రీనివాసరావుకు అందాల్సిన అన్నీ సహాయ సహకారాలు అందించాలని రాష్ట్ర టూరిజం, క్రీడా శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం అధికారులను ఆదేశించారు. ఈమేరకు శుక్రవారం సచివాలయంలో బుర్రాను కలిసి ఆయన వినతిపత్రం సమర్పించారు. శ్రీనివాసరావు వికలాంగుడు కావడంతో మూడు చక్రాల మోటారు వాహనం లేకపోవడంతో బయటకు వెళ్లడానికి ఇబ్బందిపడుతున్నట్టు ఆయన పేర్కొన్నారు. 2003లో వికలాంగుల విభాగంలో ఆయనకు అర్జున అవార్డు వరించింది.

కీచక లెక్చరర్‌కు దేహశుద్ధి

- విద్యార్థినులతో అసభ్య ప్రవర్తన
- మహిళా ప్రిన్సిపాల్‌కు తెలిపినా పట్టించుకోని వైనం
- కాలేజీకి వచ్చి దేహశుద్ధి చేసిన విద్యార్థినుల తల్లిదండ్రులు
- లెక్చరర్‌ను అరెస్టు చేసిన పోలీసులు
- జహీరాబాద్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఘటన



నవతెలంగాణ-జహీరాబాద్

ఓ అధ్యాపకుడు విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తూ వేధిస్తున్నాడు. తనతో చనువుగా ఉండకపోతే ఫెయిల్ చేస్తానని బెదిరింపులకు దిగాడు. ఆ కీచక లెక్చరర్ వేధింపులపై ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవటంతో మరింత రెచ్చిపోయాడు. ప్రాక్టికల్ మార్కులు వేయనని భయపెడుతూ విద్యార్థులను లొంగదీసుకోవడానికి ప్రయత్నించాడు. ఇక అతని ఆగడాలను తాళలేక విద్యార్థినులు తల్లిదండ్రులకు మొరపెట్టుకున్నారు. దీంతో తల్లిదండ్రులంతా కలిసి ఆ లెక్చరర్‌కు దేహశుద్ధి చేవారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం జరిగింది. కెమిస్ట్రీ లెక్చరర్ శ్రీనివాస్ కొంతకాలంగా విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తూ వేధిస్తున్నాడు. తనతో చనువుగా ఉండకపోతే ఫెయిల్ చేస్తానని, ప్రాక్టికల్ పరీక్షల్లో మార్కులు వేయనని భయభ్రాంతులకు గురిచేసి లొంగదీసుకునే ప్రయత్నం చేస్తున్నాడు. అతడి వ్యవహార శైలిపై విద్యార్థినులు పలుమార్లు ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేశారు. అయినా, ఆమె పట్టించుకోలేదు. రోజురోజుకూ ఆగడాలు పెరిగిపోవడంతో భరించలేని విద్యార్థినులు శుక్రవారం విషయం తల్లిదండ్రులకు చెప్పారు. మహిళా ప్రిన్సిపాల్ ఉన్నా విద్యార్థినులపై జరుగుతున్న వేధింపులను నిరోధించడానికి చర్యలు తీసుకోవడం లేదని, ఆమె కూడా కెమిస్ట్రీ లెక్చరర్‌కు అనుకూలంగా వ్యవహరిస్తోందనే అనుమానాన్ని విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు కాలేజీకి చేరుకుని కెమిస్ట్రీ లెక్చరర్ శ్రీనివాస్‌కు చెంప దెబ్బలతో గుణపాఠం చెప్పారు. పాఠాలు చెప్పాల్సిన అధ్యాపకుడు బాలికలతో అసభ్యంగా ప్రవర్తించడం దుర్మార్గం అని అన్నారు. కీచక లెక్చరర్‌ను అధికారులు వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థినులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు చేరుకుని లెక్చరర్ శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఇదిలా ఉంటే లెక్చరర్ శ్రీనివాస్ ఎక్కడ పనిచేసినా ఆ ప్రదేశంలో పనిచేసే మహిళలు, విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తుంటాడని.. అందుకే అతడిని తరచూ బదిలీలే చేస్తారని తెలిసింది.

విద్యార్థినుల ఫిర్యాదుతో అరెస్టు చేశాం : సీఐ నాగరాజు

కెమిస్ట్రీ లెక్చరర్ శ్రీనివాస్ తమతో అసభ్యక రంగా ప్రవర్తిస్తూ లైంగికంగా వేధిస్తున్నాడని విద్యార్థినులు ఫిర్యాదు చేశారు. దీంతో అతన్ని అరెస్టు చేశాం. విచారణ రిపోర్టును ఉన్నతాధికా రులకు అందజేస్తాం.

కనీస వేతనాల అమలుకు ఉద్యమం

ఏఐటీయూసీ కార్యదర్శి విజయలక్ష్మి



నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

కనీస వేతనాలు ఇవ్వడంతో పాటు సమాన పనికి సమాన వేతనం విధానాన్ని అమలు చేయాలని ఏఐటీయూసీ జాతీయ కార్యదర్శి బీవీ విజయలక్ష్మి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. లేకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. శుక్రవారం ఏఐటీయూసీ కార్యాలయంలో ఆ సంఘం రాష్ట్ర సమితి సమావేశం జరిగింది. ఈ సమావేశాలకు ముఖ్య అతిథిగా హాజరైన విజయలక్ష్మి మాట్లాడుతూ...కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వంలో దేశవ్యాప్తంగా బడుగు, బలహీనవర్గాలు, మైనారిటీలపై దాడులు పెరుగుతున్నాయని అన్నారు. కార్పొరేట్ పెట్టుబడిదారులకు అనుకూలంగా విధానాలు చేపడుతూ, ప్రభుత్వరంగ సంస్థలైన బ్యాంకిం గ్, బీఎస్ఎన్ఎల్, రక్షణ, రైల్వే లాంటి సంస్థలను నిర్వీ ర్యం చేసేందుకు కుట్రలు పన్నుతుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ స్కీముల్లో పనిచేసే కార్మికులకు కనీసవేతనం రూ.18 వేలు, రూ.3వేల పింఛన్ విధానం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉజ్జిని రత్నాకర్‌రావు, రాష్ట్ర ఉపాధ్య క్షులు వి.సీతా రామయ్య, కె.రాజిరెడ్డి, కె.గంగాధర్‌రావు, సామల మల్లేశం, ఉపప్రధా నకార్యదర్శి ఎస్.బాల్‌రాజ్, కార్యదర్శులు ఎం.డీ యూసుఫ్, బి.చంద్రయ్య, వీ.ఎస్.బోస్, బి.వెంకటేష్, విలాస్, ఎన్.నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఆదివాసీ యువకులపై వేధింపులు ఆపాలి

టీఏజీఎస్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల్లోని ఏజెన్సీలో ఆదివాసీ యువకులపై వేదింపులు ఆపాలని తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు శుక్రవారం సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తొడసం భీంరావు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆదిలాబాద్ జిల్లాల్లో ఆదివాసి యువకులపై టీఆర్ఎస్ ప్రభుత్వమే వేదింపులకు పాల్పడుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల ఏజెన్సీలో జరిగిన ఘటనలకు ఆదివాసీ యువకులే బాధ్యులను చేస్తూ స్థానిక టీఆర్ఎస్ నేతలు 50 మంది పేర్లతో లిస్ట్ తయ్యారు చేశారని పేర్కొన్నారు. ఆదివాసీలు ఆరాధ్య దైవంగా భావించే కుంరంభీ స్మారక మ్యూజియంలో ఆదివాసుల మనోభావాలను గౌరవించకుండా ఇతర కులాల ప్రతిమలు పెట్టి ఆదివాసీలు- లంబాడాల మధ్య గొడవలు పెట్టించింది టీఆర్ఎస్ ప్రభుత్వమే అని విమర్శించారు. ఇప్పుడు తమ తప్పును కప్పిపుచ్చుకోవడానికి ఆదివాసీ యువకులపై కేసులు పెట్టి అరెస్టు చేయడం అన్యాయమన్నారు. ఆదివాసిలపైన పెట్టిన కేసులను ఎత్తివేసి ఆదివాసీ యువతకు ఉపాధి చూపించాలని డిమాండ్ చేశారు.

సంపాదకీయం

అమానవీయం...

ఈ దేశంలో కులం ఒక రాచపుండని పదే పదే నిరూపితమవుతున్నది. ఈ సమాజం ఆధునికతను సంతరించుకునే కొద్దీ క్రమేణా కనుమరుగవ్వాల్సిన కులం కమలనాథుల ఏలుబడిలో వేయి తలల విషనాగై బుసలుకొడుతున్నది. మొన్న మహారాష్ట్రలో దళితులపై జరిగిన దాష్టీకం మరువక ముందే నిన్న గుజరాత్‌లో ఖాకీలు ఓ దళితునితో బూట్లు నాకించిన అమానవీయ సంఘటన బీజేపీ పాలనా తీరుకు అద్దం పడుతున్నది. "ఓ కులమా నీవెంతటి కసాయివే.." అంటారు డాక్టర్ అంబేద్కర్. ఎందుకంటే.. ఒకరికి అధికారమిచ్చి, సంపదలూ.. సౌభాగ్యమిచ్చి, సామాజిక హోదానిచ్చి అనేకులకు బానిస సంకెళ్లు వేసింది కులం. మనిషి నుండి మనిషిని చీల్చి ఒకనికి దైవత్వాన్నిచ్చి అనేకులకు మనిషి హోదానే నిషేధించింది కులం. కనుకనే ఈ కుల వ్యవస్థను కూకటివేళ్ళతో పెకరించాలన్నారు అంబేద్కర్. కుల మతాలకతీతమైన లౌకిక వ్యవస్థను కలగన్నాడు. కుల వ్యవస్థను పెంచి పోషించే మనుధర్మాన్ని మట్టుబెట్టాలన్నాడు. కానీ ఆ మనుధర్మానికే పట్టం కట్టే కుట్రలు జరుగుతున్నాయి నేడు. ఒక వైపు ఓట్ల కోసం అంబేద్కర్ జపం చేస్తూనే, ఆయన నిలువెత్తు విగ్రహాలు ఆవిష్కరిస్తూనే, సామాజిక సమానత్వంతోనే బలమైన జాతి నిర్మాణం చేయవచ్చన్న ఆయన ఆశయాలకు నిలువునా తూట్లు పొడుస్తోంది హిందూత్వ పరివారం. ఇది ఆయనను అంగీకరించినట్టు నటిస్తూనే నిర్మూలించే కుట్ర అని మోడీ హయాంలో దేశంలో జరుగుతున్న సంఘటనలనేకం నిరూపిస్తున్నాయి.

ఈ దేశంలో సాగుతున్న సాంఘిక, రాజకీయ ప్రయత్నాలను, ఉద్యమాలను గుర్తెరిగి నడుచుకోవాలి. అమానవీయ కుల వివక్షను ఇంకా సజీవంగా ఉంచాలన్న వ్యూహాలు ఎంత నిజమో, వాటికి ప్రజల ప్రతిఘటన కూడా అంతే నిజమని గుర్తించాలి. లేనట్టయితే ఆదరించి అధికారం ఇచ్చిన ప్రజలే అధఃపాతాళంలో పడేస్తారు...

కేంద్రంలో తిరుగులేని ఆధిక్యంతో బీజేపీ అధికారాన్ని హస్తగతం చేసుకున్నది మొదలు దేశవ్యాపితంగా ఈ హిందూత్వ శక్తుల ఆగడాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. ప్రత్యేకించి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులు, మైనారిటీలపై దాడులు దౌర్జన్యాలు మితిమీరిపోతున్నాయి. మహారాష్ట్రలో దళితుల ఆత్మగౌరవ స్ఫూర్తికి ప్రతీకగా ప్రతిఏటా వేడుకగా జరుపుకునే శాంతియుత ప్రదర్శనపై సంఘ్‌పరివారం విరుచుకుడి వీరంగమాడిన ఘటన ఇంకా అట్టుడుకుతుండగానే ప్రధాని సొంతరాష్ట్రమైన గుజరాత్‌లో దళితుడైన హర్షద్ యాదవ్‌తో పోలీసులు బూట్లు నాకించిన ఘటన దేశాన్ని కలవరపెడుతున్నది. ఇద్దరి మధ్య గొడవను ఆపడానికి ప్రయత్నించడమే అతని నేరమైంది. పైగా అతడు దళితుడు కావడం అంతకంటే నేరమైంది. ఈ కాషాయ మూకల పైత్యం ఖాకీలకూ ఎక్కిందేమో.. అతనిచే వరుసగా స్టేషన్లో ఉన్న ఖాకీలందరి కాళ్లు మొక్కించడమే గాక బూట్లు నాకించారు. ఇదేమి న్యాయం..? ఇది ఏ చట్టంలో ఉంది..!? ఇంత జరిగినా... ఈ ఘటనల పట్ల నిరసనలు వెల్లువెత్తుతున్నా బీజేపీ ప్రభుత్వాల్లో ఉలుకూ పలుకూ లేకపోవడం, ప్రత్యేకించి ప్రధాని యధాప్రకారం తన మౌనాన్నే ఆశ్రయించడం వారి ఉద్దేశాలను అర్థంగావిస్తోంది.



గత మూడున్నరేండ్లుగా ఒక వైపు దళితులు, మరోవైపు ముస్లిం మైనారిటీలపై ఈ దాడులు, దుర్మార్గాలు నిత్యకృత్యమయ్యాయి. జాతీయ నేరగణాంక సంస్థ నివేదికలు దీనిని రుజువుచేస్తున్నాయి. ఈ వరుస ఉదంతాలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తుండగా, ఈ ఉదంతాలపై కేంద్రం ఏనాడు నోరు విప్పకపోవడం మరింత ఆందోళన కలిగిస్తున్నది. కేంద్రం స్పందించక పోవడంలోని అంతరార్థమేమిటి..? ఈ దేశంలో దళితులుగా పుట్టడమే నేరమా..? సీపీఐ(ఎం) నేత సీతారాం ఏచూరి ప్రశ్నిస్తున్నట్టు దళితులు ఈ దేశంలో భాగం కాదా..? కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దళితులను భారతీయులుగా గుర్తించడం లేదా..!? అంబేద్కర్ చెప్పిన సమానత్వ స్ఫూర్తికి సంఘ్ పరివార్ వ్యతరేకమా..? తిరిగి ఈ దేశాన్ని మధ్య యుగాలకు తీసుకెళతారా..? మనుధర్మాన్ని పునఃప్రతిష్టిస్తారా..? చారిత్రకంగా అణచివేయబడిన దళితుల్లో ఇప్పుడు పెరుగుతున్న చైతన్యం అందుకు ఆటంకం అని భావిస్తున్నారా..? అందుకే వ్యూహాత్మకంగా దళితులపై అణచివేత, వివక్ష ధోరణులను అవలంబిస్తున్నారా..? బీజేపీ ప్రభుత్వ తీరు ఈ అనుమానాలకు ఆస్కారమిస్తుండగా, జరుగుతున్న ఘటనలు వాటికి మరింత బలం చేకూరుస్తున్నాయి. తాజా ఘటనలో హర్షద్ కులం గురించి అడిగి మరీ తాను దళితుడనని చెప్పిన వెంటనే క్షమాపణలు చెప్పించుకోవడం, చట్టవిరుద్ధంగా కాళ్ళు మొక్కించుకోవడం, బూట్లు నాకించుకోవడం ఎంత అమానుషం..! ఇది ఎంతటి అమానుషమో, ఈ ఘటనపై నిరసనలు వెల్లువెత్తుతున్నా కేంద్ర, రాష్ట్ర బీజేపీ ప్రభుత్వాల నుండి కనీస స్పందన లేకపోవడం అంతకంటే అమానుషం.

ఈ అమానుషాలను ప్రజలు గమనిస్తున్నారు. వీటినే కాదు, తమ అధికారం కొనసాగింపునకు ప్రజల హృదయాలను గెలవలేక విద్వేషాలను రెచ్చగొట్టడం, ప్రజల్లో వైషమ్యాలను సృష్టించడంపైనే ఆధారపడుతున్న అధికార పరివారం తీరుతెన్నులను అర్థం చేసుకుంటున్నారు. ప్రజల్లో పెల్లుబుకుతున్న అసంతృప్తి, నిరసనల్లో పాల్గొంటున్న తీరే ఇందుకు నిదర్శనం. ఇది ప్రజాగ్రహంగా మారకముందే ఏలికలు కండ్లు తెరవాలి. భారతీయ సమాజంలోని సమస్త శ్రేణులనూ సమానత్వంలోకి, సాధికారతలోకి తేవాలన్న బాధ్యతను మరిచి వ్యవహరిస్తున్న ప్రభుత్వం, ఇందుకోసం రెండువందల ఏండ్లుగా ఈ దేశంలో సాగుతున్న సాంఘిక, రాజకీయ ప్రయత్నాలను, ఉద్యమాలను గుర్తెరిగి నడుచుకోవాలి. అమానవీయ కుల వివక్షను ఇంకా సజీవంగా ఉంచాలన్న వ్యూహాలు ఎంత నిజమో, వాటికి ప్రజల ప్రతిఘటన కూడా అంతే నిజమని గుర్తించాలి. లేనట్టయితే ఆదరించి అధికారం ఇచ్చిన ప్రజలే అధఃపాతాళంలో పడేస్తారు...

ఆధునిక మనువాదంపై లాల్‌నీల్ సంఘటిత పోరు




సిహెచ్. కృష్ణారావు

బాహుబలిని కట్టప్ప ఎందుకు చంపాడన్న అంశాన్ని సినిమా రెండో భాగం విడుదలయ్యేవరకూ ప్రేక్షకులలో ఓ చర్చ సాగేలా చేశారు దర్శకుడు రాజమౌళి. దేశపాలనకు నేడు అనుసరణీయమైనది భారత రాజ్యాంగమా..? లేక మనుధర్మమా..? అన్నది దేశమంతా చర్చ జరిగేలా చేస్తున్నది సంఘపరివారం. దేశంలో వివిధ సామాజిక తరగతులపై జరుగుతున్న దాడులు కాకతాళీయంగా కాక ఉద్దేశ్యపూర్వకంగానే జరుగుతున్నాయని స్పష్టమవుతున్నది. బీజేపీ కార్యకర్తల నుండి మొదలు కేంద్ర కేబినెట్ మంత్రుల వరకూ దాడుల గురించి వారి మాటల్లో, చేతల్లో యివన్నీ కన్పిస్తున్నాయి.

మనువాద రూపాంతరంగా ఉన్న సంఘపరివార్ ఏలిక నుండి బయటపడటానికి ప్రత్యామ్నాయ మార్గం రూపొందుతున్నది. వామపక్ష, అభ్యుదయ, సామాజిక శక్తుల ఐక్యవేదికతో ప్రారంభమవుతున్న ఉద్యమ వెలుగు చూపుతున్నది. లాల్-నీల్ ఐక్యతా నినాదం తిరోగామి చాందస వాదంపై సమరశంఖం పూరిస్తున్నది. ఆ వేదిక విస్తరణకు ప్రజాస్వామిక వాదులంతా స్వాగతించాలి. సహకరించాలి.

బలవంతులైన పాలకులే దైవాంశ సంభూతులన్న మత ప్రచారాలతో, ప్రజానీకాన్ని నియంత్రించటాన్ని చరిత్రలో చూశాం. ప్రజల సామాజిక చైతన్యాన్ని బట్టి బల ప్రయోగం ద్వారా ప్రజలను నియంత్రించడం నేడు సాధ్యం గాదన్నది వాస్తవం. ఈనాడు మానసికంగా లొంగదీసుకోవటం ద్వారానే ఆధిపత్యం కోసం సంఘ పరివారం ప్రయత్నిస్తున్నది. దైవ ప్రతినిధులుగా పాలకులకు ప్రజలు లొంగివుండేలా నాడు పురోహితవర్గం చేయగలిగింది. నేడు రాజ్యాధికారంలో తమ భావజాలానికి అనుకూలంగా వున్న వారు కొనసాగేలా చూస్తున్నది ఈ సంఘపరివారం.

వ్యక్తిగత నమ్మకాలకు ఆచార, సాంప్రదాయాల ప్రచారానికి మూలం మతం. రాజ్యాధికారానికి ఆ మతాన్నే ఆధారం చేసుకున్నది సంఘపరివారం. దైవంపై విశ్వాసం మనిషి వ్యక్తిగతమన్నది స్వయం సేవకులకు తెలియంది కాదు. మెజారిటీగా ఉన్న హిందూ మతస్తుల మద్దతుతో రాజ్యాధికారానికి దగ్గర మార్గంగా భావించాడు సావర్కార్. మత ప్రచార, పరిరక్షకులుగా మెజారిటీ హిందువులు భావించాలన్న రీతిలో పరివార్ కార్యకలాపాలు రూపుదిద్దబడ్డాయి. నమ్మకాలు, ఆచారాలు, కులం, మతం మనోభావాల చుట్టే పరివార్ కార్యక్రమాలు అల్లుకుని ఉంటాయి. ప్రజల విభజన రాజకీయాలే విధానంగా పనిచేస్తున్నది సంఘపరివారం. దేశంలో నిరక్షరాస్యత, ఆర్థిక, సామాజిక వెనుకబాటుతనం, మూఢనమ్మకాలు నెలకొన్న పరిస్థితులు అందుకు దోహదపడుతున్నాయి. మత నమ్మకాలు వ్యక్తిగతంగా ఉండాలని, రాజకీయాలు ప్రభుత్వ పాలనలో ముడిపడితే ప్రజల విభజనకు దారితీస్తుందని చెపుతున్నది లౌకికవాదం. సంఘపరివారం లౌకికవాదాన్ని తన అస్తిత్వానికే ప్రమాదంగా భావించే తిరస్కరిస్తుంది. అందుకే లౌకికవాదులను శత్రువులుగా పరిగణిస్తోంది. నిరంతరం లౌకికవాదంపై ప్రచారం చేసే వ్యక్తులూ సంఘాలూ పార్టీలను లక్ష్యంగా చేసుకుని మరీ దాడి చేస్తున్నాయి.



మనువాద ఆధిపత్యం అగ్రవర్ణాలకే పరిమితమవటం అనేది గత చరిత్ర. మనువాద భావజాలం ప్రభావితులైన బహుజనుల అధికార పీఠం అధిరోహిస్తే ఆధిపత్యం నిరంతరం కొనసాగుతున్నదన్నది నేటి వాస్తవం. కేంద్రం, అనేక రాష్ట్రాల్లో పరివార్ పాలకులుగా వెనుకబడిన తరగతుల వ్యక్తులే అధికారంలో కొనసాగుతున్నా క్షేత్రస్థాయిలో ఏం జరుగుతున్నదో చూస్తున్నాం. ఘర్ వాపసీ పేరుతో మత మార్పిడులు, మత విద్వేషాలు, గోరక్షణ పేరుతో దళితులు, మైనార్టీలపై దాడులు చేస్తున్నాం. మతాంతర వివాహాలను అడ్డుకోవటానికి 'లవ్ జిహాద్' పేరుతో మత కలహాలను సృష్టించటం జరుగుతున్నది. కులాంతర వివాహాలను నిలువరించటానికి ప్రేమికులపై భజరంగదళ్, పరివార్ స్క్వాడ్‌లు దాడులు చేస్తున్నాయి. వెనుకబడిన కులాల ఎదుగుదలకు ఆసరాగా ఉంటున్న మన రాజ్యాంగాన్నే మార్చాలని పరివార్ చీఫ్ మోహన్‌భగవత్ తదితరులు ప్రకటనలను పత్రికలలో చూస్తున్నాం. అత్యున్నత విద్యా కేంద్రాలైన యూనివర్సిటీలలో మనువాద భావజాలాన్ని రుద్దే ప్రయత్నం చేస్తున్నారు. ఆ ఆధిపత్య సంస్కృతిని వ్యతిరేకించిన విద్యార్థులపై హెచ్‌సీయూ, జేఎన్‌యూ, బీహెచ్‌యూ, ఎస్‌యూ మొదలగు యూనివర్సిటీలలో జరిగిన వేధింపు ఘటనలను చూశాం. పురాణ పురుషుల జన్మస్థలాల వివాదాలతో విస్తరణ కోసం పరివార్ నిరంతరం ప్రయత్నిస్తున్నది. అయోధ్య రామజన్మభూమి నినాదం పాతబడుతోందని, కృష్ణజన్మభూమి గురించి వివాదం మొదలుపెట్టారు. తాజాగా తాజ్‌మహల్ పునాదుల్లోనే మరో దైవం జన్మకు మూలాలున్నాయనే ప్రచారం ప్రారంభించారు. 'సమస్య అయితే పరిష్కరించవచ్చు, కాని అల్లబడిన దాన్ని పరిష్కరించలేం' అన్నట్టు ఈ వివాదాల పుట్టుదల అంతులేని కథలా సాగుతూనే ఉంటుంది.

నాడు సమాజంలో ఆధిపత్యానికి మనుధర్మ శాస్త్రం నిర్వహించిన పాత్రనే నేడు సంఘపరివారం ఆధునిక పద్ధతిలో ఆచరిస్తున్నది. సంఘ పరివార్ క్రియాశీలకంగా పనిచేసిన ప్రతిచోట మత కలహాలు చోటు చేసుకున్నాయన్నది పలు ప్రభుత్వ దర్యాప్తు నివేదికలు వెల్లడించాయి. ఇటీవల మరో రాష్ట్ర బంద్‌కు కారణమైన పూణే దళితులపై దాడుల వెనుక పరివారం హస్తమేనన్నది స్పష్టమయింది. గుజరాత్‌లో ఓటమి భయంతో ప్రజలను రెచ్చగొట్టటానికి స్వయాన ప్రధాని, తన హత్యకు పాకిస్థాన్‌తో ప్రతిపక్షం కుట్ర చేసిందన్న ఆరోపణలు తెలిసినవే. ఓట్ల కోసం నీచంగా చేసిన చౌకబారు ఆరోపణలను రుజువు చేయాలంటూ ప్రతిపక్షాలు వారం రోజులు పార్లమెంట్‌ను స్తంభింపచేయటం చూశాం. అధికారికంగా నిక్షిప్తమై యున్న వారి నేరచరిత్రను తుడిచి వేయటానికి మోడీ ప్రభుత్వం చర్యలు తీసుకున్నది. 2014లో ప్రమాణ స్వీకారం అనంతరం తీసుకున్న నిర్ణయం గత చరిత్రకు సంబంధించిన వేలాది అధికార ఫైళ్ళను తగలబెట్టించిన విషయం అందరికీ తెలిసిందే.

నాడు పురోహిత మనువాద పోషకులుగా పాలక ప్రభువులుంటే, నేడు ఆధునిక పరివార్ శక్తులకు భూస్వాములు, కార్పొరేట్ యజమానులు పోషకులుగా చూస్తున్నాం. కార్పొరేట్‌సంస్థల దోపిడీ విచ్చలవిడిగా సాగుతున్నది. అవినీతి, నల్లధనం వెలికి తీయటం ఎంత ప్రహసనంగా మారాయో చూశాం. నోట్ల రద్దుతో నల్లధనం తెల్లధనంగా మారిన తీరు బయటపడింది. ఒకేదేశం, ఒకేజాతి, ఒకే పన్నంటూ జీఎస్‌టీపై ప్రచారం చేశారు. వాస్తవంగా జరిగిందేమిటి? కార్పొరేట్లకు మినహా సామాన్య ప్రజలకు జీఎస్‌టీ పేరుతో ధరలు పెరిగి భారమైంది. బడా పారిశ్రామిక వేత్తల కనుగుణంగా కార్మిక చట్టాల్లో మార్పులు చేపట్టారు. భూసేకరణ చట్టాన్ని సవరించారు. కార్పొరేట్ యజమానులకు వచ్చే నష్టాలకు 'బెయిల్ అవుట్'తో రాయితీలు, వారి లక్షల కోట్ల అప్పులు మాఫీ చేస్తున్నారు. కార్పొరేట్ల అప్పులతో దివాళా తీస్తున్న బ్యాంకులను కాపాడటానికి ప్రజల డిపాజిట్లను వాడుకునే హక్కు బ్యాంకులకు కల్పించే ఎఫ్ఆర్‌డీఐ బిల్లును రూపొందించారు.

కార్పొరేట్ వర్గాలు మీడియా యాజమాన్యంలో భాగస్వాములయ్యాయి. తమకనుకూల విధానాలు అవలంబిస్తున్న కేంద్ర మోడీ పరివార్ పాలనకు రక్షణ కవచంలా ఉంటున్నాయి. ప్రభుత్వ విధానాలపై ప్రజానుకూల విశ్లేషణలు ప్రధాన మీడియాలో కనుమరుగవుతున్నాయి. ప్రజాస్వామ్యంలో ప్రధాన పిల్లరుగా భావించే మీడియాలో ప్రధాన భాగం వంచనకు పాల్పడటం అత్యంత దురదృష్టకరం.

కేంద్ర దర్యాప్తు సంస్థలను మోడీ ప్రభుత్వం ఉపయోగించుకున్న తీరు ప్రజాస్వామిక వాదులను ఆందోళనకు గురిచేస్తున్నది. గత కాంగ్రెస్ పాలనలోనూ ఈ సంస్థలను దుర్వినియోగ పరిచిన విషయాన్ని ఎవరూ కాదనలేరు. కానీ యిటీవల ప్రతిపక్షాలను అప్రతిష్టపాలు చేసే విధంగా, రాజకీయంగా లొంగతీసుకోవటానికి తమిళనాడు, కర్నాటక, గుజరాత్, బీహార్ మొదలైన చోట్ల ఈ దర్యాప్తుసంస్థల దాడులను అత్యంత చౌకబారు ఎత్తుగడలుగా మీడియాలో వెల్లువెత్తాయి. బయటపడిన భారీ కుంభకోణాలను సహితం ఉదాహరణకు 2జీ, వ్యాపం, జయేషా మొదలగు వాటిని దర్యాప్తు సంస్థల నియంత్రణతో నేడు మటుమాయం చేస్తున్నారు. ఏదేశంలో జరగని తీరులో పరివార్ పాలకులు రికార్డులు సృష్టిస్తున్నారు.

బీజేపీ పాలనపట్ల ప్రజలలో క్రమంగా భ్రమలు తొలగుతున్నాయి. ఇటీవల రాష్ట్ర అసెంబ్లీలకు జరిగిన ఎన్నికల ఓటింగ్ సరళి గమనిస్తే పరివార్ పాలనపై పెరుగుతున్న వ్యతిరేకత స్పష్టమవుతున్నది. పంజాబ్, గోవా, హిమాచల్‌ప్రదేశ్, గుజరాత్, ఎన్నికలలో బీజేపీకి గణనీయంగా ఓటింగ్ తగ్గింది.

సంఘపరివార్ లక్ష్యాలను ప్రజలు ముఖ్యంగా విద్యావంతులు అర్థం చేసుకుంటున్నట్టు కనిపిస్తున్నది. యూనివర్సిటీలలో యిటీవల 2017లో జరిగిన విద్యార్థి సంఘ ఎన్నికల్లో దాదాపు అన్ని చోట్ల పరివార్‌శాఖగా ఉన్న ఏబీవీపీ పరాజయం పాలైంది.

క్రమంగా వాస్తవాలను గమనిస్తున్న ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కార్పొరేట్ మీడియాకు ప్రత్యామ్నాయంగా సోషల్‌మీడియాలో ప్రజలు అసంతృప్తితో భగ్గుమంటున్నారు. తమ అధికారానికి ప్రచార అస్త్రంగా ఉపయోగపడిన సోషల్‌మీడియాను సహించలేక ఆంక్షలు పెడుతున్నారు.

మనువాద రూపాంతరంగా ఉన్న సంఘపరివార్ ఏలిక నుండి బయటపడటానికి ప్రత్యామ్నాయ మార్గం రూపొందుతున్నది. వామపక్ష, అభ్యుదయ, సామాజిక శక్తుల ఐక్యవేదికతో ప్రారంభమవుతున్న ఉద్యమ వెలుగు చూపుతున్నది. లాల్–నీల్ ఐక్యతా నినాదం తిరోగామి చాందస వాదంపై సమరశంఖం పూరిస్తున్నది. ఆ వేదిక విస్తరణకు ప్రజాస్వామిక వాదులంతా స్వాగతించాలి. సహకరించాలి.

సెల్: 9490098586

జై భీం, లాల్ సలాం ! ఇంక్విలాబ్ జిందాబాద్ !!



దయ్యపు రాధాకృష్ణ

గత డిసెంబర్ 4, 5, 6 తేదీలలో దళిత శోషన్ ముక్తి మంచ్ (డీఎస్ఎంఎం) 2వ, జాతీయ మహాసభలు తమిళనాడు రాష్ట్రంలోని మదురై నగరంలో రోహిత్ వేముల హాల్లో ఉత్తేజపూరిత వాతావరణంలో జరిగాయి. దేశంలోని గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాలు మినహాయించి (ఎన్నికలు ఉన్నందున) అన్ని రాష్ట్రాల నుండి 452 మంది ప్రతినిధులు ఈ మహాసభలకు హాజరయ్యారు. తెలంగాణలోని 27 జిల్లాల నుంచి 37 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. 2014లో ఢిల్లీలో జరిగిన మొదటి జాతీయ మహాసభలో 9 రాష్ట్రాల నుంచి మాత్రమే ప్రాతినిధ్యం వహించగా ఈ మూడేండ్లలోనే అన్ని రాష్ట్రాలకు విస్తరించడం, కార్యక్రమాలు చేపట్టడం, నిర్మాణం చేసుకోవడం వలన సంఘ ఆశయాలను, లక్ష్యాలను ముందుకు తీసుకుపోవడంలో పురోగతి సాధించిందని చెప్పుకోవచ్చు. తమిళనాడులో దళిత ఉద్యమంలో అసువులు బాసిన వారి స్మారకార్థం బయలుదేరిన జాతాల దీపాల స్వీకరణ, అమరుల స్థూపాలకు నివాళులతో ఉద్విగ్న సన్నివేశంలో మహాసభలు ఆరంభమయ్యాయి. మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరైన సామాజిక ఉద్యమకారుడు ప్రకాష్ అంబేద్కర్ ప్రారంభోపన్యాసం చేసారు. ఐఏఎస్ మాజీ అధికారి కృష్ణన్ బాలాజీ, ఇతర ప్రజా సంఘాల నాయకులు సందేశాలిచ్చారు. ఉద్యమం విస్తరించాలనీ, బలపడాలనీ అందుకు సహకరిస్తామనీ తెలియజేశారు. డీఎస్ఎంఎం కన్వీనర్ రాధాకృష్ణన్, కోకన్వీనర్ వి.శ్రీనివాస్‌రావు నిర్మాణ కార్యక్రమ నివేదికలను ప్రవేశపెట్టారు. వివిధ రాష్ట్రాల నుండి 32 మంది ప్రతినిధులు చర్చల్లో పాల్గొన్నారు. ముఖ్యంగా ఉత్తరాది రాష్ట్రాలలో దళిత ఉద్యమాలు వ్యక్తుల నాయకత్వంలో నడవటంవల్ల, నాయకులు స్వలాభం కోసం అధికార పార్టీలకు అనుకూలంగా మారటం, ప్రభుత్వంలో భాగస్వాములు కావడంతో దళితుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దళితుల పట్ల నిబద్ధత గల సంఘాలు బలపడితే తప్ప వారికి దారిలేదనీ, సంఘం బలపడాలనీ ఆకాంక్షించారు. సభ ఆసాంతం జై భీం లాల్‌సలాం, ఇంక్విలాబ్ జిందాబాద్ అనే నినాదాలతో మారు మోగింది. ఒక అపూర్వ సన్నివేశం, ఆదర్శంగా తీసుకోవాల్సిన సందర్భాన్ని తమిళనాడు రాష్ట్రం సృష్టించింది. ఈ రాష్ట్రంలోని దళితులకు, దళిత ఉద్యమాలకు రక్షణనిస్తున్న, తోడ్పాటునిస్తున్న కవులు, రచయితలు, డాక్టర్లు, లాయర్లను, దాడులకు గురైన, అమరులైన కుటుంబాలనూ ఉద్యమకారులనూ పోరాటయోధులుగా గుర్తించి ఘనంగా సన్మానించింది. ఈ సంఘటన తప్పకుండా దళిత ఉద్యమానికి ప్రేరణగా నిలుస్తుందనడంలో సందేహం లేదు. అయితే...దేశంలో ఇప్పటికే అనేక రాష్ట్రాలలో దళిత సంఘాలు ఉన్నాయి. అంబేద్కర్ సంఘాలూ ఉన్నాయి. వ్యక్తులు, సంస్థలు, అనేకం దళితుల సమస్యల పట్ల స్పందించడం, ఆందోళనలు చేయడం, అంబేద్కర్ ఆశయాలను విస్తృతంగా తీసుకుపోవడం జరుగుతున్నది. కానీ దేశం మొత్తంగా దళిత సమస్యపట్ల ఏకరూప ఉద్యమాన్ని మనం చూడలేం. ఒక ప్రాంతానికో, రాష్ట్రానికో ఆ సంఘటనలు, స్పందనలు పరిమితమయ్యేవి. ఇప్పుడు జాతీయస్థాయిలో అన్ని రాష్ట్రాలలో సంఘం విస్తరణ, నిర్మాణం రూపుదాల్చడంలో మొదటిసారిగా దేశంలోని దళితులపై జరుగుతున్న సామాజిక అణచివేత, దోపిడీ, మతోన్మాద ప్రమాదంపై పోరాడటానికి డీఎంఎస్ఎస్‌తో మార్గం సుగమమైనది.

సరళీకరణ ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా పోరాడకుండా, సంఘటితం కాకుండా, దళితుల ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక జీవన విధానాలను మెరుగుపర్చుకోవడం సాధ్యం కాదు. సామాజిక న్యాయం సాధించలేం. ఈనేపథ్యంలో దేశంలోని దళితుల సర్వతో ముఖాభివృద్ధిని విశాల ప్రాతిపదికన దళిత, సామాజిక, ప్రజాస్వామిక శక్తులను ఏకం చేసి ఐక్యతతో ఉద్యమాలను నిర్మించాల్సిన అవసరం, ఆవశ్యకతను మహాసభ వ్యక్తం చేసింది.



ఈ మహాసభ ప్రతినిధులు, సందేశకులు, ప్రధాన ఉపన్యాసకుల ద్వారా అనేక విస్తృతమైన భావజాల చర్చకు వేదికైంది. వర్తమాన భారతదేశంలో దళితుల ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక స్థితిగతులు, పరిష్కార మార్గాలపై అన్వేషణ జరిగింది. మనువాదం, కులనిర్మూలన, కులసంఘాలు రిజర్వేషన్లు, భూమి, పరిశ్రమలు, ఓట్లు, సీట్లు, రాజ్యాధికారం వంటి కీలకమైన అంశాలపై చర్చ జరిగింది. అంతేగాదు ఉత్తరాది రాష్ట్రాలలో దళితులపై దాడులు ఎక్కువగా జరగడానికి, వామపక్ష, ప్రజాతంత్ర ఉద్యమాలు బలంగా ఉన్న రాష్ట్రాలలో తక్కువగా ఉండటానికి కారణాలను విశ్లేశించింది. దళితులను ఒకే తాటిపైకి ఎలా తీసుకురావడం, కులసంఘాల నాయకులను మనువాద బూర్జువా పార్టీలలోకి వెళ్లకుండా నిరోధించడం, దళితుల సాధికారత సాధించే కార్యక్రమాలు చేపట్టడం ఎలా అని చర్చించింది. పదవులు, రాజ్యాధికారంతో దళితుల పరిస్థితిని పూర్తిగా మార్చవచ్చనే అభిప్రాయాలున్నాయి. అట్టడుగున వున్నవాళ్లకు పదవులు రావడం, అధికారం చేపట్టడం, హర్షణీయమే, దానికోసం కృషి చేయాల్సిందే కానీ, వ్యక్తులకు పదవులు ఇచ్చినంత మాత్రాన జాతి మొత్తం బాగుపడినట్టు కాదు. దళితులు ఆర్థికంగా, సామాజికంగా సాధికారత సాధించినప్పుడే సామాజిక న్యాయం జరుగుతుంది. సామాజిక న్యాయం వల్లనే సమాజ స్థిరత్వం ఏర్పడుతుందని అంబేద్కర్ అన్నారు. దళితుల సకల కష్టాలకు కారణం మనుధర్మ శాస్త్రమని దానిని బహిరంగంగా తగలబెట్టాడు అంబేద్కర్. ఈ దేశంలో కుల నిర్మూలన జరగాలనీ అందరూ సమానంగా జీవించే సమాజం రావాలనీ ఆకాంక్షించారు. ఆర్థిక స్వావలంబన కోసం రిజర్వేషన్లు ప్రవేశపెట్టారు. భూమి, పరిశ్రమలు జాతీయం చేయడంద్వారా సమానత్వం సాధించాలని కోరుకున్నారు. జీవించినంతకాలం వాటి అమలుపై అలుపెరగని పోరాటం చేశారు.

కానీ దేశంలో నేడు ఏం జరుగుతున్నది? దళితులను మనువు నేటికీ కులం పేరుతో దాడులు, హత్యలు, గోరక్షణ, ఆహారం, భాష, వేషధారణ అంటరానితనం, కులవివక్ష రూపాలలో వెంబడిస్తున్నాడు. సరళీకరణ ఆర్థిక విధానం అమలుతో అట్టడుగున ఉన్న దళితుల పరిస్థితి మరింత జటిలం అవుతున్నది. ప్రభుత్వరంగాన్ని పనిగట్టుకొని, ఉద్దేశ్యపూర్వకంగా నిర్వీర్యం చేయటంతో రిజర్వేషన్లు అక్కరకు రాకుండా పోతున్నాయి. భూమి, ఉపాధి బతుకుతెరువు లేక దళితుల్లో వలసలు, నిరుద్యోగం భయంకరంగా పెరుగుతున్నది. మతతత్వానికి, మనువాదానికి, సరళీకరణ ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా పోరాడకుండా, సంఘటితం కాకుండా, దళితుల ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక జీవన విధానాలను మెరుగుపర్చుకోవడం సాధ్యం కాదు. సామాజిక న్యాయం సాధించలేం. ఈనేపథ్యంలో దేశంలోని దళితుల సర్వతోముఖాభివృద్ధిని విశాల ప్రాతిపదికన దళిత, సామాజిక, ప్రజాస్వామిక శక్తులను ఏకం చేసి ఐక్యతతో ఉద్యమాలను నిర్మించాల్సిన అవసరం, ఆవశ్యకతను మహాసభ వ్యక్తం చేసింది.

సెల్ : 7730877841

పలాయనం పరిష్కారం కాదు...

బెంగాల్ నుండి వలస వెళ్ళిన ఒక కార్మికుడు రాజస్థాన్‌లో ఉగ్ర హిందూత్వవాదుల అసహన జ్వాలలో పైశాచికంగా బలయ్యాడు. బెంగాల్ మాల్‌దహ్ జిల్లాకి చెందిన అఫరాజుల్‌ని దాడిచేసి పెట్రోల్ పోసి దగ్ధం చేసి చంపారు. ఈ హత్యాకాండకి సంఘ్ పరివారం వ్యాపింపజేస్తున్న మతం, మతతత్వపరమైన విద్వేషం, అసహ్యమే దీనికి కారణం. దేశ వ్యాప్తంగా బీజేపీ, సంఘ్ పరివారం అసహ్యంతో కూడిన విభజన ప్రహరీగోడ లేపి రాజకీయ ధ్రువీకరణ కుట్రకు వల అల్లుతోంది. బెంగాల్‌లో కూడా ముస్లింల జనాభా గణనీయంగా ఉండటం చేత ఈ ప్రయత్నాలు అక్కడ కూడా కొనసాగుతూనే ఉన్నాయి. బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ బీజేపీ మతపరమైన విభజన రాజకీయాన్ని గట్టిగా ఎదుర్కునే బదులు వెనక్కి పోయే మార్గాన్నే ఎంచుకున్నారు. పొట్ట పోషించు కోవటానికి ఉపాధివేటలో బెంగాల్ నుండి వేరే రాష్ట్రానికి వెళ్ళిన వారిని ఆమె ఇలాంటి సంఘటనల దృష్ట్యా స్వరాష్ట్రానికి తరలి రమ్మని పిలుపునిచ్చారు. వేరే రాష్ట్రంలో బెంగాలీయులు ఉండటానికి, పని చేయటానికి హక్కు లేదన్నట్టు అక్కడ దెబ్బ తినే భయం ఉందని వారు బెంగాల్‌కే పరిమితం కావాలనేది ఆమె ఉవాచ. ముఖ్యమంత్రి ఈ కథనం కేవలం బాధ్యతారాహిత్యమే కాక దీని ద్వారా హిందూత్వ శక్తులతో ఆమె రాజీ ధోరణి కూడా బహిర్గతమైంది.

ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఈ వైఖరి ఏవిధంగానూ సమర్థనీయం కాదు. భారత్ ఒక సమాఖ్య వ్యవస్థగల దేశం. ఇక్కడ అన్ని రాష్ట్రాల, అన్ని భాషల, అన్ని మతాల ప్రజలకు ఎక్కడికైనా వెళ్ళి, స్థిరపడి, ఉపాధి లేక వృత్తి చేసుకునే అధికారం ఉన్నది. రాజ్యాంగం, చట్టం పౌరులందరికి ఆ అధికారాన్నిచ్చాయి. ఒకవేళ ఏదేని రాష్ట్ర పౌరుడు నుండి ఇంకో రాష్ట్రంలో ఆ అధికారం హరించటం జరిగితే అది నిరసించాలి. ఆ నిరసనకు నాయకత్వం వహించే బాధ్యత కూడా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిదే. మమతా బెనర్జీ ఆ పని చేయకుండా కార్మికులను తిరిగి స్వరాష్ట్రానికి రమ్మని చెబుతున్నారు. ఇతరరాష్ట్రాల్లో బెంగాలీ ప్రజలకు ఉన్న హక్కులను కాపాడే బాధ్యత ఆమెకు లేనట్టుగా ఆమె వ్యవహరిస్తున్నది.

ఏ సంఘటనను పురస్కరించుకుని ఆమె ఇంటికి తిరిగి రమ్మనే సూచనో దాని వెనక హిందూత్వవాదుల భయోత్పాతం సృష్టించే ప్రయత్నం ఉంది. ఇది రాజకీయ ధ్రువీకరణను బలపర్చే స్వభావం కలిగి ఉంది. ఈ జుగుప్సాకర రాజకీయానికి ముఖ్యమంత్రి ఎదిరించి నిలబడవల్సింది. వేరే రాష్ట్రం నుండి వచ్చినవాడు మైనారిటీ వర్గానికి చెందినవాడు కనక వాడిని చమురు పోసి తగలబెట్టే పాశవికతను సమర్థించలేం. బెంగాల్ ముఖ్యమంత్రి మౌనం వహించి ఈ జుగుప్సాకర రాజకీయానికి తలొగ్గారు. నిజానికి బీజేపీకి ఎదురు తిరగాలి. అందుకే ఆ పక్షంతో రాజీ రాజకీయాల ప్రయోజనం కోసం ఆమె వెనక్కి తగ్గారు. పైపైన ఏదో కాస్త హుంకారాలు నటించినా అసలు ఆమె బీజేపీకి అసంతృప్తి కలిగించటానికి ఇష్టపడలేదు.

ఆర్థిక వ్యవస్థ గురించి కనీస అవగాహన ఉన్నవారెవరు ఈ విధంగా ఉపాధి కోసం బయటకు వెళ్ళటాన్ని నిరుత్సాహ పర్చలేరు. లేక ఇప్పటికే ఎవరైనా ఇతర రాష్ట్రాలకు వెళ్ళి ఉంటే వారిని తిరిగి వచ్చేయాలని చెప్పరు. బెంగాల్ ఆర్థిక వ్యవస్థ పరిస్థితి ప్రస్తుతం అంతంత మాత్రంగానే ఉన్నది. ఉపాధి కోసం ప్రజలు హాహాకారం చేస్తున్నారు. అక్కడ నుండి పొట్ట కోసం ప్రతి ఏడాది లక్షలుకొలదీ పౌరులు ఇతర రాష్ట్రాలకు వలస వెళతారు. ఇందులో చాలామంది సీజనల్‌గా పని చేసి మరలా తిరిగి వెళుతూ ఉంటారు. కొంతమంది ఉండిపోతారు కూడా. వారి ఆదాయం డబ్బుతోనే బెంగాల్లో వారి కుటుంబాల మనుగడ. ఇది కేవలం అసంఘటిత రంగంలోనే కాక ప్రపంచీకరణ యుగంలో సంఘటిత రంగంలో కూడా ఇతర రాష్ట్రాల్లో ఉండేవారి సంఖ్య పెరుగుతున్నది. ప్రభుత్వ, పబ్లిక్ రంగ సంస్థల్లో వేరే రాష్ట్రాల వారిని నియమించటం జరుగుతూ ఉంటుంది. ఈ మధ్య అన్ని రాష్ట్రాల నుండి చదువు కోవటానికి పిల్లలు ఇతర రాష్ట్రాలకు వెళుతున్నారు. నేటి పరిస్థితుల్లో ఇది అనివార్యం. ఎవరైనా అనుకుంటేనే దీన్ని ఆపలేరు. బలవంతంగా ఆపటానికి ప్రయత్నిస్తే అది కూర్చున్న కొమ్మనే నరికినట్టౌతుంది.

భారతదేశ తన పౌరులందరిదీ. అందరికీ సమాన హక్కులు ఉన్నాయి. ఈ హక్కుని పరిరక్షించే బాధ్యత అన్ని రాష్ట్రాల, కేంద్ర ప్రభుత్వానిది. రాజకీయ పక్షాలు కూడా ఈ హక్కుల పరిరక్షణకు ఆందోళన కొనసాగించాలి. సంఘ్ పరివారం రాజేస్తున్న ఈ విషపూరిత ప్రచారం, మతపరమైన విద్వేషానికి వ్యతిరేకంగా నిరసన ప్రభంజనం లేవనెత్తాలి. బెంగాల్ ముఖ్యమంత్రి, ఆమె పార్టీ దీన్నుండి పలాయనం చిత్తగిస్తున్నారు. కానీ పలాయనం ఈ విషమ పరిస్థితికి పరిష్కారం కాదు. అన్ని లౌకిక, ప్రజాస్వామ్య శక్తులు ఇందులో భాగస్వాములు కావాలి. వామపక్షాలు ఈ పోరాటంలో ముందు పీఠాన ఉన్నాయి.

– వేదుల రామకృష్ణ

మానవి
నవతెలంగాణ
హైదరాబాద్ 5
శనివారం 6-1-2018
manavi@navatelangana.com

మహిళలు స్వతంత్రంగా ఎదగాలంటే సొంత ధనం, తనదైన ప్రత్యేక గది అవసరం

- వర్జీనియా ఉల్ఫ్



ప్రేమతో జయించింది

శ్రావణికి ముప్పై యేళ్ళుంటాయి. భర్తను వెంటబెట్టుకొని ఐద్వా లీగల్‌సెల్‌కు వచ్చి 'మేడమ్ నా పెండ్లి జరిగి ఆరేళ్ళవుతుంది. ఈయన నా భర్త. పేరు కృష్ణ. మా పెండ్లప్పుడు ఆయన చిన్న ఉద్యోగం చేసేవారు. జీతం తక్కువైనా సొంత ఇల్లు ఉంది. దాంతో మా వాళ్ళు పెండ్లికి ఒప్పుకున్నారు. ఆ ఇంటికి వెళ్ళిన దగ్గర నుండి మా అత్తమామలను ఎంతో ప్రేమగా చూసుకునేదాన్ని. వాళ్ళకు ఎలాంటి సమస్య వచ్చినా నేనే చేసేదాన్ని. నాకు ముగ్గురు ఆడపడుచులు. అందరూ మా ఇంటికి దగ్గర్లోనే ఉంటారు. వారం వారం మా ఇంటికి వస్తారు. అందరికీ అన్నీ చేసిపెట్టేదాన్ని. దాంతో మా అత్తమ్మ కూడా నాతో ఎంతో ప్రేమగా ఉండేది.



ఐద్వా అదాలత్
సెల్ : 9490098024

ఇప్పుడు సమస్యంతా మా ఆడపడుచుల గురించే. అత్తాకోడళ్ళం ప్రేమగా ఉండటం వాళ్ళకు నచ్చలేదు. మా ఇద్దరి మధ్య గొడవలు పెట్టడం మొదలుపెట్టారు. మాకు ఇద్దరు పిల్లలు. మా వారికి జీతం తక్కువ. మేమంతా మా మామగారిపై ఆధారపడి బతుకుతున్నామంటూ ఏవేవో అనేవారు. దాంతో మా అత్తమ్మ నాతో ప్రతి చిన్న విషయానికి గొడవ చేయడం మొదలు పెట్టింది. ఇక అప్పటి నుండి మా మధ్య గొడవలు జరుగుతూనే ఉన్నాయి. భరించలేక ఈ మధ్యనే కాస్త గట్టిగా మాట్లాడాను. దాంతో నన్ను విపరీతంగా కొట్టారు. అప్పుడు నా చెయ్యి విరిగింది. నా బాధ చూడలేక అమ్మానాన్న, అత్తమ్మ వాళ్ళతో మాట్లాడటానికి వచ్చారు. అక్కడ మా నాన్నను మా అత్త చెంపమీద కొట్టింది. దాంతో మా అమ్మకు కోపం వచ్చి మా అత్తను పక్కకు నెట్టింది. 'మీ అమ్మ నాపైనే చేయి వేస్తుందా?' అని మా అత్త మమ్మల్ని ఇంట్లో అడుగు పెట్టనివ్వలేదు. దాంతో వేరే ఇల్లు అద్దెకు తీసుకున్నాం. ఇల్లు గడవడం కష్టంగా ఉంటే నేను కూడా పనిలోకి పోతున్నాను. అంత ఆస్తి ఉంచుకొని నీకు ఇదేం కష్టమని అందరూ అడుగుతున్నారు. అయినా ఇల్లు గడవాలి, పిల్లల్ని చదివించాలి అందుకే పనిలోకి పోతున్నా.

అయితే ఈ మధ్యనే ఓ స్థలాన్ని మా అత్తమ్మ అమ్మేసి ఆ డబ్బును కూతురికి ఇచ్చేసింది. ఇప్పుడు మా పెద్ద ఆడపడుచు, మా అత్తమ్మ పేరుతో ఉన్న స్థలాన్ని తన పేరుతో రాయించుకోవాలని చూస్తోంది. ఇలా చేస్తే చివరికి మాకు ఏమీ మిగల కుండా పోతుంది. ఇదే విషయాన్ని మా వారు వాళ్ళ అమ్మనాన్నలను ఎన్ని సార్లు అడిగినా ఉపయోగం లేదు. ఆయన్ని వాళ్ళు అసలు ఇంటికే రానీయడం లేదు. ఇప్పుడు మాకేం చేయాలో తెలియడం లేదు. మొన్నటి వరకు సొంత అక్కలా చూసుకునే మరిది కూడా ఇప్పుడు చాలా మారిపోయాడు. వాళ్ళను మీరే పిలిచి మాట్లాడండి. ఎలాగైనా మాకు న్యాయం జరిగేలా చూడండీ' అంటూ కన్నీళ్ళు పెట్టుకుంది.

కృష్ణ కూడా తన తల్లిదండ్రులు తనని ఒక విధంగా, తమ్ముడిని ఒక విధంగా చూస్తున్నారని, తనంటే వాళ్ళకు అసలు ఇష్టం లేదని చెప్పుకొచ్చాడు. అతని మాటలు విన్న లీగల్‌సెల్ సభ్యులు 'కన్న తల్లిదండ్రులు పిల్లల్ని కాస్త తేడాగా చూసినా మరీ మీరు చెప్పినంత దారుణంగా అయితే ప్రవర్తించరు. మీ నుండి కూడా ఏవో పొరపాట్లు జరిగే ఉంటాయి. మీవైపు నుంచి ఏమైనా పొరపాట్లు ఉంటే మార్చుకోవాలి. అప్పుడే మేము మీ పెద్దలతో మాట్లాడగలం' అన్నారు. దానికి భార్యా, భర్తలిద్దరూ 'మావైపు జరిగిన తప్పులకు మా అత్తమామల కాళ్ళు పట్టుకొని క్షమాపణలు అడగడానికి సిద్ధంగా ఉన్నాం' అని చెప్పారు. దాంతో లీగల్‌సెల్ సభ్యులు వచ్చే వారం కృష్ణ తల్లిదండ్రులతో పాటు, అతని తమ్ముడిని కూడా రమ్మని లెటర్ పంపారు.

తర్వాతి వారం కృష్ణ తల్లిదండ్రులు, తమ్ముడితో పాటు ఇద్దరు అక్కలు కూడా వచ్చారు. సభ్యులు కృష్ణ తల్లిదండ్రులను కూర్చోబెట్టి 'మీరు పెద్దవారు. పిల్లలు ఏమైనా పొరపాటు చేస్తే క్షమించాలి. వాళ్ళు మీ కాళ్ళు పట్టుకోవడానికి కూడా సిద్ధంగా ఉన్నారు. హైదరాబాద్ లాంటి మహానగరంలో అద్దెలు కట్టుకొని, ఇద్దరు పిల్లలతో బతకడమంటే ఎంత కష్టమో మీకు తెలియంది కాదు. మీ అబ్బాయికి జీతం కూడా తక్కువ. అందుకే వాళ్ళు మీ ఇంట్లోనే ఓ పోర్షన్‌లో ఉంటారు. వాళ్ళను రానీయండి. వాళ్ళ బతుకు వాళ్ళు బతుకుతారు' అంటూ నచ్చజెప్పే ప్రయత్నం చేశారు.

చిన్నకొడుకు పెండ్లి జరిగే వరకు ఇంట్లోకి ఎవర్నీ రానీయమని కృష్ణ తల్లి కచ్చితంగా చెప్పేసింది. అయితే లీగల్‌సెల్ సభ్యులు ఎంతో ప్రయత్నిస్తే పెద్దవాళ్ళు కాస్త ఆలోచనలో పడ్డారు. ఈ లోపు కృష్ణ తమ్ముడు, అతని అక్కలు ఆ పెద్దవాళ్ళను రెచ్చకొట్టి, పెద్ద గొడవ క్రియేట్ చేశారు. దాంతో కృష్ణ తల్లి కూడా రెచ్చిపోయి 'వాళ్ళకు ఇల్లు కావాలంటే వచ్చి మా కాళ్ళు పట్టుకోవాలి. అంతేకాని ఎక్కడెక్కడో తిరిగితే కుదరదు. వీళ్ళ వల్ల ఊళ్ళో మా పరువు పోయింది. ఇంత జరిగాక ఇక వాళ్ళను మా ఇంటికి రానిచ్చే ప్రసక్తే లేదు. ఆ ఇల్లు నా పేరుతో ఉంది. నా ఇష్టం వచ్చిన వాళ్ళకు ఇచ్చుకుంటా' అంటూ పెద్దపెద్దగా అరిచేసింది.

దానికి సభ్యులు 'ఆస్తి కోసం మీ పిల్లలు ఎక్కడెక్కడో తిరిగి నందుకు మీ పరువు పోయిందని బాధపడుతున్నారు, మరి మీ కోడలు ఇల్లు గడవడం కోసం కూలి పనులకు పోతుంది. దీని వల్ల మీ పరువుపోలేదా? అప్పుడు మీకు కష్టంగా అనిపించడం లేదా?' అని అడిగారు. దానికి 'వాళ్ళు ఎలా బతికినా మాకు సంబంధం లేదు' అని కృష్ణ తల్లి పెద్దపెద్దగా ఏడ్చి గోల చేస్తుంటే, అతని తమ్ముడు కేకలు పెట్టడం మొదలు పెట్టారు. ఇక వాళ్ళు వినే పరిస్థితుల్లో లేరని అర్థం చేసుకున్న సభ్యులు వాళ్ళను నెల రోజుల తర్వాత రమ్మని చెప్పి పంపించి శ్రావణిని, కృష్ణను లోపలికి పిలిచారు.

సభ్యులు కృష్ణతో 'ప్రస్తుతం మీ వాళ్ళు చాలా కోపంగా ఉన్నారు. పైగా పక్కనున్న మీ తమ్ముడు, అక్క వాళ్ళను రెచ్చగొడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇంటి గురించి మాట్లాడక పోవడమే మంచిది. వాళ్ళ కోపం శాశ్వతంగా అలాగే ఉండదు. మీరు కూడా పెద్దవాళ్ళపై కోపం పెంచుకోవద్దు. ఇప్పుడు గొడవ పెట్టుకొని బలవంతంగా మీరు ఆ ఇంట్లో ఉన్నా ప్రశాంతంగా బతకలేరు. కాబట్టి మీ కష్టాన్ని మీరు నమ్ముకోండి. శ్రావణి కూడా ఉద్యోగం చేస్తుంది కాబట్టి పెద్దగా ఇబ్బంది ఉండదు. కొన్ని రోజులు గడిచాక మీ పెద్దవాళ్ళను మీరే కలిసి క్షమాపణలు చెప్పి దగ్గరవ్వడానికి ప్రయత్నించండి. సొంత వాళ్ళతో గొడవలు పెట్టుకొని బంధాలను దూరం చేసుకోవద్దు. ఆస్తుల కన్నా బంధాలే శాశ్వతంగా నిలబడ తాయి. ఈ విషయం అర్థం చేసుకోవడానికి వాళ్ళకూ ఎంతో కాలం పట్టదు. నువ్వు కూడా మరో మంచి ఉద్యోగం చూసుకో' అని చెప్పారు.

అలాగే శ్రావణితో 'నువ్వు గతంలో మీ అత్తమ్మను, ఆడపడుచులను, మరిదినీ ప్రేమగా చూసుకున్నావు. ఇప్పుడు మీ మధ్య ఆ ప్రేమ లేదు. వాళ్ళు ఆస్తి ఇవ్వనంటున్నారని కోపంతో మాట్లాడడం మానేశావు. కానీ అది మంచి పద్దతి కాదు. నువ్వు అప్పుడప్పుడు మీ అత్తమామలతో మాట్లాడుతూ ఉండు. అప్పుడే మీకూ, వాళ్ళకు మధ్య దూరం తగ్గుతుంది. ఏది ఏమైనా కొన్ని రోజులు ఓపిక పట్టండి. గొడవలు పెట్టుకుంటే సమస్యలు పరిష్కారం కావు. పైగా ఆ ఆస్తి ఎక్కువ భాగం మీ అత్త పేరుతోనే ఉంది. దానిపై హక్కు ఆమెకే ఉంటుంది. అంటే మంచితనం, ప్రేమతోనే ఆమెను జయించాలి. అప్పుడు నీ పిల్లల భవిష్యత్ బాగుటుంది' అని చెప్పారు. కృష్ణా, శ్రావణి బాధ్యులు చెప్పినట్టే వాళ్ళతో మంచిగా ఉండటానికి ప్రయత్నిస్తానని చెప్పి వెళ్ళిపోయారు.

మళ్ళీ ఆరు నెలల తర్వాత శ్రావణి ఒక్కతే లీగల్‌సెల్‌కు వచ్చి 'మేడమ్ మీరు చెప్పినప్పటి నుంచి గొడవలుపెట్టకోకుండా మా అత్తగారితో మంచిగా ఉంటున్నా. అప్పుడప్పుడు పిల్లల్ని తీసుకుని వాళ్ళ ఇంటికి వెళ్ళేదాన్ని. మొదట్లో ఆమె నా ముఖం కూడా చూసేది కాదు. అసలు ఆమె ఎప్పటికైనా మారుతుందో లేదో అనే అనుమానం ఉండేది. కానీ ఈ మధ్య ఆమెలో కొద్ది కొద్దిగా మార్పు వస్తోంది.

మమ్మల్ని ఆ ఇంటికి వచ్చేయమని కూడా చెప్పింది. వచ్చే నెలలో అక్కడే కాపురం పెట్టబోతున్నాం. చాలా సంతోషంగా ఉంది. ఓపిక, ప్రేమతో ఏదైనా సాధించవచ్చని మీరు చెప్పిన మాట నా విషయంలో మాత్రం బాగా ఉపయోగపడింది. ఇకపై సాధ్యమైనంత వరకు నావైపు నుంచి ఎలాంటి గొడవలూ లేకుండా జాగ్రత్తగా ఉంటాను' అని చెప్పి సంతోషంగా వెళ్ళిపోయింది.

సలీమ



జోన్ ఆఫ్ ఆర్క్
(1423 6 జనవరి, 1423 - 3మే 1431)

దేశభక్తికి మరోపేరు

Women of the day

ఫ్రాన్స్ స్వాతంత్ర్యం కొరకు పోరాడి ఫ్రాన్స్ ప్రజల వీరనారిగా జాతీయతకు ప్రతీకగా నేటికీ గౌరవించబడుతున్న దీశాలి "జోన్ ఆఫ్ ఆర్క్". ఆమె 1412 జనవరి 6 న ఒక వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. ఆమె కుటుంబం గ్రామీణ ప్రాంతమైన మీస్‌లోయలో 50 ఎకరాల భూమి వ్యవసాయం చేస్తూ జీవించేవారు. జోన్‌కు ముగ్గురు అన్నలు. ఇదే కాలంలో ఫ్రాన్స్ రాజకీయంగా ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటోంది. చార్లెస్ చక్రవర్తి అయినా పరిపాలనా దక్షుడు కాకపోవడం వల్ల ఎందరో రాజవంశీకులు రాజ్యపాలన చేసేవారు. అందులో రాణి ఇన్ బెల్లా, ఆర్సియన్స్‌ని లూయిస్, బర్గండీ, బెర్రీ, బర్బోన్‌వి మరికొంతమంది చిన్న చిన్న ప్రాంతాల ప్రభువులు 1407 లో ఆర్లియన్స్ ప్రభువుని జీన్ సాన్సపీర్ చంపించడంతో ఫ్రాన్స్ అల్లకల్లోలమై సామాన్య ప్రజలలో తిరుగుబాటు. పాలకులు రెండుగా చీలి అధికారం కోసం పోరాటం చేశారు. పారిస్‌లో కబోచిన్ తిరుగుబాటుకు నాయకత్వం వహించాడు.

అదే సమయంలో ఓ నూతన శక్తి డాఫిన్ రూపంలో అవతరించింది. అతడు ఆర్మాగ్నక్ తెగకు చెందిన వాడే అయినా తల్లి బర్గండియన్ వంశపు రాణి. డాఫిన్ కి జోన్ ఆఫ్ ఆర్క్ సహాయపడటం ఫ్రాన్స్ స్వతంత్రానికి, ఇంగ్లండ్ రాచరికానికి తిలోదకాలివ్వడానికి తోడ్పడింది. జోన్ తన 13 వ ఏటా ఫ్రాన్స్ నుండి ఇంగ్లీష్ వారిని తరిమి వేయాలని నిర్ణయించుకున్నారు. అందుకోసం సైన్యాన్ని ఏర్పాటు చేసుకొని 1427 జూన్ 18 న పటయ్ వద్ద ఇంగ్లీష్ సైన్యాన్ని ఓడించారు. ఆమె నాయకత్వంలో ఎన్నో పట్టణాలు విముక్తి పొందాయి. ఆ తర్వాత బర్గెండియిన్స్ ఆమెను పట్టి బంధించి 1431 మే 30 న పది వేల మంది చూస్తుండగా సజీవ దహనం చేశారు ఇంగ్లీష్ వారు. 1456 జులై 7న ఇంగ్లీష్‌వారిని రూయన్ నగరం నుండి తరిమివేసిన తర్వాత ఆమె అమాయకురాలని, గొప్పదేశ భక్తురాలని ప్రభుత్వపరంగా ప్రకటించబడింది. ఇప్పటికీ ఫ్రాన్స్‌లో అతిగొప్ప నాయకిగా ఫ్రెంచ్ జాతీయ భావనకు ప్రతీకగా ఆ దేశస్తులు ఆమెను గౌరవిస్తారు. దేశభక్తి, సాహసాలకు మరోపేరు "జోన్ ఆఫ్ ఆర్క్"గా ఆ దేశ ప్రజల హృదయాల్లో నిలిచారు. ❄



కొంచెం ధైర్యం మరికొంచెం జాగ్రత్త

ఆడవారికి బాధ్యతలు అధికం. దానితోపాటు ఒత్తిళ్ళూ అధికమే. అందులోనూ ఇంట్లో ఎవరికన్నా ఏపాటి నలతగా వున్నా వారితోపాటు రాత్రింబవళ్ళు ఉంటూ వారి ఆరోగ్యం కుదుట పడే వరకు ఒత్తిడికి గురవుతారు. అయితే ఈ ఒత్తిళ్ళని కూడా భరిస్తూ తన బాధ్యతలని సక్రమంగా, సరైన సమయంలో పూర్తి చేయడానికి అలవాటుపడిపోయారు మహిళలు. కుటుంబం గురించి ఇంతగా తపించే వారు తమ ఆరోగ్యం, మానసిక ఆందోళన గురించి ఏమాత్రం ఆలోచించరు. అలా తమని తాను నిర్లక్ష్యం చేసుకునే ఆడవారి గురించి గతంలో హార్వర్డ్ మెడికల్ స్కూలు వారు వెలువరించిన పరిశోధనా ఫలితమే ఈ కథనం.

ఇంట్లో ఎవరైనా అనారోగ్యానికి గురైతే వారికి సేవలు చేయడంలో ఆడవారు తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యే అవకాశం వుంటుంది అంటున్నారు పరిశోధకులు. ఆ ఒత్తిడి ఆడవారి శారీరక, మానసిక ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావాన్ని చూపిస్తుందని కూడా వీరు చెబుతున్నారు. ఈ పరిశోధనలో భాగంగా 65 సంవత్సరాలు పైబడ్డ స్త్రీలని, వారి జీవన శైలిని, వారి కుటుంబ ఆరోగ్య పరిస్థితులని, వారి వైద్య రికార్డులని పరిశీలించారు. ఒకరు ఇద్దరు కాదు... సుమారు ఐదు లక్షల మందిని పరిశీలించిన ఈ పరిశోధకులు చివరికి తేల్చిన విషయం... కుటుంబంలోని వారి అనారోగ్యం స్త్రీలని తీవ్ర ఒత్తిడికి గురిచేసి, వారి ఆయుష్షుపై ప్రభావాన్ని చూపిస్తుంది అని. అదీ దీర్ఘకాలిక అనారోగ్యం కలిగిన వారి మంచి చెడ్డలు చూడటంలో అంతర్లీనం గా ఉండే ఎన్నో విషయాలు ఆ ఒత్తిడికి కారణం అవుతామట.

మానసిక ఒత్తిడే ఎక్కువ

పూర్తిగా తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయటం ఒక కారణం అయితే, పోషకాహారం తీసుకోకపోవడం, ఎక్కువ శ్రమపడటం వంటివి ఇతర కారణాలు. ఈ అధ్యయనంలో భాగంగా వివిధ స్త్రీల వైద్య రికార్డుల్ని పరిశీలించినప్పుడు క్యాన్సర్, అంగవైకల్యం వంటివి వున్న వారికంటే ఎక్కువ ఒత్తిడికి మహిళలు గురైనట్టు తేలింది.

జాగ్రత్తలు తీసుకోవల్సిందే

మానసిక సమస్యలతో బాధపడే వ్యక్తుల సంరక్షణ చూసేవారికి ఈ ఒత్తిడి మరీ అధికమట. ఎందుకంటే వారిని సంరక్షించడంలో సాధారణ స్థాయి కంటే ఒత్తిడి, వేదన అధికంగా వుంటాయి. హార్మోన్ల హెచ్చుతగ్గులు కూడా ఉన్నట్టు పరిశోధకులు గుర్తించారు. రోగ నిరోధక శక్తిని కాపాడే తెల్ల రక్తకణాలు చురుకుదనాన్ని కోల్పోవడం గమనించారు. దాంతో అధిక రక్తపోటు, గుండెజబ్బుల బారిన పడే అవకాశాలు ఎక్కువగా వున్నట్టు గుర్తించారు. ఇలా రోగుల సంరక్షణలో ఎన్నో సవాళ్ళు, ఒత్తిళ్ళు దాగున్నాయని, ఈ విషయంలో స్త్రీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

మీరు ఆరోగ్యంగా ఉంటేనే

అయినవారి బాధ చూడటం కష్టమే. వారిని అన్నివేళలా కంటికి రెప్పలా కాపాడాలనుకోవటం సహజమే. అయితే అదే సమయంలో మన ఆరోగ్యం గురించి కూడా ఆలోచించమని చెబుతున్నారు పరిశోధకులు. ముందుగా పరిస్థితులని యథాతథంగా స్వీకరించడం, తర్వాత ఏం జరుగుతుందో అన్న ఆందోళనని దగ్గరకి రానీయకపోవడం, మంచి ఆహారాన్ని, విశ్రాంతిని తీసుకోవడం. అందుకోసం ఇంట్లో మిగిలిన సభ్యుల సహాయం కోరటం, ఒత్తిడిగా అనిపించినప్పుడు రిలాక్స్ అయ్యే టెక్నిక్స్‌ని పాటించడం, వీలయితే ఓ గంట ఒంటరిగా ఉండటం వంటి జాగ్రత్తలు తీసుకోవాలి. ఎంతైనా మనం ఆరోగ్యంగా వుంటేనే కదా అందరినీ చక్కగా చూసుకోగలిగేది. కాబట్టి కొంచెం ధైర్యంగా, మరికొంచెం జాగ్రత్తగా ఉండటం తప్పనిసరి.

❄

ముత్యాల ముగ్గులు



17 చుక్కలు
1వచ్చే వరకు

చిలుక ఉషారాణి
కాచిగూడ, హైదరాబాద్





చిరిపోతుల లక్ష్మి
వెంకటేశ్వర్లపల్లి, భూపాలపల్లి.

15 చుక్కలు
మధ్యచుక్క
8వచ్చే వరకు



బ్రషింగ్ విషయంలో...

బ్రష్ చేసేటప్పుడు కొన్ని పద్ధతులు పాటించాల్సిందే అంటున్నారు డెంటిస్టులు. నాణ్యమైన ఎంపిక చేసిన బ్రష్, టూత్ పేస్టులను ఉపయోగించడం మంచిది. స్టాండర్డ్ కంపెనీలు ఉత్పత్తి చేసే బ్రష్, టూత్ పేస్టుల్ని వాడాలి. కొద్ది రోజులు ఒక కంపెనీవి, మరికొద్ది రోజులు మరో కంపెనీవి వాడటం వల్ల పళ్ళ మీద ఉండే ఎనామెల్ పొర కరిగిపోయే ప్రమాదం ఉంది. క్రమంగా పళ్లు బలహీనపడటం, ఊడిపోవడం వంటివి జరుగుతాయి.

- అయితే రోజుకు రెండు సార్లు బ్రషింగ్ చేయడం మంచిది. ఒకటి ఉదయం లేచినప్పుడు. అలాగే రాత్రి పడుకునే ముందు బ్రష్ చేయడం వల్ల బ్యాక్టీరియల్, వైరల్ ఇన్ఫెక్షన్స్ నుంచి కాపాడుకోవచ్చు.
- బ్రషింగ్ చేసేటప్పుడు పళ్ళ మధ్య భాగంలో, కింద, పై భాగంలో శుభ్రంగా బ్రషింగ్ చేస్తే సరిపోతుంది. ఎందుకంటే పళ్ల మధ్యలో బ్యాక్టీరియా చేరే అవకాశం ఎక్కువగా ఉంటుంది.
- అలాగే పళ్లను మృదువుగా నెమ్మదిగా రుద్దాలి. గట్టిగా రుద్దడం వల్ల ఎనామెల్ పొర ఊడిపోయి పళ్ళు సెన్సిటివ్ అయ్యే ప్రమాదం ఉంది.
- సంవత్సరం పొడవునా ఒకే బ్రష్‌ను ఉపయోగించకుండా, ఆరు నెలలకు ఓ సారి కొత్త బ్రష్ ను వాడాలి. ఇలా చేయడం వల్ల పళ్ళు ఆరోగ్యంగా ఉంటాయి.
- బ్రషింగ్ చేసేటప్పుడు చిగుళ్ల నుంచి రక్తం కారుతుంటే డాక్టర్ ను సంప్రదించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.
- కొత్త బ్రష్‌లు ఎంపిక చేసుకునేటప్పుడు మృదువైన పళ్లు ఉన్నవి, జిగ్‌జగ్ ఉన్న బ్రష్‌లను ఎంపిక చేసుకోవడం మంచిది. ❄

పిల్లలను కనండి

బొబ్బిలి, ధర్మసాగరం జన్మభూమి సభల్లో చంద్రబాబు

విజయనగరం : 'రాష్ట్రంలో వృద్ధుల సంఖ్య పెరిగిపోతున్న నేపథ్యంలో ఫ్యామిలీ ప్లానింగ్‌ను పక్కనబెట్టి పిల్లల్ని కనాలి. రాష్ట్రంలో ఫ్యామిలీ ప్లానింగ్‌ను ఒక్కప్పుడు నేనే ప్రమోట్ చేశాను. ఇతర దేశాలతో పోల్చుకుంటే ప్రస్తుతం మన దేశంలో చిన్నపిల్లల సంఖ్య తగ్గింది. దీనివల్ల భవిష్యత్తులో మానవ వనరుల అభివృద్ధికి ఆటకం ఏర్పడే అవకాశం ఉంది. ఈ దృష్ట్యా ఫ్యామిలీ ప్లానింగ్‌ను పక్కనబెట్టి పిల్లలను ఎక్కువగా కనండి' అని మఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు పిలుపునిచ్చారు. విజయనగరం జిల్లా బొబ్బిలి, విశాఖ జిల్లా నర్సీపట్నం నియోజకవర్గం పరిధిలోని ధర్మసాగరం పంచాయతీ కేంద్రంలో శుక్రవారం జరిగిన జన్మభూమి సభల్లో ఆయన మాట్లాడారు. బొబ్బిలి సభలో చంద్రబాబు మాట్లాడుతూ.. దేశంలో జరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యలతో పోల్చి చూస్తే మన రాష్ట్రంలో వాటి సంఖ్య తక్కువేనని అన్నారు. ప్రయివేట్ విద్యా సంస్థల ఒత్తిడి వల్లే విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. విద్యార్థులను ఒత్తిడికి గురి చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. రాష్ట్రంలో 2019 నాటికి శతశాతం అక్షరాస్యత సాధించే దిశగా చర్యలు తీసుకుంటానన్నారు. పాఠశాలల్లో రూ.ఐదు వేల కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. త్వరలో సిలబస్ కూడా మార్పు చేసే ఆలోచనలో ఉన్నామన్నారు. విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని, ఏపీని నాలెడ్జ్ హబ్‌గాతీర్చిదిద్దేందుకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు ద్వారా కృషి చేస్తున్నామని తెలిపారు. కొత్త విద్యాసంస్థల ఏర్పాటుతో పాటు ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ హాస్టళ్లను రెసిడెన్షియల్ స్కూళ్ల మార్పు చేస్తున్నామన్నారు.

ఏం చేసుకుంటారో చేసుకోండి! మత్స్యకారులపై చంద్రబాబు ఆగ్రహం

మత్స్యకారులపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్టీ జాబితాలో చేర్చడంపై లిఖిత పూర్వకమైన హామీ ఇవ్వాలని కోరడంపై ఆసహనం వ్యక్తం చేశారు. ఏం చేస్తారో చేసుకోండని అన్నారు. ఎక్కువ మాట్లాడితే మీ సంగతి చూస్తానంటూ బెదిరించారు. దీంతో మత్స్యకార సంఘాల నేతలు సీఎం తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మీ పార్టీ మంత్రి, ఎమ్మెల్యే రమ్మంటేనే వచ్చామంటూ సమాధానమివ్వడంతో సిఎం అక్కడ నుంచి వెళ్లిపోయారు. నర్సీపట్నంలో జన్మభూమిలో పాల్గొనేందుకు గురువారం రాత్రి విశాఖ నగరంలోని పోర్టు గెస్ట్ హౌస్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు బస చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే శుక్రవారం ఉదయం మత్స్యకార సంఘాల నేతలు, మాజీ మేయర్ పులుసు జనార్ధన్ తదితరులు విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌తో కలిసి సిఎంకు వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్లారు. 2014 ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్నట్లుగా మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చాలంటూ పది రోజులుగా నగరంలో రిలే నిరాహార దీక్ష చేస్తున్న సంగతి తెలిసిందే. దీక్ష విరమిస్తే ముఖ్యమంత్రి వద్దకు తీసుకెళ్తానని ఇటీవల దీక్షా శిబిరాన్ని సందర్శించిన మంత్రి గంటా శ్రీనివాసరావు మత్స్యకారులకు సూచించారు. అయితే సంఘాల నేతలు అందుకు అంగీకరించలేదు. సీఎం లిఖిత పూర్వక హామీ ఇస్తేనే దీక్ష విరమిస్తామన్నారు. అయితే వాసుపల్లి.. శుక్రవారం సీఎం వద్దకు తీసుకెళ్లారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు.. ఎమ్మెల్యే వాసుపల్లి, మంత్రి గంటాపైనా ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఆందోళనలు, దీక్షలు చేస్తే భయపడేది లేదని మత్స్యకార సంఘాల నేతలపై రుసరుసలాడారు.



దళితులపై టీడీపీ కార్యకర్తల దాడి

విజయనగరం జిల్లా డెంకాడ మండలం మోదవలసలో జన్మభూమి సభకు వెళ్లొందంటూ దళితులపై టీడీపీ కార్యకర్తలు దాడి చేశారు. ఈ దాడిలో గాయపడిన వారిని చూసేందుకు వెళ్తున్న దళితుల కుటుంబ సభ్యులపైనా దాడికి పాల్పడ్డారు. ఈ రెండు దాడుల్లో మొత్తం పది మంది దళితులు గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. మోదవలస పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించే జన్మభూమి సభలో ఇచ్చేందుకు కొంతమంది దళితులు ఒక దగ్గర కూర్చొని వినతులు రాసుకుంటున్నారు. అదే సమయంలో ఆ వీధిలో టీడీపీకి చెందిన ఇద్దరు యువకులు బైక్‌పై వెళ్తూ.. జన్మభూమి సభకు రావద్దంటూ దళితులను హెచ్చరించారు. దీంతో వారి మధ్య మాటామాటా పెరిగింది. ఇంతలో టీడీపీకి చెందిన మరికొంతమంది అక్కడికి చేరుకొని దళితులపై రాళ్లతో దాడి చేశారు. దీంతో, దళితులు గండ్రేటి గణేష్, గండ్రేటి బంగార్రాజు, గండ్రేటి గౌరి, మిరప కుమార్, వసంత సంతోష్ భూషణ్‌రావు, పోలిపల్లి కాంతం గాయపడ్డారు. వీరిని స్థానికులు 108 వాహనంలో విజయనగరంలోని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు.

బాధితులను చూసేందుకు వారి కుటుంబ సభ్యులు ఆటోల్లో విజయనగరం వెళ్తుండగా మార్గం మధ్యలో అల్లుపేట పెట్రోల్ బంకు వద్ద సుమారు 25 మంది టీడీపీ కార్యకర్తలు అడ్డుకొని కర్రలు, రాళ్లతో దళితులపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో గండ్రేటి సురేష్, ఊడికల బంగార్రాజు, మిరప సత్యం, ఊడికల సంతోష్ కుమార్‌కు గాయాలయ్యాయి. టీడీపీకి చెందిన ఎర్నింటి శ్రీను, ఎర్నింటి రాము కూడా గాయపడినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలతో గ్రామంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ డిపోల ఎదుట ధర్నాలు

- ఎమ్‌వి యాక్ట్ సవరణ బిల్లును ఉపసంహరించాలి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రవాణారంగ జాతీయ సమన్వయ కమిటీ పిలుపు మేరకు శనివారంనాడు రాష్ట్రంలోని అన్ని ఆర్టీసీ డిపోలు, యూనిట్ల వద్ద కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి ధర్నాలు నిర్వహించారు. టీఎమ్‌యూ, టీఎస్‌ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్, ఎంప్లాయీస్ యూనియన్‌ల నాయకులు ఈ అందోళనల్లో పాల్గొన్నారు. కేంద్రప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న మోటారు వాహన చట్ట సవరణల బిల్లును తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ బస్‌భవన్ వద్ద పై కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో టీఎస్‌ఆర్టీసీ ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పి రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఎమ్‌వి యాక్ట్ సవరణల బిల్లు దేశంలోని ఆర్టీసీలకు ఉరితాడు వంటిదని, రవాణారంగాన్ని పూర్తిగా కార్పొరేటీకరణ చేయడం కోసం ఉద్దేశించిందని చెప్పారు. ఈ బిల్లును కేంద్రప్రభుత్వం తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యాభివృద్ధికి ప్రాథమిక ఉపాధ్యాయులే కీలకం

ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య



నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

విద్యారంగంలో ప్రాథమిక ఉపాధ్యాయులే కీలకమని, వారు వేసిన పునాదులపైనే విద్యార్థుల భవిష్యత్ ఆధారపడి ఉంటుందని ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య అన్నారు. శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ప్రాథమిక ఉపాధ్యాయ సంఘం(టీపీఏ) రూపొందించిన డైరీని ఆమె సచివాలయంలో ఆవిష్కరించారు.

తెలంగాణ ప్రభుత్వం ప్రాథమిక విద్యారంగం బలోపేతానికి అనేక సంస్కరణలు తీసుకొచ్చిందనీ, అవి విజయవంతం కావాలంటే ప్రాథమిక ఉపాధ్యాయుల సహకారం అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీఏ రాష్ట్ర అధ్యక్షులు షౌకత్ అలీ, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బి నారాయణరాజు, నాయకులు కామేశ్వర్‌రావు, కె బిక్షపతి, నిర్మల, లక్ష్మికాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఇసుక, గుట్టల దొంగలు

- మారింది పాలకులే.. పాలన కాదు : జగిత్యాల జిల్లా టీ-మాస్ ఆవిర్భావ సభలో గద్దర్, విమలక్క



నవతెలంగాణ-జగిత్యాల

"భౌగోళిక తెలంగాణ సిద్ధించాక కూడా... మారింది పాలకులే తప్ప పాలన కాదు. గత ప్రభుత్వాల కంటే ఎక్కువ పీడన ఉంది. రాష్ట్రంలో ఇసుక, గుట్టలను కొల్లగొట్టే దొంగలు పడ్డారు.." అని టీమాస్ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు గద్దర్, విమలక్క అన్నారు. టీ-మాస్ జగిత్యాల జిల్లా ఆవిర్భావ సభ శుక్రవారం జిల్లా కేంద్రంలోని పద్మనాయక కల్యాణ మండలంలో జరిగింది.

ఈ సందర్భంగా గద్దర్ మాట్లాడుతూ... సామాజిక తెలంగాణ రాలేదని, దాన్ని సాధించేందుకే టీమాస్ ఆవిర్భవించిందని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను పక్కదారి పట్టించారని అన్నారు. ప్రజానీకాన్ని మత, కుల ప్రాతిపాదికన విడగొట్టి పెత్తందారులు తమ ఆధిపత్యాన్ని కొనసాగించేందుకు పన్నాగాలు రచిస్తున్నారని విమర్శించారు. బహుజనులు ఐక్యంగా పోరాడాలని, రేపటి కాలం బహుజనులదేనని తెలిపారు. విమలక్క మాట్లాడుతూ.. తెలంగాణలో ఇసుక, గుట్టలను కొల్లగొట్టే దొంగలు పడ్డారన్నారు. అధికార పార్టీ కండువాలు వేసుకుని రాష్ట్రాన్ని లూటీ చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం మిన్నకుండటం సిగ్గుచేటన్నారు. నిజామాబాద్‌లో ఓ వ్యక్తిని ట్రాక్టర్‌తో తొక్కించి చంపించడం దొరల పాలనకు పరాకాష్ట అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏటా 230 కోట్ల మద్యం వ్యాపారం చేస్తూ ప్రజలను పీడిస్తోందన్నారు. దీనివల్ల మధ్యతరగతి కుటుంబాలు ఛిన్నాభిన్నమవుతు న్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు, చేనేత కార్మికులు ఆత్మహత్య చేసుకుంటుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పేదల బతుకు భరోసా లేదని, అందువల్ల బహుజనులు ఐక్యంగా పోరాడాలని పిలుపుని చ్చారు.

ఈ సభలో టీమాస్ ఫోరం రాష్ట్ర నాయకులు శ్రీరాంనాయక్, విజయలక్ష్మి, జిల్లా కన్వీనర్ నక్క విజయ్, జిల్లా కార్యవర్గ సభ్యులు వేల్పుల ప్రవీణ్, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు భూతం సారంగపాణి, నాయిని శారద, కరుణాకర్, సీపీఐ(ఎం) ప్రజాసంఘాల కన్వీనర్ తిరుపతినాయక్, తదితర 130 ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఇండ్లస్థలాల సాధనకు ఉమ్మడి కార్యాచరణ

- ఈనెల 10న రౌండ్‌టేబుల్
- సంఘాలు, సొసైటీల నిర్ణయం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వర్కింగ్ జర్నలిస్టుల ఇండ్లస్థలాల సాధన కోసం ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆయా జర్నలిస్టు సంఘాలు, హౌజింగ్ సొసైటీలు, ప్రెస్‌క్లబ్ నిర్ణయించాయి. ఇందుకోసం ఈనెల 10న హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించనున్నాయి.

దీనికి జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు, ప్రెస్‌క్లబ్, ఆయా పత్రికల సంపాదకులు, బ్యూరోచీఫ్‌లు, ఎలక్ట్రానిక్ మీడియా సీఈవోలు, సీనియర్ జర్నలిస్టులను ఆహ్వానించనున్నారు. ఈమేరకు అదేరోజున ఇండ్లస్థలాల సాధన కోసం ప్రత్యేకంగా 'జర్నలిస్టుల ఇండ్లస్థలాల సాధన జేఏసీ' ఏర్పడనుంది. రౌండ్‌టేబుల్ సమావేశంలో వచ్చిన అభిప్రాయాల మేరకు కార్యాచరణ చేపట్టాలని ఆయా జర్నలిస్టుల సంఘాల ప్రతినిధులు, హౌజింగ్ సొసైటీల ప్రతినిధులు నిర్ణయించారు.

గుజరాత్‌లో ఉచిత విద్యుత్ ఎందుకివ్వట్లేదు?

- 24గంటల కరెంటుపై ప్రతిపక్షాలది అసూయ
- ఎలా సాధ్యమైందని 15 రాష్ట్రాలు సంప్రదింపులు చేస్తున్నాయి : టీఈఈఏ డైరీ ఆవిష్కరణలో విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి


డైరీ ఆవిష్కరణలో మంత్రులు జగదీశ్, ఈటల, తదితరులు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో వ్యవసాయానికి 24గంటల ఉచిత విద్యుత్ సరఫరాపై ప్రతిపక్షాలు అసూయ పడుతు న్నాయని విద్యుత్‌శాఖ మంత్రి జి జగదీశ్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఇంజనీర్స్ అసోసియే షన్ ఆధ్వర్యంలో శనివారంనాడిక్కడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ ఆడిటోరియంలో 2018 సంవత్సర డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ సభ ఎన్ శివాజీ అధ్యక్షతన జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ విద్యుత్‌రంగంలో టీఆర్ఎస్ ప్రభుత్వం సాధించిన ప్రగతిని జీర్ణించు కోలేక కాంగ్రెస్, బీజేపీలు ఆ గొప్పతనం మాదంటే. మాది అని ప్రగల్భాలు పోతున్నాయని అన్నారు. ప్రభుత్వం విజయం సాధించిందనడానికి వారి ఏడుపులే ప్రత్యక్ష సాక్ష్యమని చెప్పారు. బీజేపీ నేతలు ఈఘనత అంతా ప్రధాని నరేంద్రమోడీదేనని ప్రచారం చేసుకుంటున్నారని, మరి గుజరాత్‌లో వ్యవసాయానికి 24గంటల ఉచిత విద్యుత్‌ను ఎందుకు అమలు చేయట్లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాం లో చేపట్టిన ప్రాజెక్టుల వల్లే ఇప్పుడు రాష్ట్రంలో విద్యుత్ వెలుగులు వస్తున్నాయని ఆపార్టీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్తున్నారని, ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ పేరుతో రాష్ట్ర విభజన జరిగితే తెలంగాణ అంధకారమౌతుందని ప్రకటించినప్పుడు ఈ గొంతులు ఎందుకు మూగబోయాయని అన్నారు. కాంగ్రెస్ హయాంలో శంకుస్థాపనలు ఒకరు చేస్తే...మరొకరు వాటికి సంవత్సరీకాలు చేస్తూ పోయారని, ఒక్కో ప్రాజెక్ట్‌ను ఏండ్ల తరబడి నాన్చిన ఘనత కూడా వారిదేనని ఎద్దేవా చేశారు. రైతాంగానికి 24గంటల కరెంటు వద్దని చెప్పడానికి ఆ పార్టీ నేతలకు సిగ్గుండాలని విమర్శించారు. తెలంగాణలో 24గంటల ఉచిత విద్యుత్ అమలుపై 15 రాష్ట్రాలు సంప్రదింపులు చేస్తున్నాయని, కానీ ఇక్కడి నాయకులకు ఆ సోయి కూడా లేకుండా పో తోందని అన్నారు. టీఎస్‌జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎమ్‌డీ దేవులపల్లి ప్రభాకరరావు వయసుకు మించి కష్టపడుతున్నారని, బీజేపీ నేతలు ఆయనపై వ్యక్తిగత విమర్శలు చేసే స్థాయికి దిగజారారని అన్నారు. తెలంగాణ విద్యుత్ ఇంజనీర్లు, ఉద్యోగుల కష్టాన్ని తక్కువ చేస్తూ, వారి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసేలా ప్రతిపక్షాలు వ్యవహరిస్తున్నాయని స్పష్టం చేశారు. విద్యుత్ సంస్థల్లో ఆంధ్రప్రదేశ్ స్థానికత రిలీవ్ ఉద్యోగుల విషయంలో ఆందోళన చెందాల్సిన పనిలేదని, ప్రభుత్వం, యాజమాన్యం తెలంగాణ ఉద్యోగులకు అండగా ఉంటుందని భరోసానిచ్చారు. విభజన చట్టంలోని లొసుగుల్ని ఆసరా చేసుకొని కొందరు న్యాయస్థానాల్ని ఆశ్రయించారని, దీనిపై ఎలా వ్యవహరించాలో తమకు తెలుసని చెప్పారు. ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్ మాట్లాడుతూ ప్రతిపక్షాలు విద్యుత్‌పై చిల్లర రాజకీయాలు పక్కనపెట్టాలని సూచించారు. జీఎస్‌డీపీలో 17 శాతం వ్యవసాయరంగం నుంచే వస్తోందని, ఆ మొత్తం రాష్ట్రంలో 70 శాతం మందికి ఉపాధి కల్పిస్తున్నదని అన్నారు. బడ్జెట్ అంటే లాభనష్టాల లెక్కలు కాదని, ప్రభుత్వాలు వ్యాపారసంస్థలు అంతకంటే కాదని, నిధుల కేటాయింపు, సమీకరణ అన్నింటా మానవీయకోణం ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో టీఎస్‌జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎమ్‌డీ దేవులపల్లి ప్రభాకరరావు, డిస్కంల సీఎమ్‌డీలు జి రఘుమారెడ్డి, ఏ గోపాలరావు, బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మెన్ దేవీప్రసాద్‌తో పాటు పలువురు డైరెక్టర్లు పాల్గొన్నారు.

'డబుల్'కు స్టీల్ ఎఫెక్ట్

ఒక్కో యూనిట్‌కు రూ.50వేల అదనపు భారం

- ధరపెంచాలని కాంట్రాక్టర్ల పట్టు
- అవకాశం లేదంటున్న అధికారులు
- జీహెచ్‌ఎంసీపై రూ.500కోట్ల భారం
- ప్రభుత్వం వద్దకు గుత్తేదారులు
- వారం రోజుల్లో సర్కార్ నిర్ణయం



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డబుల్ రూమ్ ఇండ్లకు స్టీల్ సమస్య వచ్చి పడింది. మార్కెట్‌లో స్టీల్ ధరలు పెరగడంతో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కాంట్రాక్టర్లు బెంబేలెత్తిపోతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో టన్ను స్టీల్‌కు రూ.46వేలు ఉంది. రూ.50వేలకు చేరే అవకాశాలు ఉన్నాయని ఈధరకు స్టీల్ తీసుకొచ్చి పనులు చేయలేమని కాంట్రాక్టర్లు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. స్టీల్ ధరలు పెరగడంతో ఇండ్ల యూనిట్ రేట్లు కూడా పెంచాలని కాంట్రాక్టర్లు గృహనిర్మాణశాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్, ముఖ్యకార్య దర్శులకు, ఆయా జిల్లాలోని కలెక్టర్లు, జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు సైతం వినతి పత్రాలు అందజేశారు. అయితే కాంట్రాక్టర్లతో చేసుకున్న ఒప్పందం ప్రకారం డబుల్‌బెడ్ రూమ్ ఇండ్ల యూనిట్ రేటు పెంచడానికి అవకాశంలేదని, దీనిపై ప్రభుత్వ స్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు.

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో సుమారు రూ.8,600కోట్లతో లక్ష డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించాలని జీహెచ్‌ఎంసీ లక్ష్యంగా పెట్టుకుంది. లక్ష ఇండ్లకు టెండర్లు పూర్తిచేశారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాలో 109 ప్రాంతాల్లో ఇండ్లను నిర్మిస్తున్నారు. ఇప్పటి వరకు నాచారంలోని సింగడి తండా బస్తీలో ఇండ్లు పూర్త య్యాయి. సంక్రాంతి తర్వాత గృహప్రవేశాలు చేసే అవకాశముంది. 60వేల ఇండ్లకు సంబంధించిన పునాదులు పడ్డాయి. మరో 35వేల ఇండ్లకు సంబం ధించిన పనులు ప్రారంభమయ్యాయి. మిగిలిన ఇండ్లకు సంబంధించిన ప్రాంతాల్లో వివాదాలు ఉన్నాయి. వాటిని పరిష్కరించి పనులు చేపట్టడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు.

జీహెచ్‌ఎంసీపై రూ.500కోట్ల భారం

జీహెచ్‌ఎంసీలో లక్ష ఇండ్ల నిర్మాణానికి అధికారులు టెండర్లు పిలిచారు. కాంట్రాక్టర్లతో ఒప్పందం చేసుకున్నారు. పనులు సాగుతున్నాయి. ఒప్పందం చేసుకున్నప్పుడు టన్ను స్టీల్‌కు రూ.30వేలు ఉంది. ప్రస్తుతం రూ. 46వేలు ఉంది. ఇదీ రూ50వేలకు చేరే అవకాశాలు ఉన్నాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. స్టీల్ రేట్ ప్రకారం ఒక్కో యూనిట్‌కు రూ.50వేల అదనపు భారం పడే అవకాశముంది. ఈ లెక్కన జీహెచ్‌ఎంసీపై రూ.500కోట్ల భారం పడే అవకాశముంది. అయితే పెరిగిన స్టీల్ రేట్ ప్రకారం యూనిట్ రేట్లు పెంచాలని కాంట్రాక్టర్లు పట్టుబడు తున్నారు. రేటు పెంచకుంటే పనిచేయడం కష్టంగా ఉందని మొరపెట్టుకుంటున్నారు. ఒప్పందం ప్రకారమైతే స్టీల్ రేటు పెరిగినందుకు యూనిట్ రేటు పెంచడానికి అవకాశంలేదని జీహెచ్‌ఎంసీ అధికారులు చెబుతున్నారు. ఈ విషయంపై జీహెచ్‌ఎంసీ చీఫ్ ఇంజినీర్ కన్నా సురేష్‌కుమార్ వివరణ కోరగా ఈ సమస్య జీహెచ్‌ఎంసీ పరిధిలోనే కాదని, రాష్ట్రవ్యాప్తంగా ఉందని అన్నారు. దీనిపై తాము నిర్ణయం తీసుకునే అధికారంలేదని, విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. సర్కార్ తీసుకునే నిర్ణయానికనుగుణంగా పనిచేస్తామన్నారు.

సర్కార్‌కు వద్దకు

స్టీల్ రేట్లు పెరిగిన నేపథ్యంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల యూనిట్ ధరలు పెంచాలని కాంట్రాక్టర్లు అడుగుతున్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలో ఇదే పరిస్థితి ఉంది. ఈ విషయంపై కాంట్రాక్టర్లు ఇప్పటికే జిల్లా కలెక్టర్లకు వినతి పత్రాలు అందజేశారు. మంత్రులను సైతం కలిసి విన్నవిం చారు. గృహ నిర్మాణ శాఖ మంత్రి అందుబాటులో లేకపోవడంతో ఈ విషయంపై చర్చించలేదని తెలిసింది. వారం రోజుల్లో దీనిపై స్పష్టం వచ్చే అవకాశముంది.

నెలలో ఒకరోజు 'నో బ్యాగ్



నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

విద్యార్థులకు బ్యాగుల భారం నుంచి ఉపశమనం కోసం నెలలో చివరి శనివారం అన్ని పాఠశాలల్లో 'నో బ్యాగ్ డే' నిర్వహిస్తామని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి కిషన్ తెలిపారు. కర్నాటకలో ఈ విధానం అమలవుతుందనీ, తెలంగాణలోనూ వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. శుక్రవారం పాఠశాల విద్య డైరెక్టరేట్‌లో ఎస్‌సీఈ ఆర్టీ డైరెక్టర్ శేషుకుమారి, హైదరాబాద్ డీఈఓ సత్యనారాయణరెడ్డి, ప్రొఫెసర్ సురేశ్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. బ్యాగులభారం తగ్గించాలని యాజమాన్యాలకు ఆదేశాలిచ్చిన సరిగా అమలు చేయడం లేదని, దీంతో మరోసారి పాఠశాలలను తనిఖీలు చేయాలనీ ఎంఈఓలను ఆదేశించామనీ కిషన్ స్పష్టం చేశారు. ప్రయివేటు పాఠశాలల్లో ప్రతి తరగతిలో ప్రత్యేకంగా అల్మారాలను ఏర్పాటు చేస్తున్నట్టు యాజమాన్యాలు చెప్పినట్టు ఆయన చెప్పారు. ఈనెల 8నుంచి 12 వరకు నగరంలోని సెయింట్ ప్యాట్రిక్స్ హైస్కూల్‌లో సౌత్ ఇండియన్ సైన్స్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్టు జి కిషన్ తెలిపారు. సోమవారం ఉదయం డిప్యూటీసీఎం కడియం శ్రీహరి సైన్స్ ఫెయిర్ ప్రారంభిస్తారనీ, 12న జరిగే ముగింపు కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ నరసింహన్ పాల్గొంటారని చెప్పారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు, కర్నాటక, పుదుచ్చేరి రాష్ట్రాల నుంచి విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొంటున్నారని అన్నారు.

వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమలు

- సౌత్ ఇండియన్ సైన్స్ ఫెయిర్‌కు ఏర్పాట్లు పూర్తి: పాఠశాల విద్యాశాఖ కమిషనంఙి కిషన్

2012లో చిత్తూరు జిల్లాలో సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్ జరిగిందనీ గుర్తుచేశారు. ఆరు అంశాలపై విద్యార్థులు, ఉపాధ్యాయులు వారి ఎగ్జిబిట్స్ ప్రదర్శిస్తారని వివరించారు. ప్రభుత్వ, ప్రయివేటు విద్యార్థులం దరూ చూసే వీలు కల్పిస్తున్నామనీ, ప్రయివేటు యాజమాన్యాలు దీని రవాణా కోసం డబ్బులు వసూలు చేయకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ విద్యాసంవ త్సరం పదో తరగతి పరీక్షా కేంద్రాలను ఎక్కువగా ప్రభుత్వ పాఠశాలల్లోనే ఏర్పాటు చేస్తున్నామని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు.

టీఆర్టీ దరఖాస్తుకు రేపే ఆఖరు

- ఎడిట్ ఆప్షన్ 11 వరకు పెంపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్టీ)కి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేందుకు ఇక రెండు రోజులే గడువుంది. ఎడిట్ ఆప్షన్ గడువును ఈనెల 8 నుంచి 11వ తేదీ వరకు పొడిగించింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) కార్యదర్శి ఎ వాణీప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 8,792 ఉపాధ్యాయ పోస్టులతో 2017, అక్టోబర్ 21న టీఆర్టీ నోటిఫికేషన్ విడుదలైన సంగతి తెలిసిందే. అభ్యర్థుల బయోడేటా, ఇతర వివరాలను సరిచూసుకోవాలని సూచించారు. పీడీఎఫ్‌లో ఉన్న బయోడేటా వివరాలు తప్పుగా ఉన్నాయని తెలిపారు. వివరాలు సరిదిద్దుకోవడానికి కల్పిస్తున్న అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

బీసీ డిక్లరేషన్ నివేదిక సిద్ధం : ఈటల

- త్వరలో సీఎంకు అందజేత
- సంచార జాతులకు రూ. లక్ష రుణం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీసీల సమస్యలు, ఆర్థికాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై బీసీ నివేదికను సిద్ధం చేశామని ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ చెప్పారు. త్వరలోనే ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావుకు నివేదిక అందజేస్తామన్నారు. శుక్రవారం సచివాలయంలో మంత్రి జోగు రామన్న అధ్యక్షతన బీసీ మంత్రుల సమావేశం జరిగింది. అనంతరం మంత్రి ఈటల రాజేందర్ మాట్లాడుతూ సంచార జాతులకు నేరుగారూ.లక్ష రుణం అందజేస్తామని తెలిపారు. నాయి బ్రాహ్మణులకు కొత్త షాపులు పెట్టుకోవడానికి, ఉన్న వాటిని ఆధునీకరించడానికి రుణాలు అందజేస్తామన్నారు. ఇకనుంచి పనిచేసే వారికే పూర్తి ఆదాయం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముందుగా సంచార జాతులు, నాయి బ్రాహ్మణులు, విశ్వకర్మ వృత్తుల వారికి రుణాలు అందజేసేలా నివేదిక రూపొందించామని తెలిపారు. గతంలో పేదలకు ఇచ్చే స్కీమ్స్‌కు బ్యాంకుల సహకారం లేకపోవడం వల్ల పేదోళ్లు పేదరికానికే పరిమితం అయ్యారని చెప్పారు. ఒకవేళ రుణాలు మంజూరు అయినా దళారుల చేతుల్లోకి వెళ్తున్నాయే తప్ప పేదలకు అందడం లేదన్నారు. 2018-19సంక్షేమ నామ సంవత్సరమని,ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీలకు సంక్షేమ పథకాలు అందజేస్తామని చెప్పారు.

ఫ్లెక్సీ పెట్టినందుకు కార్పొరేటర్‌కు జరిమానా

- నిషేధమున్నా ఏర్పాటు చేయడమేంటీ.. : ఆగ్రహం వ్యక్తం చేసిన మంత్రి కేటీఆర్
- చివరకు జరిమానాలు చెల్లించిన కార్పొరేటర్లు

నవతెలంగాణ - సిటీబ్యూరో

ఫ్లెక్సీ ఏర్పాటు చేసినందుకుగాను మూసారాంబాగ్ కార్పొరేటర్ సునరితారెడ్డి, మాజీ కార్పొరేటర్ మహ్మద్ అస్లంకు జీహెచ్‌ఎంసీ అధికారులు జరిమానా విధించారు. గ్రేటర్ హైదరాబాద్‌లో అనధికారికంగా ఫ్లెక్సీ, బ్యానర్లు, పార్టీల జెండాలను ప్రదర్శించడాన్ని నిషేధించిన విషయం తెలిసిందే. మూసారాంబాగ్ డివిజన్‌లోని శ్రీపురం కాలనీలో షటిల్ బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం ప్రారంభోత్సవానికి వచ్చిన రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌కు స్వాగతం పలుకుతూ పెద్దఎత్తున ఫ్లెక్సీ, బ్యానర్లు ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీల ఏర్పాటుపై నిషేధం ఉన్న విషయాన్ని మేయర్ బొంతు రామ్మోహన్ కేటీఆర్ దష్టికి తీసుకొచ్చారు. దీంఎ ఫ్లెక్సీ నిషేధం అమలులో ఆదర్శంగా ఉండాల్సిన కార్పొరేటరే స్వయంగా నిబంధనలను అతిక్రమించి ఏర్పాటు చేయడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ ఫ్లెక్సీలు ఏర్పాటుచేసిన కార్పొరేటర్ సునరితారెడ్డితోపాటు మాజీ కార్పొరేటర్ మహ్మద్ అస్లంలకు జరిమానా విధించాల్సిందిగా ఆదేశించారు. దీంతో సునరితారెడ్డికి రూ.50 వేలు, మాజీ కార్పొరేటర్ అస్లాంకు రూ.25 వేలను జరిమానాగా విధిస్తూ జీహెచ్‌ఎంసీ అధికారులు నోటీసులు జారీచేశారు. మంత్రికి స్వాగతం పలుకుతూ ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు, పార్టీ జెండాల తోరణాలను మేయర్ రామ్మోహన్, డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్‌లు దగ్గర ఉండి జీహెచ్‌ఎంసీ సిబ్బందితో తొలగింపజేశారు. నగర సుందరీకరణలో భాగంగా నగరంలో ఫ్లెక్సీల ఏర్పాటును నిషేధించామని, ఈ విషయంలో ఎవరూ అతీతం కాదని మేయర్ రామ్మోహన్ స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా ఫ్లెక్సీ బ్యానర్లు ఏర్పాటు చేసినందుకుగాను విధించిన రూ.50 వేల జరిమానాను చెక్కు రూపంలో కార్పొరేటర్ సునరితారెడ్డి, రూ.25 వేల జరిమానాను మాజీ కార్పొరేటర్ మహ్మద్ అస్లాం జీహెచ్‌ఎంసీ అధికారులకు అందజేశారు.

సాయిలు మృతిపై నివేదిక ఇవ్వాలి

- తహసీల్దార్‌కు కామారెడ్డి కలెక్టర్ ఆదేశం
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రతినిధి/బాన్సువాడ

కామారెడ్డి జిల్లాలోని పిట్లం మండలం మార్దాండకు బోయిని సాయిలు (గ్రామంలో వీఆర్ఏ విధులు నిర్వర్తిస్తున్నాడు) మృతిపై నివేదికను అందజేయాలని తహసీల్దార్‌ను కామారెడ్డి కలెక్టర్ సత్యనారాయణ ఆదేశించారు. ఎస్పీ శ్వేతారెడ్డి, జిల్లా మైనింగ్ అధికారి రవి, బాన్సువాడ డీఎస్పీ నర్సింహారావు, బాన్సువాడ ఆర్‌డీవో రాజేశ్వర్లుతో కలిసి ఆయన ఘటనాస్థలిని శుక్రవారం పరిశీలించారు. ప్రమాదవశాత్తు సాయిలు మృతిచెందినట్టు అతని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసుల తీరుపై అనుమానాలు రేకెత్తుతున్నాయి.భర్త మృతిపై స్వయంగా సాయవ్వనే పోలీసులకు ఫిర్యాదు చేసిందా..? లేక ఇసుక వ్యాపారులను తప్పించేందుకు పోలీసులే ఈ విధంగా ఫిర్యాదు ఇవ్వాలని ఆమెపై ఒత్తిడి తెచ్చి ఉంటారా..? అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. ఎలాంటి ఆధారమూ లేని బాధితురాలిని ఆర్థికంగా ఆదుకుంటామని ఆశ చూపి ఇసుక వ్యాపారులు ఆధారాలు తారుమారు చేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిగితేనే అసలు నిజాలు వెలుగులోకి వస్తాయని సాయిలు గ్రామస్తులు అంటున్నారు.

దక్షిణకొరియాతో చర్చలకు సిద్ధమే..

- ఉత్తర కొరియా

ప్యాంగ్యాంగ్ : దక్షిణ కొరియాతో చర్చలకు సిద్ధంగా ఉన్నట్టు ఉత్తరకొరియా ప్రకటించింది. ఈనేపథ్యంలో ఇరుదేశాలకు చెందిన ప్రతినిధులు ఈనెల 9న భేటీ కానున్నారు. చర్చల కోసం సియోల్ పంపిన అభ్యర్థనకు ప్యాంగ్యాంగ్ అంగీకారం తెలపడంతో ఈ సమావేశాలకు మార్గం సుగమమైందని దక్షిణ కొరియా అధికారులు వెల్లడించారు. దక్షిణ కొరియాలో వచ్చేనెల జరగనున్న వింటర్ ఒలంపిక్స్‌కు తమ క్రీడాకారులను పంపించనున్నట్టు ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్-జోంగ్-ఉన్ ప్రకటించారు. దక్షిణ కొరియాతో చర్చలు జరిపేందుకు తాము సిద్ధమేనని నూతన సంవత్సర వేడుకల్లో కిమ్ ప్రసంగించారు. దక్షిణ కొరియా కూడా అందుకు సానుకూలంగా స్పందించింది. అదే విషయంపై ఈ నెల 9న ఇరు దేశాల మధ్య జరగనున్న ఉన్నతస్థాయి సమావేశంలో చర్చించనున్నారు. రెండు దేశాల సరిహద్దులోని పన్ముంజోమ్ గ్రామంలో ఈ సమావేశం జరిగే అవకాశం ఉంది. ఈ గ్రామానికి 'శాంతి నిలయం' అన్న పేరుంది. గతంలోనూ ఇరు దేశాల మధ్య జరిగిన అనేక చర్చలకు ఈ గ్రామం వేదికైంది. వింటర్ ఒలంపిక్స్ క్రీడలే ఈ సమావేశంలో ప్రధానాంశం అవుతుందని దక్షిణకొరియా అధ్యక్ష కార్యాలయ అధికారి తెలిపారు. 2015 డిసెంబర్ తర్వాత ఈ దేశాల మధ్య ఉన్నతస్థాయి చర్చలు జరగడం ఇదే తొలిసారి. అయితే.. ఈ సమావేశానికి ఎవరెవరు హాజరవుతారనే విషయం తెలియాల్సి ఉంది. కొరియా దేశాల మధ్య మైత్రిని పెంచుకునేందుకు వింటర్ ఒలంపిక్స్ సదవకాశంగా ఉపయోగపడుతుందని ఇటీవల దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ జెయిన్ ప్రకటించారు.


ఉ. కొరియా, ద. కొరియా దేశాల మధ్య సరిహద్దు ప్రాంతం

కొరియా ద్వీపకల్పంలో సైనికవిన్యాసాలు నిలిపివేత : ట్రంప్



సియోల్ : కొరియా ద్వీపకల్పంలో సైనిక విన్యాసాలను పాక్షికంగా నిలిపివేసినట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ప్యాంగ్‌చాంగ్ ఒలింపిక్ గేమ్స్‌కు దక్షిణ కొరియా వేదికగా మారనుంది. వచ్చేనెలలో జరుగనున్న ఒలింపిక్ గేమ్స్ కోసం దక్షిణ కొరియా ఇప్పటికే ఏర్పాట్లను పూర్తి చేసింది. ఈ క్రీడల్లో ఉత్తరకొరియా క్రీడాకారులు కూడా పాల్గొంటారని ఆదేశాధ్యక్షుడు కిమ్-జోంగ్-ఉన్ ప్రకటించారు. అయితే, కొరియా ద్వీపకల్పంలో అమెరికా, దక్షిణ కొరియా, జపాన్ బలగాలు గత కొంతకాలంగా ఉమ్మడి సైనిక విన్యాసాలు నిర్వహిస్తూ ఉద్రిక్త వాతావరణం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్న సంగతి తెలిసిందే. ఒలింపిక్ గేమ్స్ పూర్తయేంత వరకు కొరియా ద్వీపకల్పంలో ఎలాంటి విన్యాసాలు నిర్వహించొద్దని అమెరికా రక్షణ శాఖకు ట్రంప్ ఆదేశాలు జారీ చేశారు. ట్రంప్ ప్రతిపాదనను దక్షిణ కొరియా, జపాన్ కూడా స్వాగతించినట్టు సమాచారం. ఇదిలా ఉండగా, జాయింట్ మిలిటరీ డ్రిల్స్ వాయిదా వేయడమంటే ఉత్తరకొరియాకు తలొగ్గినట్టు కాదని, అంతర్జాతయ సమాజం నుంచి ఆ దేశంపై ఒత్తిళ్లు పెంచుతామని అన్నారు. ప్రస్తుతం జపాన్ చుట్టూ నెలకొన్న పరిస్థితులు రెండో ప్రపంచ యుద్ధం కాలం కంటే ప్రమాదకరంగా ఉన్నాయని జపాన్ ప్రధాని షింజో అబే అభిప్రాయ పడ్డారు.

ఇండోనేషియాలో పడవ మునక : 13 మంది మృతి



జకార్తా : ఇండోనేషియాలో సుమత్రా దీవికి సమీపంలో ఓ పడవ మునిగిపోయింది. ఈ ఘటనలో 13 మంది మృతి చెందారు. మరి కొందరు గల్లంతయ్యారు. పడవ బయలుదేరిన సమయంలో 55 మంది ప్రయాణికులున్నట్టు ఎస్పీ రాబిన్‌సన్ సిర్గన్ తెలిపారు. గల్లంతైన వారిని రక్షించేందు కోసం ప్రత్యేక సహాయక చర్యలు చేపట్టామని అన్నారు. ప్రతికూల వాతావరణం కారణంగా పడవ మునిగిపోయిందని ప్రాథమిక విచారణలో తెలిసిందన్నారు. ఈ ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డ పడవ కెప్టెన్‌ను విచారిస్తున్నామని ఎస్పీ తెలిపారు.

జార్జియాలో పట్టాలు తప్పిన రైలు

టిబిలీస్ : జార్జియాలో ఓ ప్యాసింజర్ రైలు పట్టాలు తప్పింది. రైలు డ్రైవర్ అత్యంత అప్రమత్తంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. రైల్వే అధికారులు తెలిపిన వివరాల ప్రకారం...జార్జియాలోని సవాన్నా స్టేషన్ నుంచి రైలు బయలుదేరిన కొద్ది సేపటికి పట్టాలు తప్పింది. రైలులో 311 మంది ప్రయాణికులున్నారు. అయితే, ప్రమాదం సంభవించినప్పుడు రైలు డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించారు. ఈ ఘటనలో ప్రయాణికులెవరూ గాయపడలేదని అధికారులు స్పష్టం చేశారు. ఈ ఘటనపై విచారణకు ఆదేశించామని అన్నారు.

ఓక్లాండ్‌లో భూకంపం

- రిక్టర్‌స్కేల్‌పై తీవ్రత 4.4గా నమోదు

వాషింగ్టన్ : ఓక్లాండ్‌లో భూకంపం సంభవించింది. రిక్టర్‌స్కేల్‌పై భూకంప తీవ్రత 4.4గా నమోదైందని యూఎస్ జియోలజికల్ సర్వే అధికారులు తెలిపారు. బెర్కెలీ నుంచి 3కిలోమీటర్ల దూరంలో 13 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించామన్నారు. ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించిన వివరాలు తెలియరాలేదు.

పాకిస్థాన్‌కు ఆర్థిక సాయం నిలిపేసిన అమెరికా

వాషింగ్టన్: ఉగ్రవాద సంస్థలను నియంత్రించడంలో పాకిస్థాన్ ఘోరంగా విఫలమైందని అమెరికా దుయ్యబట్టింది. ఉగ్రవాదాన్ని నిర్మూలించడానికి తగిన చర్యలు తీసుకొనే వరకు ఎలాంటి రక్షణ సాయం చేయబోమని ప్రకటించింది. 115 కోట్ల డాలర్ల (సుమారు రూ.7289 కోట్లు) సాయాన్ని నిలిపేసినట్టు అమెరికా ప్రభుత్వం పేర్కొన్నది. పాక్ భూభాగం నుంచి పని చేస్తున్న ఉగ్రవాద సంస్థలను ఆ దేశ ప్రభుత్వం కట్టడి చేయలేకపోతున్నదని తెలిపింది.హక్కానీ నెట్‌వర్క్, అఫ్ఘనిస్థాన్ తాలిబాన్‌లపై చర్యలు తీసుకునే వరకు నిధులు ఇవ్వబోమని అమెరికా స్పష్టం చేసింది. ప్రస్తుతం నిలిపేసిన సాయంలో ఫారిన్ మిలిటరీ ఫండింగ్ కింద ఇవ్వాలని 2016లో కాంగ్రెస్ ఆమోదించిన 25.5 కోట్ల డాలర్లు కూడా ఉన్నాయి. ఇక 2017 ఏడాదికి ఇవ్వాల్సిన 90 కోట్ల డాలర్ల కొలిషన్ సపోర్ట్ ఫండ్‌ను కూడా నిలిపేసింది అమెరికా రక్షణ శాఖ. దక్షిణాసియాలో సుస్థిరతను చెడగొట్టడంతోపాటు అఫ్ఘాన్‌లో అమెరికా బలగాలను లక్ష్యంగా చేసుకుంటున్న తాలిబన్, హక్కానీ నెట్‌వర్క్‌ల నిర్మూలనకు పాక్ చర్యలు తీసుకునే వరకు రక్షణ సాయాన్ని నిలిపేస్తున్నట్టు అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి హీదెర్ నేయెర్ట్ వెల్లడించారు.

హెచ్1బీ వీసాల జారీలో కఠినతర నిబంధనలపై వ్యతిరేకత



వాషింగ్టన్: హెచ్-1బీ వీసాల జారీలో ట్రంప్ సర్కార్ కఠినతర నిబంధనలను ప్రవేశపెట్టింది. ఈ నిబంధలనలపై వివిధ పార్టీలకు చెందిన నేతలతో పాటు న్యాయవాదుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం ప్రతిపాదిస్తున్న వీసా మార్పులను వారు విమర్శిస్తున్నారు. హెచ్-1బీ వీసా పొడిగింపు తగ్గించడం వల్ల దాదాపు 5లక్షల నుంచి 7.5లక్షల మంది ప్రవాస భారతీయులు స్వదేశాలకు వెళ్లిపోవాల్సి వస్తుందని, దీని వల్ల అమెరికాకే నష్టమని, ఇక్కడి నుంచి ప్రతిభావంతులు, నిపుణులు వెళ్లి పోతారని వారు అభిప్రాయపడుతున్నారు. ఉద్యోగ కల్పనలో అమెరికన్లకే ప్రాధాన్యం ఇవ్వాలని వీసా నిబంధనల్లో మార్పులు చేసేందుకు ట్రంప్ యంత్రాంగం సిద్ధమవుతున్న సంగతి తెలిసిందే. హెచ్-1బీ వీసాల ద్వారా అక్కడి కంపెనీలు తక్కువ వేతనాలకు విదేశీ ఉద్యోగులను నియమించుకుంటున్నాయి. అయితే, ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఈ వీసాలను తగ్గించాలని, కనీస వేతనం పెంచాలని, అమెరికన్లకే స్థానిక ఉద్యోగాల్లో ప్రాధాన్యం కల్పించాలని ఊదరగొట్టారు. అయితే హెచ్-1బీ వీసాలపై నిబంధనల వల్ల వేలాది మంది ప్రవాస భారతీయులు బాధపడుతున్నారని డెమోక్రటిక్ నేత తులసి గబ్బార్ పేర్కొన్నారు.


అమెరికాలో మంచు తుఫాను బీభత్సం

17 మంది మృతి

వాషింగ్టన్ : అమెరికా అట్లాంటిక్ తీరాన్ని మంచు తుఫాను వణికిస్తోంది. ఈ మంచు తుఫానుకు 'బాంబ్ తుఫాను'గా వాతావరణ శాఖ అని పేరు పెట్టింది. మంచు తుఫాను బారినపడి 17 మంది మృతి చెందారు. ఉష్ణోగ్రతలు విపరీతంగా పడిపోవడం, తీవ్రంగా మంచు కురుస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఇంధనం సరఫరా చేసే పైపులతో సహా గడ్డకట్టుకుపోవడంతో తీవ్ర ఇంధన కొరత ఏర్పడి ధరలు విపరీతంగా పెరిగిపోయాయి.

విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వేలాది కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయి. మంచు తుఫాను కారణంగా విమాన, రైల్వే సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. శుక్రవారం సుమారు 4 వేల విమానాలు రద్దయ్యాయి. ఈశాన్య అమెరికా, తూర్పు కెనడాలోని సముద్ర తీర ప్రాంతాలపై దట్టంగా మంచు అలుముకుంది. బోస్టన్‌లో సుమారు 45 సెంటీమీటర్ల మేర మంచు కురిసింది. ఈ తుఫాను వారాంతం వరకు కొనసాగే అవకాశం ఉంది. గంటలకు 95 కిలోమీటర్ల వేగంతో వీచే గాలులు అమెరికా ఈశాన్య తూర్పు తీరంపై విరుచుకుపడే అవకాశం ఉంది. అమెరికాలోని పలు ప్రాంతాల్లో అత్యంత తక్కువ ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. న్యూయార్క్ నగరం, ఫిలడెల్ఫియా, బోస్టన్ , మేరీల్యాండ్, వర్జీనియాలలో ఉష్ణోగ్రతలు తీవ్రంగా పడిపోవడంతో విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు.

తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఐస్ బర్గ్‌ల మీద నిలబడవద్దని, అవి కొట్టుకుపోయే అవకాశం ఉందని జాతీయ వాతావరణ కేంద్రం హెచ్చరించింది.


మంచు తుఫాను కారణంగా జనజీవనం స్తంభించింది. సుమారు 6 కోట్ల మంది అమెరికన్లపై తుఫాను ప్రభావం కనబరుస్తోంది. పలు ప్రాంతాల్లో బస్సు సర్వీసులను కూడా రద్దు చేశారు.

బాంబ్ తుఫాను అంటే ఏమిటి




- 'బాంబ్ తుఫాను' లేదా 'వాతావరణ బాంబు' అంటే పేలుడు స్వభావం కలిగిన తుఫాను. 24 గంటల వ్యవధిలో అల్పపీడనం 24 మిల్లీబార్స్ మేర పడిపోతే దాని ఫలితంగా ప్రచండమైన వేగంతో గాలులు వీస్తాయి.
- ఈ గాలులకు చెట్లను కూల్చివేసే శక్తి ఉంటుంది. భవనాలు దెబ్బ తినే అవకాశం ఉంటుంది. భారీ ప్రాణ, ఆస్తి నష్టం సంభవించే ప్రమాదముంటుంది.
- అట్లాంటిక్ సముద్రంపై ఏర్పడిన ఈ మంచు తుఫాను కారణంగా బలమైన గాలులు, విపరీతమైన మంచు కురుస్తోంది. ఇది వారాంతం వరకు కొనసాగే అవకాశం ఉంది.
- న్యూయార్క్‌కు ఉత్తరాన ఉన్న ప్రాంతాలపై ఈ తుఫాను ఎక్కువ ప్రభావం కనబర్చే అవకాశం ఉంది.

నిరంతర కరెంట్ సరే..భూగర్భ జలాలేవీ..!

ఎండలు ముదిరితే తగ్గనున్న నీటి ఊట

- మూసీ, ఏఎమ్మార్పీ, ఎడమ కాల్వ పరిధిలోనే వాడకం అధికం
- ఆటోమెటిక్ స్టాటర్ల తొలగింపు
- ఆన్‌ఆఫ్ కోసం ఇబ్బంది పడుతున్న రైతులు

నవతెలంగాణ-నల్లగొండ ప్రతినిధి


(ఫైల్)

భూగర్భ జలాలు సమృద్ధిగా ఉన్నప్పడే వ్యవసా యానికి 24 గంటల కరెంట్ అవసరం. ఏడాదిలో సగటు చూస్తే ఉమ్మడి నల్లగొండ జిల్లాలో భూగర్భ జలాలు వర్షాలు పడినప్పడు ఆర్నెల్లు మాత్రమే ఆశాజ నకంగా ఉంటున్నాయి. యాసంగి సీజన్‌లో నాట్లు వేసే వరకే బోరు, బావుల్లో నీటి లభ్యత ఉంటుంది. కలుపుతీత సమ యానికి నీటి ఊట పడిపోయి బోర్లు, బావులు ఒట్టిపోవడం మొదలవుతుంది. కరెంట్ కోతల కంటే భూగర్భజలాలు అడుగంటడం వల్లే యాసంగి వరి పైరు ఎండిపోతోంది. అందువల్ల నీళ్లు సరిపడా లేనప్పడు కరెంట్ ఎన్ని గంటలున్నా లాభం ఉండదని రైతులు అంటున్నారు. సాగునీటి ప్రాజెక్టులన్నీ పూర్తి చేయకుండా కరెంట్ ఇచ్చినంత మాత్రాన ఆయకట్టు సాగు విస్తీర్ణం పెరగదు .

నల్లగొండ జిల్లాలో 1.75 లక్షలు, సూర్యాపేట జిల్లాలో 85 లక్షలు, యాదాద్రి జిల్లాలో 1.85 లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో మొత్తం 3 లక్షల 85 వేల 105 కనెక్షన్లు ఉండగా, వీటిల్లో 3లక్షల61,165 కనెక్షన్లకు స్టాటర్లు ఉన్నాయి. రబీ సీజన్‌లో బోర్లు, బావుల కింద వరి నాట్లు వేస్తున్నారు. డిసెంబర్‌లో నార్లు పోసినందున జనవరి, ఫిబ్రవరి, మార్చి నాటికి వరికోతలు మొదలవుతాయి. ఈ మూడు నెలలు వరితో పాటు ఇతర పంటలకు నీటి వినియోగం అధికంగా ఉంటుంది.

ఆటోమెటిక్ స్టాటర్ల తొలగింపు

నిరంతరం విద్యుత్ సరఫరా నేపథ్యంలో వ్యయసాయ విద్యుత్ కనెక్షన్లకు ఉన్న ఆటోమెటిక్ స్టాటర్లను తొలగిస్తున్నారు. ఇప్పటికే 30 శాతానికిపైనే తొలగించినట్టు అధికారులు చెబుతున్నారు. గతంలో 9 గంటల కరెంట్‌ను ప్రభుత్వం రెండు పూటల్లో సరఫరా చేసేది. ఈ క్రమంలో కరెంట్ ఎప్పుడు వస్తుందో పోతుందో తెలియని స్థితిలో ఆటోమెటిక్ స్టాటర్లు పెట్టడం 100 శాతానికి పెరిగింది. ఇప్పుడు వాటిని తొలగించడం వల్ల కొత్త సమస్యలు వస్తున్నాయి. ఒక్కో బావి, బోరు కింద కనిష్టంగా 2 ఎకరాలు గరిష్టంగా 5 ఎకరాల కంటే ఎక్కువ పారట్లేదు. ఐదెకరాల్లోపు పొలమున్న రైతులు రెండు మూడు బోర్లు వేసి నడుపుతున్నారు. కరెంట్ నిరంతరం ఉంటుండటం వల్ల బావిలో నీటి ఊటను బట్టి మూడు నుంచి ఐదు గంటల్లోపే మోటార్లు నడుస్తున్నాయి. తక్కువ లోతులో ఉన్న బోర్లు రెండు మూడు గంటల వ్యవధిలోనే ఆగిపోతున్నాయి. దీంతో కొద్దిపాటి వరి నాటు వేసుకునే రైతులకు నష్టం వాటిల్లే ప్రమాదం కూడా ఉంది.

ఫిబ్రవరి నుంచి భూమిలో నీటి లభ్యత తగ్గి పైర్లకు మాత్రం నీటి వినియోగం పెరుగుతుంది. అప్పుడు పగటి పూట పొలాలకు నీళ్లు పెట్టడం వల్ల ఎక్కువ ఆవిరవుతాది కాబట్టి రాత్రివేళల్లో మోటార్లు నడుపుకోవాలి. అప్పుడు ఆటోమెటిక్ లేకపోతే విధిగా పొలం వద్దే పడుకోవాల్సి వస్తదని రైతు శేఖర్, తాడూరు వెంకన్న ఆందోళన వ్యక్తం చేశారు. ఒక బావిలో ఊరే నీళ్లు 2 గంటలు మోటార్ నడిస్తే అయిపోతున్నాయని తెలిపారు.

భూగర్భ జలాలను బట్టే కరెంట్ వినియోగం

భూగర్భ జలాలు లభించే పరిస్థితుల్ని బట్టే బోర్లు, బావుల్లో నీటి ఊట ఉంటుంది. ఆ నీళ్లను బట్టే మోటార్ నడుస్తుంది. దీని ఆధారంగానే ఆయకట్టు సాగు విస్తీర్ణం ఉంటుంది. 24 గంటల కరెంట్ ఇవ్వడం వల్ల పెద్దగా మార్పేమీ ఉండదని రైతు సంఘాలు, వ్యవసాయ నిపుణులు పేర్కొంటున్నారు. జనవరి చివరి నుంచే భూగర్భ జలాలు అడుగంటిపోతుంటాయి. ఫిబ్రవరి, మార్చిలో సగం మండలాల్లో ప్రమాదకర స్థాయికి భూగర్భ జలాలు పడిపోతాయి. దీంతో వ్యవసాయ బోర్లే కాదు తాగునీటి బోర్లు కూడా ఒట్టిపోతాయి. భూగర్భ జలాలు సమృద్ధిగా లభించాలంటే సాగర్ ఆధునీకరణ, మూసీ ఆధునీకరణ, డిండి ఎత్తిపోతలు, ఉదయసముద్రం లిఫ్ట్, ధర్మారెడ్డిపల్లి, వరదకాల్వ, ఎస్సారెస్పీ-2, కాళేశ్వరం, ఎస్సెల్బీసీ సొరంగం వంటి ప్రాజెక్టులు, కాల్వల్ని పూర్తి చేయాలి. కృష్ణా, గోదావరి జలాల్ని నిల్వ చేసుకునే పరిస్థితి ఏర్పడితేనే కరెంట్ అవసరం ఉంటుందని రైతు సంఘం నాయకులు బండ శ్రీశైలం, వ్యవసాయ నిపుణులు ఏకోనారాయణ పేర్కొన్నారు.

24 గంటల కరెంట్

ఉమ్మడి జిల్లాలో డిసెంబర్ 31 నుంచే వ్యవసాయానికి 24 గంటల కరెంట్ సరఫరా చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఇస్తానని నిర్ణయించిన తర్వాత నల్లగొండ ఉమ్మడి జిల్లాలోనే పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టింది. నిరంతర విద్యుత్ సరఫరా చేసేందుకు అవసరమైన విద్యుత్ ఆధునీకరణ పనుల్ని పూర్తి చేసింది. 33, 11 కేవీ ఫీడర్ల ద్వారా విద్యుత్ సరఫరా చేస్తున్నారు. రూ.220 కోట్లతో విద్యుత్ లైన్ల ఆధునీకరణ, సబ్‌స్టేషన్ల నిర్మాణం, 33, 11 కేవీ ఫీడర్ల విస్తరణ వంటి పనుల్ని ఇప్పటికే పూర్తి చేశారు. జిల్లాలో డిసెంబర్‌లో వ్యవసాయం తోపాటు మొత్తం విద్యుత్ వినియోగం 18.30 మిలియన్ యూనిట్లుగా నమోదైంది. 24 గంటల కరెంట్ సరఫరా చేసిన మొదటి రోజు వినియోగం 20.99 మిలియన్ యూని ట్లుగా, ప్రస్తుతం 26.58 మిలియన్ యూనిట్లుగా నమోదవుతున్నది.

ఎమ్మెల్యే పౌరసత్వం విషయంలో ఊరట

కేంద్ర హోంశాఖ ఉత్తర్వులు ఆరువారాలు వాయిదా : హైకోర్టు ఆదేశం

నవతెలంగాణ-వేములవాడ

వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్‌బాబుకు పౌరసత్వం విషయంలో కొంత ఊరట లభించింది. కేంద్ర హోంశాఖ ఉత్తర్వులను ఆరువారాలపాటు వాయిదా వేయాలని హైకోర్టు ఆదేశించింది. ఇటీవల కేంద్ర హోంశాఖ ప్రకటనలో రమేష్‌బాబు భారతీయుడు కాదని, అతని పౌరసత్వం చెల్లదని ఆదేశాలు జారీ చేసిన విషయం విదితమే. శుక్రవారం చెన్నమనేనికి సంబంధించిన న్యాయవాదులు హైకోర్టులో తమ వాదనలు వినిపించారు. 1955వ పౌరసత్వం చట్టంలో 365రోజుల పాటు నిరంతరం భారతదేశంలో ఉండాలన్న నిబంధన లేదని, 2009లో మార్పులు చేసిన చట్టంలో మాత్రమే ఉన్నదనే వాదనలు హైకోర్టు ముందుంచారు. దీంతో ఈనెల 24వ తేదీ నాటికి కేసును కోర్టు వాయిదా వేసింది. కేంద్రహోంశాఖ ఇచ్చిన పౌరసత్వం రద్దు ఉత్తర్వులను ఆరు వారాలపాటు అమల్లోకి తీసుకోవద్దని, రెండు వారాల్లోగా కేంద్ర హోంశాఖ అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశాలు జారీచేసింది.

జేఆర్ఎఫ్ సాధించిన మొదటి లంబాడ మహిళ

నల్లగొండకు చెందిన మెగావత్ ప్రమీల



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నేషనల్ ఎలిజబులిటీ టెస్ట్ (నెట్)లో జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ (జేఆర్ఎఫ్) సాధించిన మొదటి లంబాడ మహిళగా నల్లగొండ జిల్లా తిరుమలగిరి మండలం ధన్సింగ్ తండాకు చెందిన మెగావత్ ప్రమీల ఘనతకెక్కారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్ కాలేజీలో ఎంఏ తెలుగు పూర్తి చేసిన ఆమె జేఆర్ఎఫ్ సాధించింది. ఇదే సబ్జెక్టులో 2017లో నిర్వహించిన తెలంగాణ స్టేట్ స్టేట్ ఎలిజబులిటీ టెస్టు (టీఎస్-సెట్)లోనూ ఉత్తీర్ణత సాధించారు.

ఔటర్ ఆర్థిక సలహాదారుగా లీ అసోసియేట్స్

- నాలుగు నెలల్లో ఆదాయ, వ్యయాల అంచనా
- నివేదిక ఆధారంగానే టెండర్లు

నవతెలంగాణ - హైదరాబాద్ సిటీబ్యూరో

గ్రేటర్ హైదరాబాద్ మణిహారంగా ఉన్న ఔటర్‌రింగ్ రోడ్డు ప్రయివేటీకరించేందుకు ఆర్థిక సలహాదారుగా లీ అసోసియేట్స్ (లాస అండ్ క్రిసిల్స్) అనే సంస్థను హెచ్‌ఎండీఏ ఎంపిక చేసింది. సుమారు 25 ఏండ్లకుపైగా ఔటర్ రింగ్ రోడ్డును లీజుకివ్వడానికి ఆదాయ, వ్యయాలను అంచనా వేసి లీ అసోసియేట్స్ నివేదిక రూపొందించనుంది. ఈ నివేదిక ఆధారంగా చేసుకుని ఔటర్‌రింగ్ రోడ్డును ప్రయివేటు సంస్థలకు అప్పగించేందుకు హెచ్‌ఎండీఏ గ్లోబల్ టెండర్లను ఆహ్వానించనుంది. దేశంలోని జాతీయ రహదారులతోపాటు వివిధ ప్రధాన రహదారులపై టోల్ ఫీజును ఒకేసారి రాబట్టుకోవడానికి ప్రయివేటు సంస్థలకు అప్పగించే ప్రక్రియకు కేంద్రమంత్రి వర్గం ఆరునెలల కింద పచ్చజెండా ఊపింది. ఈ విధానాన్ని భారత జాతీయ రోడ్ల నిర్వహణ సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) దేశంలోని పలు ప్రాంతాల్లో అమలుచేస్తున్నది. దీన్ని రాష్ట్రంలోనూ కొనసాగించేందుకు, ఔటర్ రింగ్ రోడ్డును ప్రయివేటీకరించేందుకు మున్సిపల్ శాఖ ఆమోదించింది. దీంతో రెండునెలల కింద హెచ్‌ఎండీఏ ఔటర్‌రింగ్ రోడ్డుపై భవిష్యత్‌లో వచ్చే ఆదాయం, వ్యయాలను కచ్చితంగా అంచనా వేసేందుకు నైపుణ్యమున్న సంస్థలను సలహాదారునిగా (టెక్నికల్ అడ్వైజింగ్ ఏజెన్సీ)ని నియమించేందుకు టెండర్లను ఆహ్వానించింది. నాలుగు ఏజెన్సీలు ముందుకు రాగా టెండర్లను తెరిచిన హెచ్‌ఎండీఏ అధికారులు సంస్థల సామర్థ్యం, అనుభవాలు తదితర అంశాల ఆధారంగా లీ అసోసియేట్స్ అనే సంస్థను ఎంపిక చేశారు. ఈ సంస్థ ఔటర్ రింగ్ రోడ్డుపై రోజు, నెలవారీగా 25 ఏండ్లపాటు ఏ మేరకు ఆదాయం వస్తుందో.. ఆదాయం రావడానికి గల ఉన్న వనరులపై పూర్తిస్థాయిలో సమగ్ర నివేదికను నాలుగు నెలల్లో రూపొందించనుంది. ఈ ఆదాయాన్ని ఆశ చూపి ఔటర్ రింగ్ రోడ్డు నిర్వహణను పూర్తిగా ప్రయివేటు సంస్థలకు అప్పగించేందుకు హెచ్‌ఎండీఏ టెండర్లను ఆహ్వానిస్తుందని మున్సిపల్ శాఖకు చెందిన ఓ అధికారి తెలిపారు.

నిర్మాణరంగంలో సంస్కరణలు అవసరం

భాయ్ అధ్యక్షులు రాఘవరెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నిర్మాణ రంగంలో భారీ సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందని భారత బిల్డర్స్ అసోసియేషన్(భాయ్) జాతీయ అధ్యక్షులు హెచ్ఎన్ విజయరాఘవరెడ్డి తెలిపారు. అప్పుడే ధరలు తగ్గుతాయని, అందరికి ఇండ్లు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. ఈమేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సిమెంట్ రెగ్యులేటరీ అథారిటీని ఏర్పాటు చేయడం ద్వారా సిమెంట్ ధరలను నియంత్రించవచ్చని చెప్పారు. తద్వారా చదరపు అడుగుకు రూ. 50 మేర నిర్మాణ వ్యయాన్ని తగ్గించవచ్చన్నారు. ఈనేపథ్యంలో ఈనెల 19 నుంచి 21వరకు 28వ భాయ్ సమావేశాలు బెంగళూరులో జరగనున్నాయని వివరించారు. వీటిని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రారంభిస్తారని చెప్పారు. 100 స్మార్ట్ నగరాల నిర్మాణం కోసం కేంద్రం రూ.65 లక్షల కోట్ల మేర పెట్టుబడి పెట్టేందుకు ప్రణాళిక రూపొందించిందన్నారు.

ధర్మదీక్ష నిరాకరణపై హైకోర్టు ఆగ్రహం

- 7న గజ్వేల్‌లో జరిపేందుకు అనుమతి
- ఇది సీపీయస్ ఉద్యోగ,ఉపాధ్యాయుల విజయం: స్థితప్రజ్ఞ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పింఛన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్‌సీపీఎస్ఈయూ) ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లాలోని గజ్వేల్‌లో ఈనెల 7న తలపెట్టిన అయుత ధర్మదీక్షకు అనుమతి నిరాకరించడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అనుమతి ఇచ్చి గురువారం రాత్రి 11 గంటలకు రద్దు ఉత్తర్వులు జారీ చేయడం పట్ల ప్రభుత్వానికి అక్షింతలు వేసింది. ఈనెల 7న గజ్వేల్‌లో అయుత ధర్మదీక్ష నిర్వహించేందుకు హైకోర్టు అనుమతి ఇచ్చింది. అయుత ధర్మదీక్ష అనుమతిని నిరాకరిస్తున్నట్టు గజ్వేల్ పోలీసు అధికారులు గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.



రాతపూర్వకంగా ఇవ్వాలని కోరడంతో సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కురాకుల శ్రీనివాస్‌కు పోలీసులు అందజేశారు. గురువారం అర్ధరాత్రి హైదరాబాద్ చేరుకున్నారు. దీన్ని సవాల్ చేస్తూ టీఎస్‌సీపీఎస్ఈయూ నేతలు శుక్రవారం హైకోర్టును ఆశ్రయించారు. ప్రభుత్వ, పిటిషనర్ల వాదనలు విన్న కోర్టు ధర్మదీక్ష నిర్వహించేందుకు మొగ్గు చూపింది. అనంతరం టీఎస్‌సీపీఎస్ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ మీడియాతో మాట్లాడుతూ గురువారం రాత్రి హైదరాబాద్‌కు చేరుకొని శుక్రవారం ఉదయం హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశామని చెప్పారు. హైకోర్టు సింగిల్ బెంచ్ జడ్జి వికె భట్టు ఈనెల 7న గజ్వేల్‌లో అయుత ధర్మదీక్ష నిర్వహించేందుకు అనుమతి ఇచ్చారని అన్నారు. ఇది సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల ధర్మ పోరాట విజయమని చెప్పారు. ఈనెల 7న సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు గజ్వేల్‌కు తరలిరావాలని కోరారు. అయుత ధర్మదీక్షను విజయవంతం చేయాలని టీఎస్‌సీపీఎస్ఈయూ ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, కోశాధికారి నరేష్‌గౌడ్ నాయకులు మల్లికార్జున్, రమీజ్, వీరేశం, శ్రీనివాస్ అన్నారు.

నవచిత్రం



ఐశ్వర్యరాయ్

10 కోట్లు..!

'రాత్ ఔర్ దిన్' రీమేక్‌లో ఐశ్వర్యరాయ్ నటించబోతున్నట్టు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. 1967లో వచ్చిన ఈ సినిమా సంచలన విజయం సాధించింది. సత్యన్ బోస్ దర్శకత్వం వహించగా ప్రదీప్ కుమార్, నర్గీస్ ప్రధాన పాత్రల్లో నటించారు. మల్టీపుల్ పర్సనాలిటీ డిజార్డర్ ఉన్న మహిళ పాత్రలో నర్గీస్ తన అద్భుతమైన నటనతో జాతీయ అవార్డు అందుకున్నారు. ఇప్పుడు రూపొందబోయే రీమేక్‌లో నర్గీస్ పాత్రకు ఐష్‌ను తీసుకోబోతున్నారట. మాతృక మాదిరిగానే ఇందులో ఐష్ ద్విపాత్రాభినయం చేయనున్నారు. ఇదంతా ఓ ఎత్తయితే, ఇందులో నటించేందుకు ఐష్ భారీ స్థాయిలో రెమ్యూనరేషన్ డిమాండ్ చేసిందని తెలుస్తోంది. ఈ పాత్రలో నటించేందుకుగానూ ఆమె అక్షరాల పది కోట్ల రూపాయలను పారితోషికంగా తీసుకోబోతుందట. పాత్రకు ప్రాధాన్యత ఉండటంతో ఆ మొత్తాన్ని ఇచ్చేందుకు నిర్మాతలు కూడా ఓకే చెప్పారట. ఈ చిత్రాన్ని ప్రెర్నా అరోరా, సిద్ధార్థ్ ఆనంద్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు.



చిత్ర యూనిట్‌తో రవితేజ దిగిన సరదా సెల్ఫీ

రవితేజ నయా చిత్రం షురూ..

ఇటీవల 'రాజా ది గ్రేట్'తో ఆకట్టుకున్న రవితేజ తాజాగా కళ్యాణ్ కృష్ణ దర్శకత్వంలో ఓ సినిమాలో నటించబోతున్నారు. ఇందులో మాళవిక శర్మను కథానాయికగా ఎంపిక చేశారు. ఎస్ఆర్‌టి ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రామ్ తాళ్ళూరి నిర్మిస్తున్న ఈ చిత్ర రెగ్యులర్ షూటింగ్ శుక్రవారం ప్రారంభమైంది. సినిమా గురించి నిర్మాత రామ్ తాళ్ళూరి మాట్లాడుతూ, 'మా బ్యానర్‌లో మొదటి చిత్రంగా మాస్ మహరాజా రవితేజ హీరోగా, కళ్యాణ్ కృష్ణ దర్శకుడిగా సినిమా నిర్మిస్తున్నందుకు చాలా హ్యాపీగా ఉంది. కళ్యాణ్ కృష్ణ ఇప్పటికే రెండు విజయవంతమైన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రాలను రూపొందించారు. ఫ్యామిలీ ఆడియెన్స్‌లో కళ్యాణ్ చిత్రాలకు ఓ ప్రత్యేకత ఉంది. అలాగే రవితేజ చిత్రం అంటే అన్ని వర్గాల ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుంది. ప్రస్తుతం సక్సెస్‌లో ఉన్న ఈ ఇద్దరి కాంబినేషన్‌లో సినిమా రావడం, క్రేజీ కాంబినేషన్‌గా ట్రేడ్ వర్గాల్లో బజ్ రావడం చాలా ఆనందంగా ఉంది. ఈ చిత్రానికి ముకేష్ సినిమాటోగ్రాఫర్‌గా వర్క్ చేస్తున్నారు. ఇతర వివరాలను త్వరలోనే వెల్లడిస్తాం' అని చెప్పారు.

టైగర్ నాగేశ్వరరావు..!

స్టువర్ట్‌పురం గజదొంగ, తెలుగు రాబిన్‌వుడ్‌గా పేరొందిన 'టైగర్' నాగేశ్వరరావు జీవిత కథతో ఓ బయోపిక్ రూపొందనుంది. ఇందులో 'టైగర్' నాగేశ్వరరావు పాత్రలో రానా నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని తెలుస్తోంది. ఈ చిత్రానికి 'కిట్టు ఉన్నాడు జాగ్రత్త' ఫేం వంశీ దర్శకత్వం వహిస్తుండగా, ఏ కె ఎంటర్‌టైన్ మెంట్స్ పతాకంపై అనిల్ సుంకర నిర్మించబోతున్నట్టు సమాచారం.



రానా

నీ ఇంటి తాళాలు అక్కర్లేదు..



విశాల్

విశాల్, సమంత జంటగా పి.ఎస్.మిత్రన్ దర్శకత్వంలో విశాల్ ఫిల్మ్ ఫ్యాక్టరీ పతాకంపై విశాల్ నిర్మిస్తున్న చిత్రం 'అభిమన్యుడు'. ఈ చిత్రంలో యాక్షన్ కింగ్ అర్జున్ ఓ డిఫరెంట్ క్యారెక్టర్‌తో అలరిస్తారు. ఈ చిత్ర టీజర్‌ను శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్ర బృందం తెలియజేస్తూ, "ఈ కాలపు దొంగకి నీ ఇంటి తాళాలు అక్కర్లేదు. నీ గురించిన ఓ చిన్న ఇన్‌ఫర్మేషన్ చాలు..' అంటూ ప్రారంభమయ్యే టీజర్‌లో సినిమా ఏ ఫార్మాట్‌లో ఉండబోతోందో, టెక్నికల్‌గా ఎలాంటి స్టాండర్డ్స్‌లో రూపొందించారు అనే విషయాలు స్పష్టంగా అర్థమవుతాయి. యువన్ శంకర్‌రాజా అద్భుతమైన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ వల్ల సినిమా ఏ రేంజ్‌లో ఉంటుందనేది టీజర్‌లోనే అర్థమవుతుంది. విశాల్ న్యూ లుక్, యాక్షన్ సీక్వెన్స్‌లు, యాక్షన్ కింగ్ అర్జున్ డిఫరెంట్ లుక్, సమంత గ్లామర్ సినిమాపై ఆసక్తిని పెంచుతున్నాయి. విశాల్ కెరీర్‌లో మరో సూపర్‌హిట్ సినిమాగా ఇది నిలుస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ చిత్రాన్ని జనవరిలోనే విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు' అని తెలిపింది.

కేసరిగా అక్కీ..

అక్షయ్ కుమార్ (అక్కీ) బాలీవుడ్‌లో ఓ చిరు తుపాన్. అత్యంత వేగంగా సినిమాలు చేసే స్టార్ హీరోల్లో ఆయనదే ప్రథమ స్థానం. గతేడాది మూడు సినిమాలతో అలరించిన ఆయన ఈఏడాది వరుసగా సినిమాలు చేస్తూ బిజీగా ఉన్నారు. ఇప్పటికే మూడు సినిమాలు చిత్రీకరణ జరుపుకుంటుండగా, తాజాగా మరో నూతన చిత్రం 'కేసరి' శుక్రవారం ప్రారంభమైంది. అక్షయ్ కుమార్ ట్విట్టర్ ద్వారా 'కేసరి' ఫస్ట్‌లుక్‌ను అభిమానులతో పంచుకున్నారు. 'ఈ పోస్టర్‌ను పంచుకోవడం ఓ వైపు గర్వంగానూ మరోవైపు కృతజ్ఞతా భావం ఉంది. ఈ ఏడాది ప్రారంభమైన నా తొలి చిత్రమిది. ఈ సినిమా నాకెంతో ప్రతిష్టాత్మకమైనది. ఎంతో ప్యాషన్‌తో తెరకెక్కిస్తున్నాం. మీ ఆదరాభిమానాలు కావాలి' అని ట్వీట్‌లో పేర్కొన్నారు. ఫస్ట్‌లుక్‌లో సిక్కు దళ నాయకుడి గెటప్‌లో అక్షయ్ లుక్ ఆద్యంతం ఆకట్టుకుంటోంది. 1897 సెప్టెంబర్ 12న సిక్కులకు, బ్రిటీష్ ఇండియన్ ఆర్మీకి మధ్య జరిగిన సరగర్హి యుద్ధం నేపథ్యంలో ఈ చిత్రాన్ని కరణ్ జోహర్‌తో కలిసి అక్షయ్‌కుమార్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. అనురాగ్ సింగ్ దర్శకుడు. ఈ సినిమాను వచ్చే ఏడాది హోలీకి విడుదల చేయనున్నారు. అక్కీ ప్రస్తుతం 'ప్యాడ్‌మ్యాన్', 'మోఘల్', '2.0', 'గోల్డ్' చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు. 'ప్యాడ్‌మ్యాన్' ఈ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ నెల 26న విడుదల కానుంది. '2.0' ఏప్రిల్‌లో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.



అక్షయ్‌కుమార్

కోలీవుడ్‌లోనూ సందడి మొదలైంది









టాలీవుడ్, బాలీవుడ్‌లోనే కాదు కోలీవుడ్‌లోనూ సందడి మొదలైంది. సంక్రాంతి, గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని భారీ చిత్రాలతోపాటు భిన్న వైవిధ్య చిన్న చిత్రాలూ సందడి చేసేందుకు సిద్ధమవుతున్నాయి. సూర్య, విక్రమ్, విశాల్, ప్రభుదేవా, అరవింద స్వామి, జయంరవి వంటి తదితర హీరోల సినిమాలు ఫెస్టివల్ హాలీడేస్‌ను క్యాష్ చేసుకునేందుకు బరిలోకి దిగుతున్నాయి.

మొదటివారంలో (శుక్రవారం) ఏకంగా ఐదు సినిమాలు విడుదలయ్యాయి. **'డిసెంబర్ 13'** చిత్రానికి బువనేష్ దర్శకత్వం వహించగా, ముకేష్, ఖుషి గాద్వి, బ్రహ్మిణి మురళీ ప్రధాన పాత్రలు పోషించారు. **'ఓనాగల్ జక్కిరథై'** చిత్రానికి జేపీఆర్ దర్శకత్వం వహించగా, కబాలి విశ్వనాథ్, రిత్వికా, బేబీ అమృత ప్రధాన పాత్రల్లో నటించారు. ఇక ఆర్.సుబ్రమణ్యం దర్శకత్వంలో తెరకెక్కిన **'సావి'** చిత్రంలో ప్రకాష్ చంద్రా, సును లక్ష్మీ, నందలాల కీలక పాత్రలు పోషించారు. ఎస్.విజయ్ బాలాజీ దర్శకత్వం వహించిన **'విధి మధి ఆల్టా'** చిత్రంలో రమీజ్ రాజా, జానని ఐయ్యర్, డానియెల్ బాలాజి, కరుణాకరణ్ ప్రధాన పాత్రల్లో నటించారు. **'విన్నైథండి వంధా ఏంజెల్'** చిత్రానికి 'బాహుబలి' కె.పళని దర్శకత్వం వహించగా, హేబా పటేల్, నాగ అన్వేష్ జంటగా నటించారు. తెలుగులో విడుదలైన 'ఏంజెల్' చిత్రానికి ఇది అనువాదం. ఈ చిత్రాలన్ని ఇప్పటికే ప్రేక్షకుల ముందుకొచ్చి భవిష్యత్‌ను పరీక్షించుకుంటున్నాయి.

ఇక సంక్రాంతిని పురస్కరించుకుని ఈనెల 12న దాదాపు నాలుగు సినిమాలు పోటీ పడుతున్నాయి. అందులో ముఖ్యంగా సూర్య **'థానా సెంధ్ర కూట్టమ్'**, అరవింద్ స్వామి నటించిన **'భాస్కర్ ఓరు రాస్కెల్'** చిత్రాలున్నాయి. సూర్య, కీర్తిసురేష్ జంటగా నటించిన "థానా సెంధ్ర కూట్టమ్' చిత్రం దోపిడి నేపథ్యంలో రూపొందింది. ఈ చిత్రం **'గ్యాంగ్'** పేరుతో తెలుగులోనూ విడుదల కానుంది. అరవింద్ స్వామి హీరోగా నటిస్తున్న చిత్రం 'భాస్కర్ ఓరు రాస్కెల్'. సిద్ధిఖ్ దర్శకత్వం వహించిన ఈ కామెడీ డ్రామా చిత్రంలో అమలా పాల్ కథానాయికగా నటించారు. వీటితోపాటు సముద్రఖని, షన్ముగ పాండియన్, మీనాక్షి ప్రధాన పాత్రధారులుగా రూపొందిన యాక్షన్ డ్రామా చిత్రం **'మధుర వీరన్'** సంక్రాంతి కానుకగా రిలీజ్‌కు సిద్ధమైంది. ఈ చిత్రానికి పి.జి.ముత్తయ్య దర్శకత్వం వహించారు. దీంతోపాటు హాస్యనటుడు సంతానం హీరోగా నటిస్తున్న **'సర్వర్ సుందరం'** చిత్రం విడుదలకానుంది. కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ చిత్రంలో సంతానం సరసన వైభవి శాండిల్య కథానాయికగా నటించగా, ఆనంద్ బాల్కీ దర్శకత్వం వహించారు.

ఈ నెల 14న **'ఓరు నల్ల నాల్ పాధు సోల్రెన్', 'మన్నర్ వెగెరా', 'గులేభగావలి'** చిత్రాలున్నాయి. కళ్యాణ్ దర్శకత్వంలో ప్రభుదేవా, హన్సిక జంటగా నటించిన 'గులేభగావలి' యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కింది. ఇక 'ఓరు నల్ల నాల్ పాధు సోల్రెన్' చిత్రానికి అరుముగ కుమార్ దర్శకత్వం వహించగా, విజయ్ సేతుపతి, గౌతమ్ కార్తిక్, నిహారికా కొణిదెల హీరోహీరోయిన్లుగా నటించారు. అడ్వెంచరస్ కామెడీగా ఈ చిత్రం రూపొందింది. యాక్షన్ కామెడీగా తెరకెక్కిన 'మన్నర్ వెగెరా' చిత్రంలో విమల్, ఆనంది జంటగా నటించగా, బూపతి పాండియన్ దర్శకత్వం వహించారు.

గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ నెల 26న మూడు పెద్ద సినిమాలు **'ఇరుంబు థిరై', 'టిక్ టిక్ టిక్', 'నిమిర్'** ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. అందులో ప్రధానంగా విశాల్ నటించిన 'ఇరుంబు థిరై' ఉంది. విశాల్, సమంత జంటగా నటించిన ఈ చిత్రానికి మిత్రన్ దర్శకత్వం వహించారు. యాక్షన్ టెక్నో థ్రిల్లర్‌గా రూపొందిన ఈ సినిమా తెలుగులో 'అభిమాన్యుడు' పేరుతో రిలీజ్ కానుంది. జయం రవి హీరోగా నటిస్తున్న సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ 'టిక్ టిక్ టిక్'పై అందరిలోనూ ఆసక్తి నెలకొంది. ఈ చిత్రానికి శక్తి సుందర్ రాజన్ దర్శకత్వం వహించగా, జయంరవి సరసన నివేతా పేతురాజ్ కథానాయికగా నటించింది. ఉదయనిధి స్టాలిన్ నటిస్తున్న కామెడీ డ్రామా 'నిమిర్' కూడా ఈ నెల 26నే ప్రేక్షకులకు వినోదాన్ని పంచడానికి రాబోతుంది. ఈ సినిమాకు ప్రియదర్శన్ దర్శకత్వం వహించడం విశేషం. నమితా ప్రమోద్, పార్వతి నాయర్ కథానాయికలుగా నటిస్తున్నారు. ఇక విక్రమ్, తమన్నా జంటగా నటించిన **'స్కెచ్'** చిత్రం సైతం ఈ నెలాఖరులోనే ప్రేక్షకుల ముందుకు రావడానికి రంగం సిద్ధం చేసుకుంటోంది.















సందీప్‌కిషన్ పెద్ద మోసగాడు..



ఎస్.కె.బషీద్

సందీప్ కిషన్, లావణ్య త్రిపాఠి జంటగా తమిళంలో రూపొందిన ఓ చిత్రాన్ని ఎస్‌బికె ఫిల్మ్ కార్పొరేషన్ పతాకంపై ఎస్.కె.బషీద్ 'ప్రాజెక్ట్ జెడ్' పేరుతో తెలుగులో విడుదల చేశారు. సినిమాకు పాజిటివ్ రెస్పాన్స్ వస్తున్న నేపథ్యంలో నిర్మాత బషీద్ శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ, 'మంచి సినిమా అని మా చిత్రాన్ని అందరూ అభినందిస్తున్నారు. సినిమాకు వస్తున్న ఆదరణ చూస్తుంటే హ్యాపీగా ఉంది. అందుకు ప్రేక్షకులకు కృతజ్ఞతలు. ప్రతి సినిమాలో ఒక విలన్ ఉంటాడు. కానీ హీరో సందీప్ కిషన్ విలన్‌గా మారి ఈ సినిమాను చంపేస్తున్నాడు. ఈ సినిమా తీసుకున్న దగ్గర్నుంచి పలు రకాలుగా నాకు అడ్డపడుతున్నాడు. ఆయన చేసిన 19 సినిమాలు వరుసగా పరాజయం చెందాయి. అందుకే ఆయన పాత్రకు ఆయనతో కాకుండా వేరే వాళ్ళతో డబ్బింగ్‌లో చెప్పించా. దీంతో 'ఇందులో నా వాయిస్ లేదు, నేను ప్రమోషన్స్‌లో పాల్గొనను. సినిమా విడుదలను కూడా అడ్డుకుంటాన'ని చాలా సార్లు చెప్పాడు. అందుకే నేను లీగల్‌గా ప్రొసీడై కష్టపడి సొంత డబ్బుతో సినిమాను విడుదల చేసుకున్నా. కానీ సందీప్ నాపై పగపట్టినట్టు వ్యవహరిస్తున్నాడు. సినిమా బాగా రాలేదని నేనే మళ్ళీ రీషూట్ చేసి విడుదల చేస్తానని ప్రచారం చేస్తున్నాడు. బయ్యర్స్‌ని బెదిరిస్తున్నాడు. నన్ను బ్రదర్.. బ్రదర్ అని పిలిచి మోసం చేశాడు. తెలుగు ప్రేక్షకులు నన్ను ఆదరించడం లేదని, తెలుగు ప్రెస్‌మీట్స్‌కి రానని చెబుతున్నాడు. సందీప్ కిషన్ వంటి మోసగాడి చేతిలో ఇంకో నిర్మాత మోసపోకూడదు' అని చెప్పారు.

ఫిబ్రవరి 9న పద్మావత్ విడుదల..!

సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో దీపికా పదుకొనె ప్రధాన పాత్రలో నటించిన 'పద్మావతి' చిత్రాన్ని అనేక వివాదాలు చుట్టిముట్టిన విషయం విదితమే. అన్ని అడ్డంకులను ఎదుర్కొని ఎట్టకేలకు ఈ చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. దీపికా పదుకొనె, షాహిద్ కపూర్, రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రాన్ని గతేడాది డిసెంబర్ 1న విడుదల చేయాలని భావించారు. గుజరాత్ ఎన్నికల నేపథ్యం, కర్ణి సేనల ఆందోళనలు, హిందూ సంస్థల దాడుల అనంతరం ఈ చిత్రాన్ని వాయిదా వేశారు. టైటిల్ మార్చాలని పట్టుబట్టడంతో ఇటీవలే 'పద్మావత్'గా మార్చారు. పలు మార్పుల అనంతరం తాజాగా సెన్సార్ సర్టిఫికెట్ కూడా పొందింది. దీపికా పదుకొనె పుట్టిన రోజును (శుక్రవారం) పురస్కరించుకుని విడుదల తేదీని చిత్ర బృందం నిర్ణయించినట్టు సమాచారం. ఫిబ్రవరి 9న ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్‌కి ప్లాన్ చేశారట. దీని తర్వాత దీపికా 'సప్నాదీదీ' బయోపిక్‌లో నటించబోతున్నారు. ముంబయిలోని నాగ్‌పాడాకి చెందిన మాఫియా క్వీన్ రహీమా ఖాన్ జీవితం ఆధారంగా ఈ చిత్రం రూపొందనుంది.



దీపికా పదుకొనె

రాజ్‌భవన్‌లో రచ్చ!

- నేరెళ్ళ ఘటనలో కేసీఆర్, కేటీఆర్ పాత్ర ఏముందన్న గవర్నర్
- ఆగ్రహం వ్యక్తం చేసిన సర్వే, మల్లు రవి
- సోనియా, మన్మోహన్ దయతోనే పదవి
- మందకృష్ణ దీక్ష సరికాదన్న నరసింహన్
- గవర్నర్‌కు, కాంగ్రెస్ నేతల మధ్య వాగ్వాదం


గవర్నర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నేతలు

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

రాజ్‌భవన్‌లో రచ్చ చోటు చేసుకుంది. గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్‌కు, కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ, మాజీ ఎంపీ మల్లురవి మధ్య వాగ్వాదం చోటు చేసుకున్నట్టు తెలిసింది. ఇసుక మాఫియా ఆగడాలను అరికట్టాలని, మందకృష్ణ మాదిగను వెంటనే విడుదల చేయాలని, ఆయనపై పెట్టిన కేసులను బేషరతుగా ఎత్తివేయాలని కోరుతూ గవర్నర్‌కు శుక్రవారం రాజ్‌భవన్‌లో కాంగ్రెస్ పార్టీ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారి మధ్య మాట, మాటా పెరిగి వాదనలు చోటు చేసుకున్నాయి. ఇసుక మాఫియాకు బలైన వీఆర్ఏ సాయిలు ప్రస్తావన తీసుకురాగ ఆయన సాధారణ వ్యక్తి అంటూ గవర్నర్ కామెంట్ చేసినట్టు కాంగ్రెస్ నాయకులు మీడియాకు వివరించారు. ఇసుక మాఫియా ఆగడాలు పెచ్చరిల్లిపోతున్నాయని, నేరెళ్ళ ఘటనకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు, ఆయన కొడుకు మంత్రి కె తారకరామారావు కారణమని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. ఆ ఘటనలో వారి పాత్ర ఏముందని గవర్నర్ ప్రశ్నించడంతో నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇసుక వ్యాపారం కొత్తేమీ కాదని, గతంలోనూ జరిగినట్టే...ఇప్పుడూ జరుగుతున్నదని గవర్నర్ అనడంతో వారు మండిపడ్డారు. కేసీఆర్‌ను, కేటీఆర్‌ను ఎలా వెనకేసుకొస్తున్నారని ప్రశ్నించారు. మందకృష్ణ దీక్ష చేస్తామంటే అక్రమంగా అరెస్టు చేసినా మీరు పట్టించుకోవడంలేదని విమర్శించారు. మందకృష్ణ దీక్షకు కూర్చోవడం సరైనది కాదని గవర్నర్ అనడంతో వాగ్వాదం పెరిగింది. సొంత కార్యాలయంలో కూడా దీక్ష చేసుకోవడానికి అవకాశం లేని పరిపాలనపై గవర్నర్ జోక్యం చేసుకోకుండా కేసీఆర్, కేటీఆర్‌కు వత్తాసు పలుకుతున్నారని విమర్శలు చేశారు. గవర్నర్‌లా కాకుండా టీఆర్ఎస్ నేతలా వ్యవహరిస్తు న్నారని సర్వే సత్యనారాయణ మండిపడ్డారు. మాల, మాదిగలంటే ఇంత చిన్న చూపు ఎందుకుని నిలదీశారు. సోనియాగాంధీ, మన్మోహన్‌సిం గ్ దయ వల్లే గవర్నర్ పదవి వచ్చిన విషయాన్ని మర్చిపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ప్రతిపక్ష నేత జానారెడ్డి కలుగజేసుకుని పరిస్థితిని శాంతింప చేసినట్టు పార్టీ నేతలు చెప్పారు. ఇక ముందు మిమ్ముల్ని కలిసేది లేదని వారు తేల్చి చెప్పారు. ఇదే అంశంపై రాజ్‌భవన్ వర్గాలు వివరణ ఇచ్చాయి. కాంగ్రెస్ నేతలతో సుహృద్భావ వాతావరణంలో సమావేశం జరిగిందని వెల్లడించాయి. కాంగ్రెస్ నేతలు ఇచ్చిన వినతిపత్రాన్ని పరిశీలిస్తామని గవర్నర్ హామీ ఇచ్చారని పేర్కొన్నాయి. రాజ్‌భవన్ తన గౌరవాన్ని కాపాడుకుంటూనే హుందాగా వ్యవహరిస్తుందని పేర్కొన్నాయి. ఇరు రాష్ట్రాల ప్రజల సంక్షేమాన్ని గవర్నర్ కాంక్షిస్తున్నారని రాజ్‌భవన్ వర్గాలు స్పష్టం చేశాయి.

ఇసుక మాఫియా ఆగడాలపై ఏసీబీతో విచారణ జరిపించాలి

రాష్ట్రంలో ఇసుక మాఫియా ఆగడాలు పెచ్చరిల్లి అమాయకుల ప్రాణాలు బలిగొట్టున్నాయని టీపీసీసీ బృందం పేర్కొంది. ఇసుక మాఫియాపై ఏసీబీతో సమగ్ర విచారణ జరిపించాలని కోరింది. కామారెడ్డి జిల్లాలో జరిగిన ఘోరం కారేంగావ్‌లో కాకివాగు నుంచి అక్రమ ఇసుక రవాణాను అడ్డుకుంటున్నారనే ఆక్రోశంతో ఇసుక మాఫియా ఏకంగా వీఆర్ఏ సాయిలును ట్రాక్టర్‌తో తొక్కించి హత్య చేసిందని పేర్కొంది. ఈమేరకు శుక్రవారం రాజ్‌భవన్‌లో టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ నేతలు గవర్నర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. సాయిలు మృతికి కారణమైన ఇసుక కాంట్రాక్టరుపై హత్య కేసు(ఐపీసీ సెక్షన్ 302 ప్రకారం) నమోదు చేసి దర్యాప్తు చేయాలని కోరారు. చనిపోయిన సాయిలు కుటుంబానికి రూ 25 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలన్నారు. గతంలో నేరెళ్ళ ఇసుక మాఫియా ఆగడాలకు బలైన బాధితులకు న్యాయం చేయాలని, ఇసుక విధానంపై నిపుణులు, అఖిలపక్ష నేతలతో పున:సమీక్ష జరిపి, సరైన విధానం రూపొందించాలని కోరారు. మందకృష్ణ మాదిగను అక్రమంగా అరెస్టు చేశారని, వెంటనే ఆయన విడుదల చేయాలని, ఆయనపై పెట్టిన కేసులను బేషరతుగా ఎత్తివేయాలని కోరుతూ మరో వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మండలిలో ప్రతిపక్ష నేత షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు డికె అరుణ, సంపత్‌కుమార్, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నేరెళ్ళ శారద, నాగయ్య, ప్రేమ్‌లాల్, అంజన్‌కుమార్ యాదవ్, దాసోజు శ్రవణ్, వినోద్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పెట్రోల్ పోసి కాల్చేస్తా

- రజకున్ని తీవ్రస్వరంతో దూషించిన టీఆర్ఎస్ నాయకుడు అశోక్‌రెడ్డి
- మా ముందే మాట్లాడ్తవా అంటూ బూతుపురాణం
- మరో భరత్‌రెడ్డిగా మీడియాలో కామెంట్లు



నవతెలంగాణ–బోధన్ రూరల్

రాష్ట్రంలో బడుగు బలహీనవర్గాలపై టీఆర్ఎస్ నాయకుల బెదిరింపులు నిత్యకృత్యంగా మారాయి. అందుకు నిజామాబాద్ జిల్లా కేరాఫ్‌గా నిలుస్తోంది. రెండు నెలల కింద ఓ ఎమ్మెల్యే బూతుపురాణం.. ఇటీవలే భరత్‌రెడ్డి ఉదంతం.. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన విషయం విదితమే. ఈ నేపథ్యంలోనే బోధన్ పట్టణంలో మరో భరత్‌రెడ్డి అంటూ శుక్రవారం సాయంత్రం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టిన వాయిస్ రికార్డు పుటేజీ కలకలం రేపుతోంది. స్థానిక టీఆర్ఎస్ నాయకుడు హనుమాన్ మందిరం చైర్మెన్ గుమ్మల అశోక్‌రెడ్డి ఓ రజక సామాజిక తరగతికి చెందిన వ్యక్తిని రాయడానికి వీలులేని భాషలో బూతులు తిడుతున్న వాయిస్ వైరల్ అయింది. 'పెట్రోల్ పోసి కాల్చేస్తా.. మహారాష్ట్ర నుంచి బతకవచ్చిన లం.....కొడకా' అంటూ దూషణకు దిగాడు. 'ఈ ఊరికే మేమే వతన్‌దార్లం, నేనేం చెప్పినా వినాలి' అంటూ బెదిరింపులకు దిగాడు. పక్కన ఉన్నవారు వద్దని వారించినా వినకపోవడం సదరు పెత్తాందారుని తలబిరుసుదనానికి నిదర్శనం. అయితే అశోక్‌రెడ్డి దూషిస్తున్న సందర్భంలో రికార్డు అయిన ఈ వాయిస్ ప్రస్తుతం సోషల్ మీడియాకు చేరడంతో బలహీనవర్గాలపై పెత్తందారుల ఆధిపత్యం ఏ విధంగా చెలామణి అవుతుందో స్పష్టమౌతోంది. నోటికొచ్చినట్టు దూషించిన అశోక్ రెడ్డి స్థానిక ఎమ్మెల్యేకు అనుచరుడు కావడం గమనార్హం. ఈ ఘటనపై విచారణ జరపాల్సిందిగా సామాజిక వేత్తలు డిమాండ్ చేస్తున్నారు.

ప్రాక్టికల్స్‌కు డబ్బులివ్వొద్దు

- యాజమాన్యాలు అడిగితే ఫిర్యాదు చేయండి
- విద్యార్థులు, తల్లిదండ్రులకు ఇంటర్ బోర్డు సూచన

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్స్ నిర్వహణకు అదనంగా డబ్బులివ్వొద్దని ఇంటర్ బోర్డు కోరింది. కాలేజీ యాజమాన్యాలు అదనంగా డబ్బులడిగితే ఫిర్యాదు చేయాలని సూచించింది. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి ఎ అశోక్ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వచ్చేనెల 1వ తేదీ నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రారంభమవుతున్న విషయం తెలిసిందే. ప్రాక్టికల్స్ కోసం డబ్బులడుగుతున్నట్టు విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి ఫోన్ ద్వారా, మెయిల్ ద్వారా కాలేజీ యాజమాన్యాలపై ఫిర్యాదులొస్తున్నాయని తెలిపారు. మంచి మార్కులు రావాలంటే ఎక్కువ డబ్బు ఇవ్వాలని బలవంతం చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. కాలేజీలకు ప్రత్యేకంగా ప్రాక్టికల్స్ కోసం డబ్బులివ్వొద్దని కోరారు. యాజమాన్యాలు బలవంతంగా అడిగితే జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి (డీఐఈవో)లకు ఫిర్యాదు చేయాలని సూచించారు. తెలంగాణ ఇంటర్ బోర్డులో ఉన్న హెల్ప్‌డెస్క్ 040 246001100కు ఫోన్ చేయాలని కోరారు. డబ్బులు వసూలు చేస్తే ఆయా కాలేజీ యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వేరుశనగ రైతుల రాస్తారోకో

- గిట్టుబాటు ధర ఇవ్వాలని డిమాండ్
- మద్దతు తెలిపిన సీపీఐ(ఎం), కాంగ్రెస్
- పరిస్థితి ఉద్రిక్తం,
- తోపులాటలో పడిపోయిన ఎమ్మెల్యే చిన్నారెడ్డి
- పలువురు అరెస్ట్



నవతెలంగాణ – పాన్‌గల్

వేరుశనగ పంటకు మద్దతు ధర కల్పించాలని వనపర్తిలో శుక్రవారం రైతులు చేపట్టిన రాస్తారోకో ఉద్రిక్తతకు దారితీసింది. అధికారులతో రైతులు వాగ్వివాదానికి దిగారు. పోలీసులు చెదరగొట్టే సమయంలో తోపులాట జరిగి ఎమ్మెల్యే చిన్నారెడ్డి స్పృహ తప్పి పడిపోయారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి... వనపర్తి జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డు ఎదుట మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు అధిక సంఖ్యలో రైతులు ఆందోళన నిర్వహించారు. వీరికి వనపర్తి ఎమ్మెల్యే చిన్నారెడ్డి, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎమ్‌డి.జబ్బార్, రైతు సంఘం, టీమాస్ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకుందామని మార్కెట్‌కు తీసుకొస్తే మోసం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం రూ.4200 మద్దతు ధర ప్రకటిస్తే.. మార్కెట్‌లో మాత్రం రూ.2500కు తక్కువగానే కొనుగోలు చేస్తున్నారన్నారు. దీంతోపాటు ప్రభుత్వం కమీషన్, ఇతర ఖర్చుల కింద రైతుల నుంచి క్వింటాకు 1.75 పైసలు తీసుకోవాలని నిర్ణయిస్తే మార్కెట్లో 3.5 పైసలు తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్య పరిష్కరించే వరకు కదిలేది లేదని భీష్మించారు. వనపర్తి సీఐ వెంకటేశ్వర్లు, కొత్తకోట సీఐ సోంనారాయణసింగ్, వనపర్తిటౌన్ ఎస్ఐ నాగశేఖర్‌రెడ్డి తమ సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. రైతులతో మాట్లాడి రాస్తారోకో విరమింపజేయడానికి యత్నించారు. కలెక్టర్, ఏడీ రావాలంటూ రైతులు నినాదాలు చేశారు. వనపర్తి ఆర్డీఓ చంద్రారెడ్డి, మార్కెటింగ్ ఏడీ స్వరణ్‌సింగ్ ఘటనాస్థలానికి వచ్చి రూ.2000 నుంచి రూ.3000 వరకు మద్దతు ధర కల్పిస్తామని చెప్పారు. అయితే, కనీస మద్దతు ధర రూ.5000 పైబడే ఉండాలని రైతులు వారితో వాగ్వివాదానికి దిగారు. ఈ క్రమంలో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దాంతో పోలీసులు రైతులు, నాయకులను చెదరగొట్టేందుకు యత్నించారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎమ్‌డి.జబ్బార్, టీమాస్ జిల్లా కన్వీనర్ దేవేందర్‌ను అరెస్టు చేశారు. ఎమ్మెల్యే చిన్నారెడ్డిని పోలీస్ వాహనంలోకి ఎక్కిస్తుండగా కార్యకర్తలు, రైతులు వాహనాన్ని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన తోపులాటలో ఎమ్మెల్యే స్పృహ తప్పి పడిపోయారు. చివరికి మార్కెటింగ్ ఏడీ స్వరణ్‌సింగ్, ఆర్డీఓ చంద్రారెడ్డి రూ.4500 నుంచి ఆపైన మద్దతు ధర కల్పించే విధంగా చూస్తామని హామీనివ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) వనపర్తి పట్టణ కార్యదర్శి గోపాలకృష్ణ, కాంగ్రెస్ నాయకులు ధనలక్ష్మి, కిరణ్‌కుమార్, టీమాస్ కన్వీనర్ దేవేందర్, రైతులు పాల్గొన్నారు.

పథకాల అమలు చేతకాకనే కులాల చిచ్చు

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్


శంషాబాద్‌లో ..

వృత్తిదారుల సంక్షేమానికి ప్రవేశపెట్టిన పథకాలను అమలు చేయకుండ రాష్ట్ర ప్రభుత్వం కులాల మధ్య చిచ్చు పెడుతున్నదని వక్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజనుల కోసం రిజర్వేషన్లు ప్రకటించి ఆదివాసి, లంబాడాలు, గొల్ల, కురుమల కోసం గొర్రెల పంపిణీ ప్రకటించి గొల్ల, కురుమలు, చేప పిల్లల సరఫరా చేపట్టి గంగపుత్రులు, ముదిరాజ్ కులాల మధ్య తగాదాలు పెట్టిందని విమర్శించారు. సర్కారు ఉచ్చులో పడకుండా ఐక్యంగా ఉండి హక్కుల సాధన కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. . చేపలకు మద్దతు ధర కల్పించి, చేపల పోషకాహార విలువలను ప్రభుత్వమే విస్తృతంగా ప్రచారం చేయాలని విజ్ఞప్తి చేశారు. చేపల కొనుగోలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రతి మండల కేంద్రంలో అధునాతన చేపల మార్కెట్లను ఏర్పాటు చేసి మార్కెట్ నిర్వహణ బాధ్యతను మత్స్య సొసైటీలకే అప్పగించాలని కోరారు. మత్స్యకారుల జనాభా ప్రకారం బడ్జెట్‌లో నిధులు కేటాయించి, మత్స్యకారుల అభివృద్ధి సంక్షేమానికి ఖర్చు చేయాలన్నారు. మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం రెండో మహాసభ సందర్భగా శుక్రవారం శంషాబాద్‌లో సంఘం రాష్ట్ర అధ్యక్షులు కుమారస్వామి అధ్యక్షతన మత్సకారుల మహాగర్జన జరిగింది. ఈ గర్జనలో బీసీ సబ్‌ప్లాన్ సాధన కమిటీ చైర్మెన్ ప్రొఫెసర్ మురళీమనోహర్, టీమాస్ స్టీరింగ్ కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, మత్స్యసహకార సంఘాల సమాఖ్య మాజీ చైర్మెన్ చేత ధర్మయ్య, టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి అందెబాబయ్య, శంషాబాద్ ఎంపీపీ చెక్కుల ఎల్లయ్య, రాజేంద్రనగర్ ఎంపీపీ తలారి మల్లయ్య, టీఎంకెఎంకెఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ, హైదరాబాద్ జిల్లా మత్స్యకారుల సంఘం అధ్యక్షురాలు కొప్పు పద్మ, ఆహ్వాన సంఘం అధ్యక్షులు యాటకారి సిద్ధేశ్వర్, టీఎంఎంకెఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమోని శంకర్, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కూరపాటి రమేష్ తదితర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మురళీమనోహర్ మాట్లాడుతూ సమాజ సంపదను సృష్టించే వృత్తులన్నీ విధ్వంసమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధానంగా వృత్తిదారులు, కులాల మధ్య సర్కారు చిచ్చు పెడుతూ వారి అభివృద్ధిని అడ్డుకుంటున్నదని విమర్శించారు. గ్రామాల్లోని చెరువులు, కుంటల మీద మత్స్యకారులకే హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ ముదిరాజ్‌లు, గంగపుత్రులు ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలని సూచించారు. సామాజిక న్యాయం లభిస్తుందన్న ఆశతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో అణచివేత, కులాల మధ్య గొడవలు పెట్టి సర్కారు చోద్యం చూస్తున్నదని విమర్శించారు. గంగపుత్రులు, ముదిరాజ్‌లు, గొల్ల, కురుమలు, ఆదివాసిలు, లంబాడాల మధ్య తగవు పెట్టిందన్నారు. చేత ధర్మయ్య మాట్లాడుతూ మన మధ్య సర్కారు పెడుతున్న చిచ్చును తిప్పి కొట్టాలన్నారు. గంగపత్రులు, ముదిరాజ్‌లు ఐక్యంగా ఉండి హక్కుల సాధన కోసం పోరాటాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఎన్‌సీడీసీ నుంచి మత్స్యకార సంఘాలకు రుణాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. కుమారస్వామి మాట్లాడుతూ మత్స్యకారులకు నాణ్యత లేని చేప పిల్లలను సరఫరా చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. చేపల విక్రయాల కోసం అధునాతన మార్కెట్ యార్డులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లెల్లెల బాలకృష్ణ మాట్లాడుతూ కులాల పునాదుల మీద ముందుకు వెళ్లలేమని, వృత్తిదారులంతా విద్య, ఉద్యోగాలు, రాజకీయాలపై పట్టు సాధించాలని సూచించారు. రాజ్యాధికారంలో వాటా పొందినప్పుడే మనం అభివృద్ధి చెందుతామన్నారు. మిషన్ కాకతీయలో మత్స్యకారులను భాగస్వాములను చేయాలని డిమాండ్ చేశారు.

మొదటి దశ భూ ప్రక్షాళన పూర్తి



నవతెలంగాణబ్యూరో– హైదరాబాద్

రాష్ట్రంలో మొదటి దశ భూ రికార్డుల ప్రక్షాళన పూర్తయింది. తెలంగాణలో మొత్తం 71,75,096 వ్యవసాయ ఖాతాలున్నట్లు ప్రభుత్వం తేల్చింది. వ్యవసాయానికి యోగ్యమైన భూమి 1,42,12,826.17 ఎకరాలున్నట్టు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. రాష్ట్రంలో భూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసిన డైరెక్టర్ వాకాటి కరుణ, రెవెన్యూ అధికారులు, జిల్లాల కలెక్టర్లు, ఇతర సిబ్బందికి సీఎం శుభాకాంక్షలు తెలిపారు. వీలైనంత తొందరలో రైతులకు కొత్త పాస్ పుస్తకాలు అందివ్వనున్నట్టు వెల్లడించారు. ఇప్పటి నుంచి భూముల క్రయ, విక్రయాలు జరిగిన వెంటనే ఆ వివరాలు రాష్ట్ర అధికారుల వద్ద కూడా నమోదు కావాలని చెప్పారు. భూముల మ్యుటేషన్ అధికారం కూడా ఎమ్మార్వోలకే అప్పగిస్తున్నామనీ, ఇక ఆర్డీవోల దగ్గరికి వెళ్లాల్సిన అవసరం లేదనీ చెప్పారు. వ్యవసాయం, రికార్డుల ప్రక్షాళన, పెట్టుబడి పథకం, తదితర అంశాలపై ముఖ్యమంత్రి కేసీఆర్ శుక్రవారం ప్రగతిభవన్‌లో మంత్రులు, అధికారులతో సమీక్షించారు. "రాష్ట్రంలో 70 శాతం మంది వ్యవసాయం మీదే ఆధారపడి బతుకుతున్నారు. ఆర్థిక వేత్తలు ఏమి చెప్పినా ఎక్కువ మంది ఆధారపడిన ప్రధాన రంగం వ్యవసాయమే. ప్రభుత్వం తీసుకున్న అనేక చర్యల వల్ల రైతులకు మేలు జరుగుతున్నది. అంతిమంగా రైతులు పండించిన పంటకు మంచి ధర రావాలి. ఇది ఇప్పుడు ప్రభుత్వం ముందున్న లక్ష్యం. రైతులు పండించిన అన్ని పంటలకు కనీస మద్దతు ధర వచ్చే విధంగా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుంది. వరి, మక్కల లాంటి దిగుబడులకు ప్రస్తుతం కనీస మద్దతు ధర లభిస్తున్నది. పత్తి లాంటి ఇతర పంటలకు మద్దతు ధర విషయంలో అనిశ్చితి నెలకొంటున్నది. అంతర్జాతీయ మార్కెట్లు, కేంద్ర ప్రభుత్వ విధానాలు ప్రభావం చూపుతున్నాయి. సిసిఐ లాంటి సంస్థలు కొనుగోలు చేస్తున్నపటికీ కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ పరిస్థితిని నివారించే వ్యూహం రూపొందించాలి. రైతు సమన్వయ సమితిల ద్వారా ప్రభుత్వమే నేరుగా రైతుల నుంచి పంటలను కొనగోలు చేసి, తిరిగి అమ్మాలి. ఇలా చేయడం వల్ల ఏమైనా నష్టం వస్తే కూడా ప్రభుత్వమే భరించాలి" అని సీఎం అన్నారు.

హరీశ్ నాయకత్వంలో మద్దతుధరలపై అధ్యయనం

రాష్ట్రంలో పండిన ప్రతీ పంట మార్కెట్ నెట్ లోకి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సీఎం పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాల్లో వివిధ పంటలకు మద్దతు ధర ఇచ్చే విషయంలో ఎలాంటి విధానం పాటిస్తున్నారో అధ్యయనం చేయడానికి అధికారులు మహారాష్ట్ర, కర్నాటక లాంటి రాష్ట్రాల్లో పర్యటించాలని సూచించారు. మార్కెటింగ్ శాఖ మంత్రి హరీశ్‌రావు నాయకత్వంలో అధికారుల బందం దేశ వ్యాప్తంగా మద్దతు ధరలకు సంబంధించిన విధానాలను అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలన్నారు. రైతులను ఆదుకోవడానికీ, అవసరమైన చర్యలు తీసుకోవడానికీ నిధుల కొరత లేదని సీఎం తెలిపారు.

ఈ ఏడాది వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్

ఈ ఏడాది నుంచి వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ ప్రవేశ పెడతామని సీఎం కేసీఆర్ ప్రకటించారు. రైతులకు పెట్టుబడిగా అందించే నిధులతో పాటు, మద్దతు అందించడం కోసం కొంత నిధిని కూడా బడ్జెట్లో కేటాయిస్తామని చెప్పారు. వ్యవసాయాన్ని అభివద్ధి చేయడానికయ్యే ఖర్చును ముందే అంచనా వేసి, బడ్జెట్లో పొందుపరుస్తామని, దీనివల్ల నిధుల సమస్య రాదన్నారు.

మే 15 నాటికి రైతులకు రూ.4వేలు

రైతులకు వ్యవసాయ పెట్టుబడి మద్దతు పథకం ఈ ఏడాది నుంచే అమలవుతుందని ముఖ్యమంత్రి ప్రకటించారు. మే 15 నాటికి ఎకరానికి 4వేల చొప్పున పెట్టుబడి రైతులకు అందిస్తామన్నారు. వ్యవసాయ పెట్టుబడి మద్దతు పథకాన్ని ఎలా అమలు చేయాలి? రైతులకు డబ్బులు నేరుగా అందివ్వాలా? బ్యాంకుల ద్వారా అందివ్వాలా? సాగు చేస్తున్న భూములను గుర్తించడం ఎలా? ఏ ప్రాతిపదికన పెట్టుబడి అందించాలి? తదితర అంశాలను అధ్యయనం చేయడానికి వ్యవసాయం శాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించారు. ఈ కమిటీలో మంత్రులు ఈటల రాజేందర్, టి.హరీశ్‌రావు, తుమ్మల నాగేశ్వరరావు, జగదీశ్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి సభ్యులుగా ఉంటారు.

మంత్రులు,అధికారులకు ప్రశంసలు

రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు అందించే విషయంలో వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి, ముఖ్య కార్యదర్శి పార్థసారథి నాయకత్వంలోని అధికారులు విశేష కషి చేశారని ముఖ్యమంత్రి అభినందించారు. పాలమూరు పెండింగ్ ప్రాజెక్టులతో పాటు పాలమూరు–రంగారెడ్డి, కాళేశ్వరం, సీతారామ, దేవాదుల ప్రాజెక్టుల పనులను శరవేగంగా పూర్తి చేయడానికి కషి చేస్తున్న నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు, అధికారులను సీఎం ప్రశంసించారు. రాష్ట్రంలో విద్యుత్ రంగంలో అత్యుత్తమ సేవలందించి కేంద్ర ప్రభుత్వం ద్వారా సిబిఐపి అవార్డు అందుకున్న జెన్ కో, ట్రాన్స్ కో సిఎండి ప్రభాకర్ రావును కూడా అభినందించారు. కల్తీ విత్తనాలను అరికట్టడంలో గత ఏడాది ఎంతో కషి జరిగింది. ప్రభుత్వం పిడి యాక్టు కూడా తెచ్చింది. ఈ ఏడాది కూడా ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి అధికారులను కోరారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, సలహాదారు అనురాగ్ శర్మ, జెన్ కో, ట్రాన్స్ కో సిఎండి డి.ప్రభాకర్‌రావు, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సి.పార్థసారథి. సిసిఎల్ఎ డైరెక్టర్ వాకాటి కరుణ, సిఎంఓ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

'ఆధార్' కు భద్రత లేదు..

మొదటిపేజీ తరువాయి

నిర్వహించిన ఓ స్టింగ్ ఆపరేషన్‌లో ఆధార్ నెంబర్‌ను తెలుసుకోవడం సులువైన విషయమని తేలింది. వాట్సాప్ ద్వారా కేవలం రూ.500 చెల్లిస్తే, ఆధార్ డేటా వచ్చేస్తుందని ఆ పత్రిక తన కథనంలో పేర్కొన్నది. దీన్ని యూఐడీఏఐ ఖండించింది. సామాన్యుడి దగ్గర నుంచీ...సుప్రీంకోర్టు వరకూ 'ఆధార్' అమలు చట్టబద్ధంగా లేదని, పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛకు భంగకరమని చెప్పినా బీజేపీ నేతృత్వంలోని మోడీ సర్కార్ వినిపించుకునే పరిస్థితి కనపడటం లేదు. ఈ నేపథ్యంలో 'ఆధార్' సమాచార భద్రతపై అనేక వర్గాల నుంచి ఆందోళన వ్యక్తమవుతున్నది.

మరింతగా బొగ్గు ఉత్పత్తి

- కొత్త ప్రాజెక్టు ప్రారంభానికి సన్నాహాలు : ఏరియా జనరల్ మేనేజర్ల సమీక్షలో ఎన్.శ్రీధర్

నవతెలంగాణబ్యూరో– హైదరాబాద్


పెరిగిన రాష్ట్ర విద్యుత్ అవసరాలను దష్టిలో ఉంచుకొని, ఈ ఆర్థిక సంవత్సరంలో ఇంకా మిగిలిఉన్న 3 నెలల కాలంలో లక్ష్యాల మేర బొగ్గు ఉత్పత్తి, రవాణా చేయడానికి సర్వసన్నద్ధం కావాలని సింగరేణి సీఎమ్‌డి ఎన్.శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా సంస్థలోని 11 ఏరియా జనరల్ మేనేజర్లకు ఆయన ఆదేశాలు జారీ చేశారు. రానున్న మూడేండ్లలో ప్రారంభం చేయాల్సిన కొత్త గనులపై ఏరియా వారీగా హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో శుక్రవారం శ్రీధర్ ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. మిగిలిన 3 నెలల కాలంలో రోజుకి 2.10 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా జరిపి నిర్దేశిత వార్షిక లక్ష్యాలను సాధించాలని, తద్వారా పెరిగిన రాష్ట్ర విద్యుత్ అవసరాలకు తగినంత బొగ్గు అందించాలని కోరారు. డిసెంబర్‌తో ముగిసిన 9 నెలల్లో 420 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేశామనీ, మార్చి నాటికి మిగిలిన 90 రోజుల్లో మరో 200 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి జరగాలని ఆయన నిర్దేశించారు. కొత్త గనుల ప్రారంభానికి సంసిద్ధంగా ఉండాలని, సంబంధిత పనులను కాల పరిమితికి లోబడి పూర్తి చేయాలని ఆదేశించారు. ఒడిస్సా రాష్ట్రంలోని నైనీ బొగ్గు గని ప్రారంభానికి సంబంధించిన ఏర్పాట్లపై కూడా నైనీ బ్లాకు జీఎం విజయరావుకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో భాస్కర్‌రావు చంద్రశేఖర్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

భూ సేకరణపై సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పు రద్దు

నవతెలంగాణ–హైదరాబాద్

భూసేకరణ చట్టం కింద ఎకరాకు రూ.85 వేలు, అదే భూసేకరణలో రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఇచ్చిన భూమి ఎకరాకు రూ. 6లక్షలు చెల్లించడం అన్యాయమని సింగిల్ జడ్జి గతంలో వెలువరించిన ఉత్తర్వులను శుక్రవారం హైకోర్టు డివిజన్ బెంచ్ రద్దు చేసింది. తమకు తాముగా ముందుకు వచ్చిన రైతులకు పరిహారంగా చెల్లించిన రూ.6 లక్షలను మార్కెట్ విలువగా నిర్ణయించినట్టుగా సింగిల్ జడ్జి ఉత్తర్వులు ఉన్నాయని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి శ్యాంప్రసాద్‌లతో కూడిన డివిజన్ బెంచ్ జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వుల్లో పేర్కొంది. స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన రైతులకు రూ.6 లక్షలు, భూసేకరణలో రైతులకు రూ.85 వేలు చెల్లించడం రాజ్యాంగ వ్యతిరేకమని సింగిల్ జడ్జి ఉత్తర్వుల అమలును బెంచ్ రద్దు చేసింది. మార్కెట్ ధరను ప్రభుత్వం నిర్ణయిస్తుందేగానీ కోర్టులు కాదని బెంచ్ స్పష్టం చేసింది. సిద్దిపేట జిల్లా కలెక్టర్ భూముల మార్కెట్ విలువల సవరణకు ఇచ్చిన ఉత్తర్వుల అమలును నిలిపివేస్తూ సింగిల్ జడ్జి ఉత్తర్వుల్లో జోక్యం చేసుకునేందుకు బెంచ్ నిరాకరించింది. కలెక్టర్ భూముల ధరల ఉత్తర్వులను సిద్దిపేటకు చెందిన నర్సింహారెడ్డి ఇతరులు సవాల్ చేసిన కేసులో హైకోర్టు పైవిధంగా మధ్యంతర ఆదేశాలిస్తూ స్టే రద్దుకు తిరిగి సింగిల్ జడ్జి దగ్గరకు వెళ్లాలని బెంచ్ స్పష్టం చేసింది.

లెక్క తప్పింది..



న్యూఢిల్లీ: మోడీ సర్కారు దూకుడుగా తీసుకున్న నిర్ణయాలు దేశ ఆర్థిక వ్యవస్థను కోలుకోలేని విధంగా దెబ్బతీస్తాయని ప్రతిపక్షా లు,నోబెల్ అవార్డు గ్రహీతలు చెప్పినా కేంద్ర పాలకు లు వినలేదు.కానీ ఇప్పుడు ప్రభుత్వ సంస్థలూ సైతం కేంద్రంలోని బీజేపీ సర్కారు తొందరపాటు కారణంగా నోట్ల రద్దు,జీఎస్టీ దేశాభివృద్ధిని దెబ్బతీస్తుందన్న కఠోరవాస్తవాలు వెలుగుచూస్తు న్నాయి. ఇటీవల కేంద్ర ప్రభుత్వ సంస్థ లేబర్ బ్యూరో,తాజాగా కేంద్ర గణాంక సంస్థ మోడీ ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలతో దేశ ప్రగతి ముందడుగు వేయటం కాదు..నాలుగేండ్ల కనిష్టానికి దిగజారిందని వెల్లడించింది.వీటితో పాటు తలసరి ఆదాయం కూడా గణనీయంగా తగ్గిపోవటం గమనార్హం..వివరాలు ఇలా..

ఈ ఏడాది మార్చితో ముగియనున్న 2017–18 ఆర్థిక సంవత్సరానికి స్థూల దేశీయ ఉత్పత్తి(జీడీపీ) వృద్ధిరేట్‌ను 6.5 శాతంగా కేంద్ర గణాంక కార్యాలయం(సీఎస్‌వో) అంచనా వేసింది. 2017–18 సంవత్సరానికి జీడీపీని (2011–12 స్థిర ధరల ప్రకారం)రూ.129.85 లక్షల కోట్లుగా సీఎస్‌వో అంచనా వేసింది. స్థూల విలువ చేర్పు(జీవీఏ)ను 6.1 శాతంగా సీఎస్‌వో లెక్క కట్టింది. జీడీపీ నుంచి నికర పన్నులను తీసివేయగా మిగిలేదే జీవీఏ. రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) అంచనా కన్నా ఇది తక్కువ. జీవీఏను ఆర్‌బీఐ 6.7 శాతంగా అంచనా వేసింది. ప్రయివేట్ ఆర్థికవేత్తలు జీవీఏను 6.2 నుంచి 6.5 శాతం వరకూ అంచనా వేశారు. గతేడాది(2016–17) జీడీపీ వృద్ధి రేట్ 7.1 శాతం కాగా, జీవీఏ 6.6 శాతంగా నమోదైంది. ఈ ఏడాది వృద్ధిరేట్ నాలుగేండ్ల కనిష్టానికి పడిపోనున్నట్టు సీఎస్‌వో అంచనాలో స్పష్టమైంది. నాలుగేండ్ల క్రితం(2014లో) ప్రధాని మోడీ నేతృత్వంలో ఎన్‌డీఏ ప్రభుత్వం కేంద్రంలో అధికారం చేపట్టిన విషయం తెలిసిందే. 2014–15లో జీడీపీ వృద్ధిరేట్ 7.5 శాతంగా, 2015–16లో 8 శాతంగా నమోదైంది.

2018–19 సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టనుండగా సీఎస్‌వో అంచనాలు కీలకం కానున్నాయి. ఆర్థిక మంత్రిత్వశాఖ బడ్జెట్ అంచనాలను సిద్ధం చేయాల్సి ఉన్నది. నోట్ల రద్దు, జీఎస్టీ అమలు తర్వాత ఆర్థిక ఏడాది పూర్తి కాలానికి వెల్లడైన మొదటి అంచనా ఇది. ఈ ఏడాది మొదటి త్రైమాసికం(ఏప్రిల్–జూన్)లో జీడీపీ వృద్ధిరేట్ 5.7 శాతానికి పడిపోయింది. ఇది మూడేండ్ల కనిష్టం కావడం గమనార్హం. ఆ తర్వాతి త్రైమాసికం(జులై–సెప్టెంబర్)లో వృద్ధిరేట్ 6.3 శాతంగా నమోదైంది.

వ్యవసాయం, తయారీ రంగంలో వృద్ధిరేట్ తగ్గడం వల్లే మొత్తంమీద ప్రభావం చూపినట్టు భావిస్తున్నారు. వ్యవసాయం, అడవులు, చేపల రంగంలో ఈ ఏడాది వృద్ధిరేట్ 2.1 శాతానికే పరిమితం కానున్నది. ఇది గతేడాది(2016–17)లో 4.9 శాతంగా నమోదు కావడం గమనార్హం. ఈ ఏడాది తయారీ రంగంలో వృద్ధిరేట్ 4.6 శాతానికే పరిమితం కానుండగా, గతేడాది 7.9 శాతంగా నమోదైంది.

మైనింగ్ రంగంలోనూ వృద్ధిరేట్ పడిపోనున్నట్టు అంచనా. మరోవైపు జీడీపీ వృద్ధిరేట్‌లో కీలకమైన పారిశ్రామిక ఉత్పత్తి కూడా పడిపోవడం గమనార్హం. గతేడాది(ఈ ఆర్థిక సంవత్సరం) అక్టోబర్‌లో అది 2.2 శాతంగా నమోదైంది. అది మూడు నెలల కనిష్టం.

మందగించిన తలసరి ఆదాయం వృద్ధి
2017-18లో 8.3 శాతమే : సీఎస్‌వో

భారత తలసరి ఆదాయం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మందగించింది. 2017–18 ఆర్థిక సంవత్సరానికి 8.3శాతంతో రూ.1,11,782కు పరిమితమైంది. అంతకు క్రితం ఏడాది భారతీయుల తలసరి ఆదాయం 9.7శాతంతో 1,03,219గా నమోదు అయ్యిందని కేంద్ర గణాంకాల కార్యాలయం (సీఎస్‌వో) వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వాస్తవ తలసరి ఆదాయం (2011–12 స్థిర ధరల్లో) రూ.86,660గా నమోదు అయ్యింది. గతేడాది అది రూ.82,269గా ఉందని తెలిపింది. ఇదే ఏడాదిలో తలసరి ఆదాయం వాస్తవిక వృద్ధి రేటును 5.3శాతంగా అంచనా వేసింది. అంతకు క్రితం ఇది 5.7శాతంగా నమోదైంది.

సెన్సెక్స్ ▲184
34,153

నిఫ్టీ ▲54
10,558

డాలరుకు రూపాయి విలువ
63.37



బంగారం(10.గ్రా)
రూ. 30,160



వెండి (కేజీ)
రూ. 41,700



కోడిగుడ్లు			
హైదరాబాద్	368	విజయవాడ	374
ఒక్కగుడ్డుకు	4.30	చెన్నై	397
వరంగల్	370	ముంబయి	410



కనీస నగదు నిల్వను తగ్గించే యోచనలో ఎస్‌బీఐ!



న్యూఢిల్లీ: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) సేవింగ్ ఖాతాల్లో కనీస నగదు నిల్వలపై పునరాలోచనలో పడిందని తెలుస్తోంది. ప్రస్తుతం మెట్రో నగరాల్లో ఈ నెలవారీ కనీస నగదు నిల్వ రూ.3000గా ఉంది. దీన్ని రూ.1000కి తగ్గించాలని భావిస్తోన్నట్టు తెలుస్తోంది. అయితే దీనిపై ఎస్‌బీఐ ఇంకా అధికారిక ప్రకటన చేయలేదు. తొలుత మెట్రో నగరాల్లో రూ.5000 కనీస నిల్వలు ఉండాలని నిర్ణయించినప్పటికీ, దీనిపై ఖాతాదారుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో రూ.3000కు కుదించింది. చిన్న పట్టణ ప్రాంతాల్లో రూ.2000, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1000 చొప్పున నెలవారీ నగదు నిల్వలు ఉండాలని నిర్ణయించింది. ఈ నిల్వ స్థాయిలకు తగ్గితే జరిమాన విధించనున్నట్టు హెచ్చరించింది. ఆ విధంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఎనిమిది మాసాల్లో రూ.1,771.67 కోట్ల జరిమాన వసూలు చేసింది. ఎస్‌బీఐలో మొత్తం 40.5 కోట్ల పొదుపు ఖాతాలున్నాయి. సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికంలో ఎస్‌బీఐ రూ.1,581 కోట్ల లాభాలు సాధించింది. వీటితో పోల్చితే జరిమాన విధించే మొత్తమే ఎక్కువగా ఉండటం గమనార్హం.

ఐరన్ మౌంటెన్ చేతికి ఓఈసీ రికార్డ్స్

హైదరాబాద్: రికార్డుల నిర్వహణ, ఇమేజింగ్ సేవలు, మీడియాకు చెందిన ఆఫ్‌సైట్ స్టోరేజీని అందించే ఓఈసీ రికార్డ్సు మేనేజ్‌మెంట్‌ను నిల్వ, సమాచార నిర్వహణ సేవల సంస్థ ఐరన్ మౌంటెన్ సొంతం చేసుకున్నట్టు ఆలసంస్థ ఒక ప్రక టనలో తెలిపింది. దీంతో భారత్‌లో తమ ఉనికిని విస్తరించుకున్నట్ట య్యిందని ఐరన్ మౌంటెన్ ఇండియా ఎండీ హితేష్ గుప్తా పేర్కొన్నారు. దీంతో భారత్‌లో 15 ప్రాంతాల్లో 73 సదుపాయాలతో కూడిన నెట్‌వర్క్‌కు చేరినట్టయ్యిందన్నారు. 2600 మందికి పైగా వినియోగదారులకు చెందిన రికార్డులను డెలివరీ చేయడంతో పాటుగా సమాచార నిర్వహణ, డేటా మేనేజ్‌మెంట్ అందించనున్నామన్నారు. ఈ మొత్తం విలువ 18 మిలియన్ డాలర్లుగా ఉంటుందన్నారు.

పెరిగిన పసిడి ధర..



న్యూఢిల్లీ: ఇంతక్రితం సెషన్‌లో స్వల్పంగా తగ్గిన బంగారం ధర శుక్రవారం తిరిగి పుంజుకుంది. అంతర్జాతీయ పరిణామాలకు తోడు స్థానిక వర్తకుల నుంచి పసిడికి డిమాండ్ నెలకొనడంతో న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం, 99.5 శాతం స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.135 పెరిగి వరుసగా రూ.30,500, రూ.30,350గా పలికింది. కాగా కిలో వెండిపై రూ.360 తగ్గి రూ.40వేలుగా నమోదయ్యింది.

డిజిటల్ ప్రకటనల దూకుడు..!

- రూ.7500 కోట్ల విలువ
- 2015తో పోల్చితే 40% వృద్ధి : పలు రిపోర్టుల వెల్లడి



న్యూఢిల్లీ : దేశంలో ఇంటర్నెట్ వినియోగం విరివిగా పెరిగిపోవడంతో డిజిటల్ ప్రకటనలు కూడా దూసుకు వస్తున్నాయి. గతేడాది ఈ ప్రకటనల విలువ భారీ స్థాయిలో పెరిగింది. 2017 దీపావళి పండుగ సమయం కంటే ముందు నుంచి ఆన్‌లైన్ ప్రకటనలు అనుహ్యంగా పెరిగాయని పలు రిపోర్టులు స్పష్టం చేస్తున్నాయి. డిజిటల్ ప్లాట్‌ఫాంలపై ప్రకటనలు 36 శాతం మేర పెరిగాయని ఆడ్‌బై వెంచర్స్ సహ వ్యవస్థాపకులు సౌరవ్ పట్నాయక్ తెలిపారు. ప్రస్తుత ఏడాదిలో వీటి విలువ రూ.7,500 కోట్లకు చేరనుందని డిజిటల్ ఇన్‌ఫ్యూజన్ డైరెక్టర్ నితిన్ చౌదరీ అంచనా వేశారు. దేశంలోని మొత్తం ప్రకటనల్లో 14 శాతం డిజిటల్ అడ్వర్టైజ్‌మెంట్ రంగం ఆక్రమించి ఉంది. కొత్త వినియోగదారులను ఆకర్షించడంలో ఇది కీలకంగా మారింది. గతేడాది ఈపరిశ్రమ వంద కోట్ల డాలర్ల మైలు రాయిని దాటిందని ఐఎంఆర్‌బీ కంటర్, ఇంటర్నెట్ అండ్ మొబైల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అంచనా వేసింది. భవిష్యత్తులో ఈప్రకటనలు మరింత జోరును ప్రదర్శించనున్నాయని బిజినెస్‌లైన్ ఒక కథనం ప్రచురించింది.

2016 ముగింపు నాటికి డిజిటల్ ప్రకటనల విలువ రూ.7300 కోట్లకు చేరింది. 2015 నాటి వ్యయంతో పోల్చితే 40శాతం వృద్ధి చోటు చేసుకుంది. 2017 డిసెంబర్ నెలలో అత్యధికంగా గూగుల్, మారుతి సుజుకి, అమెజాన్ ప్రైమ్ సంస్థలు డిజిటల్ ప్రకటనలకు అత్యధికంగా ఖర్చు చేశాయని పట్నాయక్ తెలిపారు. ప్రకటనలు, పబ్లిషర్స్, ఏజెన్సీలకు సంబంధించిన డేటా రిపోర్టులను యాడ్‌బై సమీకరిస్తుంది. ఈ సంస్థ బయోసైన్సెస్, ఇజ్రాయిల్ కంపెనీ టెక్నాలజీని ఉపయోగించుకుంటుంది. డెస్క్‌టాప్, మొబైల్, వీడియోస్ వేదికల్లోని ప్రకటనలను విశ్లేషిస్తుంది. గత నెలలో గూగుల్ అతి పెద్ద డిజిటల్ ప్రకటనదారుగా నిలిచింది. ఈ కంపెనీ క్లౌడ్ సేవలకు సంబంధించిన జీ సూట్‌ను ప్రచారం చేసింది. అదే విధంగా గూగుల్ రూపొందించిన ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్ పిక్సల్2ను ప్రమోట్ చేసింది. కాగా అమెజాన్ అత్యధికంగా ప్రైమ్ వీడియోస్‌కు వ్యయం చేసిందని యాడ్‌బై డాటా తెలిపింది. మారుతి సుజుకి తన డిజైర్, సెలెరియో ఎక్స్ సెడన్ కార్ల ప్రచారాన్ని ఎక్కువగా నిర్వహించింది.

ప్రకటనలకు మొబైల్ రంగం భిన్నమైన వేదికగా అవతరించింది. ఈ సెగ్మెంట్ డిజిటల్ ప్రకటనల్లో ఆస్ట్రేలియా టూరిజం అగ్రస్థానంలో నిలిచిందని యాడ్‌బై పేర్కొంది. అదే విధంగా అమెజాన్ రెండో స్థానంలో ఉంది. మూడు స్థానంలో అత్యధికంగా డ్రీమ్11, ఫాంటసీ క్రికెట్ గేమ్స్ ప్రకటనలు ఎక్కువగా వచ్చాయి. ఇతర దేశాల డిజిటల్ ప్రకటనలతో పోల్చితే అమెరికా తర్వాత భారత్ నిలిచింది. ఇమార్కెటర్స్ రిపోర్టు ప్రకారం 2018లో అమెరికాలో డిజిటల్ డిస్‌ప్లే యాడ్స్ విలువ 48 బిలియన్ డాలర్లుగా ఉంటుందని అంచనా. భారత్‌లో 2017 తొలి త్రైమాసికం వీడియో ప్రకటనల్లో 60 శాతం పెరుగుదల ఉందని ఇన్‌మొబీ రిపోర్టు పేర్కొంది. డిజిటల్ ప్రకటనల కోసం ప్రతీ రోజు 2.5 క్వింటాలియన్ బైట్ల డేటా ఖర్చు అవుతుందని అంచనా. సీఐఐ, కేపీఎంజీ రిపోర్టు ప్రకారం 2020 నాటికి భారత డిజిటల్ ప్రకటనల విలువ రూ.25వేల కోట్ల (4బిలియన్ డాలర్ల)కు చేరనుంది. డిజిటల్ ప్రకటనల్లో ఇంటర్నెట్, సోషల్ మీడియా, ప్రోగ్రమెటిక్ అడ్వర్టయిజింగ్ కీలక పాత్రను పోషించనున్నాయని విశ్లేషించింది.

ఎయిర్‌టెల్, ఐటెల్ జట్టు..

- చౌక ధరకే 4జీ స్మార్ట్‌ఫోన్



న్యూఢిలీ: జియో రాకతో టెలికం కంపెనీలు చౌక మొబైల్స్‌పై దృష్టి పెట్టాయి. ఇదే క్రమంలో శుక్రవారం ఎయిర్‌టెల్-ఐటెల్ ఒక ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఈ ఒప్పందంలో భాగంగా ఐటెల్ ఏ40, ఐటెల్ ఏ41 స్మార్ట్‌ఫోన్లపై ఎయిర్‌టెల్ మూడేండ్ల కాలానికి రూ.1,500 క్యాష్ బ్యాక్‌ను అందించనుంది. ఈ రెండు ఫోన్లకు రూ.169తో నెలవారి రీఛార్జ్ ప్యాక్ చేయించుకోవాల్సి ఉంటుందని ఎయిర్‌టెల్ ఒక ప్రకటనలో పేర్కొంది. ఐటెల్ ఏ40 ధర రూ.4,599, ఎ41 ధర రూ.4,699గా ఉంది. అయితే రూ.169తో ప్రతి నెలా రీచార్జ్ చేసుకుంటే 36 నెలల తర్వాత రూ.1,500 క్యాష్‌బ్యాక్ లభించనుంది. 18 నెలలు ముగిసేసరికి రూ.3000 విలువైన రీఛార్జ్‌లు చేసుకున్నట్టయితే రూ.500 అందించగా, ఇక మిగతా 18 నెలలు మరో రూ.3,000 సమానమైన రీఛార్జ్‌లు చేసుకుంటే రూ.1000 నగదు తిరిగి ఇవ్వనున్నట్టు తెలిపింది.

వారాంతంలో మార్కెట్ల జోరు!

- 34వేల ఎగువన సెన్సెక్స్



ముంబయి: అంతర్జాతీయ సానుకూల పరిణామాలకు తోడు ఎఫ్‌ఐఐలు తరలి రావడంతో వారాంతంలో దేశీయ స్టాక్ మార్కెట్లు నూతన రికార్డులకు చేరాయి. కన్సూమర్ డ్యూరెబుల్స్, టెక్, రియాల్టీ సూచీల కొనుగోళ్ల మద్దతుతో శుక్రవారం బీఎస్ఈ సెన్సెక్స్ 184.21 పాయింట్లు పెరిగి 34,153.85 వద్ద ముగిసింది. ఎన్ ఎస్ఈ నిఫ్టీ 54 పాయింట్లు రాణించి 10,558.85 వద్ద నమోదయ్యింది. బీఎస్ఈలో రంగాల వారిగా కన్సూమర్ డ్యూరెబుల్స్ 1.25శాతం, టెక్ 0.89 శాతం, రియాల్టీ 0.75శాతం, ఎఫ్ఎంసీజీ 0.74శాతం చొప్పున అధిక లాభాలు సాధించిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. మరోవైపు ఆయిల్ అండ్ గ్యాస్ 0.39 శాతం, పీఎస్‌యూ 0.24 శాతం చొప్పున తగ్గాయి. ఎన్సెక్స్‌లో యెస్ బ్యాంకు 5.03శాతం, అదానీ పోర్ట్స్ 3.71శాతం, భారతీ ఎయిర్‌టెల్ 3.36శాతం, ఇండస్ ఇండ్ బ్యాంకు 3.17శాతం, డాక్టర్ రెడ్డీస్ 2.4శాతం చొప్పున అధిక లాభాలు అర్జిం చిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. మరోవైపు ఓఎన్‌జీసీ 0.83శాతం, ఐసీ ఐసీఐ బ్యాంకు 0.7శాతం, ఎస్‌బీఐ 0.6శాతం, విప్రో 0.56శాతం, సన్‌ఫార్మా 0.39 శాతం చొప్పున అధిక నష్టాలు చవి చూసిన వాటిలో ముందు వరుసలో నిలిచాయి.

రుణాల రికవరీ కోసం 'ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్' వినూత్న కార్యక్రమం

హైదరాబాద్ : ఖాతాదారులు తీసుకున్న రుణాల రికవరీ కోసం వినూత్న కార్యక్రమం చేపట్టినట్టు ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ పేర్కొన్నది. నేమ్ అండ్ షేమ్ పేరిట నిర్వహించిన ఈ కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించిందని తెలిపింది. ఈ కార్యక్రమం ద్వారా అప్పుల ఎగవేతదారుల పేర్లు బహిర్గతం చేయడమే కాకుండా, వారి కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని అసిస్టెంట్ జనరల్ మేనేజర్ లచ్చయ్య తెలిపారు. ఈ కార్యక్రమాన్ని చీఫ్ జనరల్ మేనేజర్ శివకుమార్ చతుర్వేది ప్రారంభించారన్నారు. నేమ్ అండ్ షేమ్ కార్యక్రమంలో భాగంగా బ్యాంకు ఉద్యోగులు యూసఫ్‌గూడలోని మెసర్స్ టీసీఐ కన్‌స్ట్రక్షన్స్ లిమిటెడ్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సంస్థ ఎండీ ముప్పనేని వెంకటేశ్ తమ బ్యాంకు నుంచి రూ.26,45,36,036 అప్పుగా తీసుకొని చెల్లించలేదని ఏజీఎం లచ్చయ్య తెలిపారు. తక్షణమే బ్యాంకు నుంచి తీసుకున్న రుణం తిరిగి చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదర్శనగర్ బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ వి.రామమూర్తి, బషీర్‌బాగ్ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ వహీదుల్లా, ప్రాంతీయ కార్యాలయం ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌వీకె గచ్చిబౌలిలో ...

నేడు ఉర్దూ గ్రంథాలయం డిజిటలైజేషన్ కార్యక్రమం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం (ఎస్‌వికె) గచ్చిబౌలి ఆధ్వర్యంలో ఉర్దూ గ్రంథాలయం డిజిటలైజేషన్ కార్యక్రమం శనివారం జరగనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హైకోర్టు జడ్జి జస్టిస్ షమీమ్ అక్తర్, గౌరవ అతిథిగా రిటైర్డ్ ఐపీఎస్ అధికారి, ప్రభుత్వ సలహాదారులు ఎకె ఖాన్, వక్తలుగా ప్రొఫెసర్ అన్వర్ మౌజామ్, అబ్దుస్ సమద్‌ఖాన్, మాజీ ఎమ్మెల్యే, ఎస్‌వికె ట్రస్టు సభ్యులు నంద్యాల నర్సింహారెడ్డి, మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్ వినయకుమార్, ఎస్‌వికె గచ్చిబౌలి చీఫ్ అడ్మినిస్ట్రేటర్ పి ప్రభాకర్ హాజరవుతారు.

శాతవాహన వర్సిటీకి 12బి గుర్తింపు ఇవ్వండి

- యూజీసీ చైర్మెన్‌కు ఎంపీ వినోద్ బృందం వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

శాతవాహన విశ్వవిద్యాలయం (ఎస్‌యూ)కు 12బి గుర్తింపు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కరీంనగర్ ఎంపీ బి వినోద్‌కుమార్ బృందం కోరింది. ఈ మేరకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) చైర్మెన్ ప్రొఫెసర్ ధీరేంద్రపాల్ సింగ్‌ను ఎంపీ వినోద్ నేతృత్వంలో తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మెన్ తుమ్మల పాపిరెడ్డి, వైస్ చైర్మెన్ వి వెంకటరమణ, ఎస్‌యూ రిజిస్ట్రార్ కోమల్‌రెడ్డి శుక్రవారం కలిసి వినతి పత్రం సమర్పించారు. 12బి గుర్తింపు ప్రకటించి ఆ విశ్వవిద్యాలయానికి ఎక్కువ నిధులు మంజూరు చేయాలని, మరిన్ని అవకాశాలు కల్పించాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం విశ్వవిద్యాలయాల అభివృద్ధికి, నాణ్యమైన విద్య అందించేందుకు అనేక చర్యలు తీసుకుంటోందని యూజీసీ చైర్మెన్‌కు వివరించామని పేర్కొన్నారు. కరీంనగర్‌లో మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం (మనూ) ఆఫ్ క్యాంపస్ ప్రారంభించాలని కోరారు. ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రిజిస్ట్రార్ అర్చనా ముద్గల్‌ను కలిసి శాతవాహన విశ్వవిద్యాలయంలో ఫార్మాసూటికల్ కోర్సులకు అనుమతించాలని సూచించారు.

జనాల్లేని మెట్రో



- ఉదయం వేళ కోచ్‌కు 60లోపే..
- సికింద్రాబాద్ స్టేషన్ వరకు సగం ఖాళీ
- ప్రతి 15మందిలో రోజువారి ప్రయాణికులు ముగ్గురే
- ధరలు తగ్గించినా గిరాకీలేని స్మార్ట్ కార్డులు
- భారమైన మెట్రోచార్జీలు

నవతెలంగాణ- సిటీబ్యూరో

గ్రేటర్ హైదరాబాద్ ప్రజారవాణా వ్యవస్థలో సరికొత్తగా అరంగేట్రం చేసిన మెట్రో రైలు ప్రయాణంపై జనాలు ఆసక్తి చూపడం లేదు. మెట్రో రైలు ప్రారంభించిన కొత్తలో ఉన్నంత ఊపు క్రమంగా తగ్గుతోంది. ఇతర రాష్ట్రాల్లోని మెట్రో రైలు చార్జీలతో పోలిస్తే హైదరాబాద్ మెట్రో రైలు చార్జీలు ఎక్కువగా ఉండడమే ప్రధాన కారణం. స్టేషన్ల దగ్గర పార్కింగ్ సౌకర్యం లేకపోవడం మరో కారణం. నెలవారీ పాసులు లేకపోవడమూ మరో కారణంగా చెప్పొచ్చు. దీంతోపాటు ఆర్టీసీ బస్సులు, ఓలా, ఉబర్ షేరింగ్ క్యాబ్‌లు సరసమైన చార్జీలతో ఉండటం నగరవాసులను ఆకర్షిస్తున్నాయి. ఇదీ కూడా మెట్రోరైలు ఆక్యుపెన్సీ తగ్గడానికి కారణమేనని ప్రజారవాణా నిపుణులు అభిప్రాయపడుతున్నారు. హైదరాబాద్ మెట్రో రైలుపై 'నవతెలంగాణ' రెండు రోజులపాటు చేసిన పరిశీలన వివరాలు ఇలా ఉన్నాయి...

మెట్రో రైలు ప్రారంభమైన తొలిరోజు 2.10లక్షల మంది ప్రయాణం చేయగా, ఆ తర్వాత క్రమంగా మెట్రో తగ్గుతూ వస్తోంది. సెలవు రోజుల్లో సుమారు లక్ష మంది ప్రయాణం చేస్తున్నారని అధికారులు చెబుతున్నారు. కానీ సాధారణ రోజుల్లో మెట్రో రైళ్లలో జనాలు గణనీయంగా తగ్గుతున్నారు. ప్రస్తుతం నాగోల్ నుంచి అమీర్‌పేట వరకు ప్రతి 15 నిమిషాలకు ఓ మెట్రో రైలును నడుపుతుండగా, అమీర్‌పేట నుంచి మియాపూర్‌కు 8 నిమిషాలకు ఒక రైలు నడుపుతున్నారు. ఒక్కో కోచ్‌లో సుమారు 300 మందికి అవకాశముంది. ఇలా మూడు కోచ్‌లతో మెట్రో రైలు నడుస్తుంది. అంటే ఒక్కో రైలులో ఒకేసారి వెయ్యి మంది ప్రయాణించడానికి అవకాశం ఉంది.

ఉదయం కోచ్‌కు అత్యల్పమే..

మెట్రో రైలులోని కోచ్‌లో సుమారు 300 మంది ప్రయాణించడానికి అవకాశముండగా, ఇరువైపులా 46 మంది కూర్చోవడానికి వీలుంది. బుధవారం ఉదయం ఆరు గంటలకు నాగోల్ నుంచి మెట్రో రైలు ప్రారంభమైన సందర్భంలో ఉప్పల్ స్టేడియం, ఎన్‌జీఆర్ఐ, మెట్టుగూడ స్టేషన్‌లో జనాల్లేరు. ఉదయం వేళలో అమీర్‌పేట వైపు వెళ్లే మెట్రో రైళ్లలో ఒక కోచ్‌లో 60మందిలోపే ఉంటున్నారు.

మెట్రో చార్జీలు భారమే..

నగరవాసులకు చార్జీలు భారంగా మారడంతో మెట్రో రైలులో ప్రయాణిచేందుకు ఆసక్తి చూపడం లేదు. దాంతో పాటు నాగోల్ నుంచి మియాపూర్‌కు ప్రయాణానికి గంట కు పైగా సమయం పడుతోంది. ట్రాఫిక్‌ను మినహాయిస్తే ఓలా, ఊబర్ కార్లతో పాటు ద్విచక్ర వాహనాలపైనా గంటలోపే చేరుకోవడానికి అవకాశం ఉంది. పలు మెట్రో స్టేషన్ల దగ్గర మెట్రో రైలు 20 సెకన్లు ఆగాల్సి ఉండగా రెండు నిమిషాల వరకు ఆగడంతో పాటు కొన్నిసార్లు 15 నిమిషాలకు పైగా నిలుపుతున్నారు. నాగోల్ నుంచి మియాపూర్ వెళ్లేందుకు అమీర్‌పేట ఇంటర్‌ఛేంజ్ స్టేషన్లలో రైలు మారే క్రమంలో 15 నిమిషాలకు పైగా సమయం పడుతోంది. పలు స్టేషన్ల దగ్గర పార్కింగ్ సౌకర్యం కూడా స్టేషన్లకు కార్లలో వచ్చేవారంతా వెనుదిరుగుతున్నారు. ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన స్టేషన్ల దగ్గర కారు పార్కింగ్ సౌకర్యం ఉన్నా మెట్రో ఎక్కడానికి ఆసక్తి చూపడం లేదు. ప్రస్తుతం 24 మెట్రో స్టేషన్లు అందుబాటులోకి రాగా, ఇందులో ఎన్‌జీఆర్ఐ, ఉప్పల్ స్టేడియం, మెట్టుగూడ, ప్రకాశ్‌నగర్ తదితర స్టేషన్ల దగ్గర సాధారణ రోజుల్లో రోజుకు 200టోకెన్లు కూడా అమ్ముడుపోవడం లేదని తెలిసింది.

అమీర్‌పేట నుంచి నాగోల్ వైపు వచ్చే రైళ్లలోనూ అంతగా జనాలు ఉండడం లేదు. ఉదయం 8.30గంటల సమయంలో సికింద్రాబాద్ ఈస్ట్ స్టేషన్‌కు చేరుకున్న అమీర్‌పేట వైపు వెళ్లే మెట్రో రైలులో కోచ్‌లో 56మందే ఉన్నారు. అదే నాగోల్ వైపు 8.45 గంటలకు వెళ్లే రైలులో కోచ్‌లో 33 మందే ఉన్నారు. ఉదయం 10.30గంటల వరకు ప్రయాణికుల సంఖ్య ఇలాగే ఉంది. అమీర్‌పేట నుంచి మియాపూర్ వైపు కూడా అదే పరిస్థితి.

అత్యవసరమైనప్పుడే..

ఈ టైమ్‌లో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుంది కదా..! అత్యవసరమైనప్పుడే మెట్రో రైలులో పనిమీద వెళ్తుంటా. ఒక్కోసారి చాలా సమయం పడుతుంది. కొన్ని స్టేషన్లలో ఎక్కువసేపు ఆపుతున్నారు. చార్జీలు మరీ ఎక్కువగా ఉండటంతోనే జనాలు వస్తలేరు.



ఎన్.అరుణ్ - సీతాఫల్‌మండి

సాయంత్రం 80మందికి మించని ప్రయాణం


మధ్యాహ్నం వేళలో మెట్రో రైళ్లలోనూ, మెట్రో స్టేషన్లలో ప్రయాణికులు కనిపించడం లేదు. సాయంత్రం వేళలో ఉదయం కంటే కొంత అధికంగా ప్రయాణిస్తున్నారు. సాయంత్రం 6గంటల నుంచి రాత్రి పది గంటల వరకు అమీర్‌పేట వైపు వెళ్లే రైళ్లలో కంటే నాగోల్ వైపు వెళ్లే రైళ్లలోనే అధికంగా జనాలున్నారు. అమీర్‌పేట నుంచి బయలుదేరిన మెట్రో రైలులో సికింద్రాబాద్ ఈస్ట్ స్టేషన్‌లో సుమారు 70 నుంచి 90 మంది వరకు దిగుతున్నారు. ఇక్కడే సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఉండటంతో ప్రయాణికులు అధికంగా దిగుతున్నారు. కానీ ఈ స్టేషన్‌లో ఎక్కేవారి సంఖ్య ప్రతి పదిహేను నిమిషాలకు ఇరు ప్లాట్‌ఫామ్‌లపై పది నుంచి 15 మంది మాత్రమే ఉంటున్నారు. అమీర్‌పేట నుంచి నాగోల్ మార్గంలో కోచ్‌కు 80మందిలోపు ప్రయాణిస్తుండగా, హబ్సిగూడ, ఉప్పల్ చేరే సరికి దాదాపు మెట్రో రైలు ఖాళీ అవుతోంది.

15మందిలో రోజువారి ప్రయాణికులు ముగ్గురే

తార్నాక స్టేషన్‌లో బుధవారం సాయంత్రం 7.24 గంటలకు అమీర్‌పేట వైపు వెళ్లే ప్లాట్ ప్లామ్‌పై 14మంది ప్రయాణికులుండగా ఇందులో ముగ్గురు మాత్రమే ప్రతి రోజూ ప్రయాణిస్తున్నామని చెప్పారు. ఇద్దరు అప్పుడప్పుడని, మిగతా 9మంది కొత్తగా ఎక్కడానికి వచ్చామని చెప్పారు. సికింద్రాబాద్ ఈస్ట్ మెట్రో స్టేషన్‌లో రాత్రి 8గంటలకు అమీర్‌పేట వైపు నుంచి వచ్చిన మెట్రో రైలు నుంచి దిగిన 72మందిలో స్మార్ట్‌కార్డు ఉపయోగించినవారు 17మంది మాత్రమే ఉన్నారు. మెట్రో ప్రారంభంలో మెట్రో స్మార్ట్ కార్డు ధర రూ.200 ఉండటంతో జనం కొనడానికి ఆసక్తి చూపకపోవడంతో రూ.150కు తగ్గించారు. ఇప్పటి వరకు 1.50లక్షల వరకు స్మార్ట్‌కార్డులు కొనుగోలు చేసిన్నట్టు అధికారులు చెబుతున్నా రోజువారీగా వినియోగించే వారి సంఖ్య గణనీయంగా తగ్గింది.

అప్ అండ్ డౌన్ తక్కువుండాలి

చార్జీలు మరీ ఎక్కువగా ఉన్నాయి. అర్జెంట్ పని మీద అమీర్‌పేటకు పోయి రావాలి. అప్ అండ్ డౌన్ టోకెన్ లేదంటా..! ముంబాయి మెట్రోరైలులో అప్ అండ్ డౌన్ టోకెన్ ఉండటంతోపాటు చార్జీలు తక్కువగా ఉంటాయి. అమీర్‌పేటకు పోయొస్తే రూ.80లా..!



బి.శివరాజ్ - ఉప్పల్

ఇంటర్ గ్రేడింగ్‌పై ఊగిసలాట?

- ఈ ఏడాది అమలుపై సర్కారు తర్జనభర్జన
- కాలయాపన కోసమే కమిటీల నియామకం
- ఉప ముఖ్యమంత్రి ప్రకటనతో మళ్లీ మొదటికి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంటర్మీడియెట్ విద్యార్థులు వార్షిక పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. ఇంటర్ బోర్డు అధికారులు పరీక్షల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఇంటర్మీడియెట్‌లో ప్రస్తుత మార్కుల విధానమే ఉంటుందా? లేక గ్రేడింగ్ విధానం అమలవుతుందా?అన్న దానిపై ఇంకా స్పష్టత లేదు. రాష్ట్ర ప్రభుత్వం గ్రేడింగ్ విధానం అమలుపై ఊగిసలాట ధోరణిని అవలంబిస్తున్నట్లు కనిపిస్తున్నది. ఈనెల ఒకటిన ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి గ్రేడింగ్ విధానంపై కమిటీ ఏర్పాటు చేస్తామని ప్రకటించడంతో మళ్లీ మొదటికి వచ్చింది. ఇప్పటికే నిపుణులు, యాజమాన్యాలు, అధికారులతో ఏర్పాటైన కమిటీ సాధ్యాసాధ్యాలను పరిశీలించి గ్రేడింగ్ విధానం అమలు చేయాలని నివేదిక సమర్పించింది. దాన్ని పరిశీలించిన ఇంటర్ బోర్డు అధికారులు గ్రేడింగ్ విధానాన్ని ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు అమలు చేయాలని సమాలోచన చేశారు. కానీ ఉప ముఖ్యమంత్రి కడియం ప్రకటనతో ఈఏడాది ఇంటర్‌లో గ్రేడింగ్ విధానం అమలు లేనట్టేనని అర్థమవుతున్నది. ప్రభుత్వం ఇంత వరకూ స్పష్టత ఇవ్వకపోవడంతో పలు అనుమానాలు వినిపిస్తున్నాయి. అమలు చేయడం ఇష్టంలేకనే కాలయాపనకోసమే మరోకమిటీని వేస్తోందని విద్యావేత్తలు విమర్శిస్తున్నారు.

ప్రభుత్వ కాలేజీల ఫలితాలు తగ్గుతాయని భయమా?

ఇంటర్మీడియెట్ విద్యలో ప్రభుత్వ కాలేజీల ఫలితాలు తగ్గుతాయని సర్కారులో భయముందా?అన్న అనుమానాలు వినిపిస్తున్నాయి. కార్పొరేట్, ప్రయివేటు కాలేజీల్లో చదివే విద్యార్థుల్లో ఎక్కువ మంది ఏ, బీ గ్రేడింగ్ సాధించే అవకాశముంది. ఇక ప్రభుత్వ ఆధీనంలోని గురుకులాల్లోని విద్యార్థులూ ఉత్తమ ప్రతిభ కనబరుస్తారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదివే విద్యార్థులు సీ, డీ గ్రేడ్‌లు సాధిస్తే పరిస్థితి ఏంటన్న ఆందోళన అధికారుల్లో ఉన్నట్టు వ్యక్తమవుతున్నది. ఇంకోవైపు ఇంటర్‌లో ఉచిత విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు అందించడం, వసతులు మెరుగుపర్చడం, అధ్యాపకుల కొరత లేకుండా చర్యలు తీసుకోవడం, ఆన్‌లైన్ సేవలు ప్రవేశపెట్టడం వంటి అనేక చర్యలు ప్రభుత్వం చేపట్టింది. అయినా ఫలితాలు తగ్గుతాయన్న ఆందోళన ఉన్నందునే ఈఏడాది గ్రేడింగ్ విధానం అమలుపై విముఖత చూపుతున్నట్టు తెలుస్తున్నది. ఇంకోవైపు ఎంసెట్‌లో ఇంటర్ మార్కులకు 25 శాతం వెయిటేజీ అమల్లో ఉంది. జేఈఈకి దరఖాస్తు చేయాలంటే సాధారణ విద్యార్థులు ఇంటర్‌లో 75 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీలు 65 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించిన వారే అర్హులు. గ్రేడింగ్ విధానం అమల్లోకి వస్తే 75 శాతం, 65 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులను ఎలా గుర్తించాలన్న ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో గ్రేడింగ్ విధానం అమల్లో ఉంది. వారు గ్రేడింగ్ విధానం ఉన్నా మార్కుల ప్రకారం విద్యార్థులను గుర్తించి వివరాలను జేఈఈ, ఎంసెట్ అధికారులకు పంపిస్తున్నారు. ఇదే పద్ధతిని తెలంగాణ ప్రభుత్వం పాటించాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు. ప్రభుత్వం ఏం నిర్ణయం తీసుకుంటుందో వేచిచూడాల్సిందే.



(ఫైల్)



ఎగిరే విమానం ఎందుకు పడిపోదు?

గాల్లో ఎగిరే విమానం పడిపోకుండా ఎలా వుంటుంది?
– షేక్ ఖాసిమ్, జైన్ పాఠశాల

జవాబు : పక్షిలాగా గాల్లో విహరించాలని మానవుడు కొన్ని సహస్రాబ్దిల తరబడి ప్రయత్నించాడు. పక్షులు ఎగరగా లేనిది మనిషి ఎందుకు ఎగరలేడన్నది వారి ప్రశ్న. ఏదైనా ఒక వస్తువును పైకి పంపాలంటే అది గురుత్వాకర్షణను అధిగమించాలి. అందుకోసం శక్తికావాలి. మానవ శ్రమశక్తి, పెంపుడు జంతువుల జీవశక్తి తప్ప మొదట్లో మరే యితర సహజ శక్తుల వినిమయం గురించి మనిషికి తెలియలేదు. పక్షులు ఎగిరే క్రమంలో రెక్కలు కదలడాన్ని గమనించిన మనిషి... రెక్కలు లేకపోవడం వల్లే మనిషి కదలడం లేదని తీర్మానించుకున్నాడు. పెద్దపెద్ద చాటల్లాగా రెక్కల్ని చేతులకు కట్టుకొని ప్రయత్నించినా పైకి ఎగర్లేక పోయారు. ఇక గాల్లోకి ఎగరడానికి కలల్లో, ఊహల్లో, భావాల్లో, కథానికల్లో తప్ప వాస్తవంగా కుదరలేదు. ఆ క్రమంలోనే పుష్పక విమానం తదితర ఆలోచనలు వచ్చాయి. కానీ గ్రంథాల్లో పుష్పక విమానాలకు రకరకాల చిత్రీకరణలు వున్నాయి. గాలి గుమ్మటంలాగా ఒక బొమ్మ, రెక్కలున్నట్లుగా మరో బొమ్మ, రాకెట్టులాగా ఇంకో బొమ్మ వున్నాయి. ఇవేవీ నిజంగా ఎగరాలంటే తప్పకుండా గాలి వుండాలి. లేదా వేగంగా నాజిల్ గుండా వాయువులు లేదా ప్రవాహకాలు (fluids) బయటపడే యంత్రాంగం ఉండాలి. ఇవేవీ వాస్తవంగా తెలీని రోజుల్లోనే గ్రహాంతర ఆకాశయానం వీలయ్యిందని మత ఛాందసులు, కుహనా శాస్త్రవేత్తలు శాస్త్రం పేరుతో ప్రచారం చేయడానికి ప్రయత్నించి విఫలం అవుతున్నారు. రెక్కలతో గిర్రున తిరుగుతూ అటుయిటూ కదిలే విత్తనాలను చూసి లియొనార్డో డావిన్సీ హెలికాప్టర్ బొమ్మను పోలిన చిత్రాన్ని గీశాడు. కానీ డావిన్సీ మత ఛాందసుడు కాదు కాబట్టి 'తన బొమ్మ కేవలం ఊహ మాత్రమేనని' అంగీకరించాడు. ఇలా రెక్కల్ని తిప్పగలిగితే గాల్లో ఎగిరే విత్తనంలాగా యంత్రం కూడా పైకి ఎగురుతుందని డావిన్సి పేర్కొన్నాడు. కానీ డావిన్సీ మరణించాక కొన్ని వందల సంవత్సరాల తర్వాతే హెలికాప్టరుకు వాస్తవ రూప కల్పన సిద్ధించింది. రెక్కలున్న పక్షుల్లాగే ఆకులు, ఈగలు, తుమ్మెదలు, బొద్దింకలు, కోళ్లు, ఎగిరే ఉడతలు, ఎగరడాన్ని గమనించిన శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకత ఉన్న మనుషులు, శ్రామికులు రెక్కలున్న యంత్రాలతోనే పైకి ఎగరగలమని తీర్మానించుకొన్నారు. తొలిసారిగా రైట్ సోదరులు (Wright Brothers) 1903 సంవత్సరం డిసెంబర్ 17 నాడు కేవలం కొన్ని అడుగుల దూరం మేరకే కొన్ని అడుగుల ఎత్తులో మాత్రమే, మోటారు సహాయంతో ఎగరగలిగారు. మానవ శాస్త్ర సాంకేతిక శాస్త్రాల చరిత్రలో అది ఒక అద్భుత ఘట్టం అది. నేటి ఆధునిక విమానాలు ఇదే సూత్రం మీద పనిచేస్తాయి.



ప్రొ॥ ఎ. రామచంద్రయ్య
సంపాదకులు, చెకుముకి,
జన విజ్ఞాన వేదిక


రెక్కలకున్న రేఖా గణిత నిర్మాణం వల్ల యంత్రం సాయంతో విమానం ముందుకు దూసుకెళ్తున్న సందర్భంలో గాలి వేగం రెక్కల పైభాగంలో అధికంగా, రెక్కల క్రింది భాగంలో తక్కువగా ఉండే ఏర్పాటు వుంటుంది. ప్రవాహకాల వేగానికి ప్రవాహకాల ద్రవ పీడనానికి (Hydrodynamic pressure) విలోమ సంబంధం వుంటుందని బెర్నౌలీ (Bernoulli Principle) సిద్ధాంతం చెబుతోంది. తద్వారా విమానాల రెక్క మీద తక్కువ పీడనం, రెక్కల క్రింది భాగంలో అధిక పీడనం సిద్ధిస్తాయి. అంటే రెక్కల మీద నికరంగా పైవైపు బలం వుంటుంది. ఈ ఊర్ధ్వోముఖ చలనం వల్లనే విమానాలు పైకి ఎగురుతాయి. కదలకుండా విమానం ఆకాశంలో ఉండలేదు. కాబట్టే హెలికాప్టర్లు తర్వాత వచ్చేయి.

1903 లో మానవుడు కేవలం కొన్ని అడుగులు దూరానికి, కొన్ని అడుగుల ఎత్తులోనికి వెళ్లగలిగినా అద్భుత మానవ మేధస్సు సాంకేతిక పరిజ్ఞానాలు, పరిశోధనల కారణంగా నేడు (100 లోపే) కొన్ని వేల టన్నుల బరువున్న విమానాన్ని కిలోమీటర్ల ఎత్తులో ఎక్కడా ఆగకుండా వేలాది కిలోమీటర్ల మేర నడప గలుగుతున్నాడు. నేడు విమానం ఏదైనా దానిని ముందువైపునకు నెట్టడానికి ప్రొపెల్లర్లను గానీ, జెట్ ఇంజన్‌ను గానీ వాడతారు. కొన్ని వందల కి.మీ. వేగంతో విమానం వెళ్లే క్రమంలో దానికి అటు యిటూ ఎంతో నిడివి (అటునుంచి యిటు దాదాపు విమానం అంతటి పొడవు)తో దృఢమైన రెక్కలు వుంటాయి. రెక్కల అడ్డుకోత వంపు తిరిగిన గొడ్డలి ఆకారంలో వుంటుంది. ఒకవైపు కుంభాకృతి (Convex) మరోవైపు పుటాకృతి (Concave) వుంటుంది. రెక్కల విస్తారం విమానం దగ్గర ఎక్కువగా, దూరం వెళ్లే కొలది తక్కువగా, పలచగా వుంటుంది. విమానం పైకి ఎగిరేపుడు, కిందికి దిగేటపుడు విమానం రెక్కలు క్షితిజ సమాంతరం (Horizontal) గా కాకుండా కొంచెం వాలుగా వుంటాయి. ఈ వాలులో పుటాకార రూపం భూమి వైపు, కుంభాకార రూపం పై వైపు వుండేలా వాలుగా వుంటాయి. విమానం ముందుకు వెళ్తున్న క్రమంలో రెక్కల మీదుగా గాలి పొరలు ప్రయాణిస్తాయి. పటంలో చూపినట్లు A నుంచి బయలు దేరిన గాలిన పొరలు B వరకు చేరుకుంటేనే A, B ల దగ్గర పీడనం ఒకేవిధంగా వుంటుంది. లేదా A, Bల దగ్గర ఒకే వాయు పీడనం వుండడం అంటే అర్థం ఏమిటంటే A నుంచి B వైపు రెక్కల పైనుంచి వెళ్లే గాలి పొరలు, A నుంచి B వైపు రెక్కల కింది వైపు నుంచి వెళ్లే పొరలు సమాన కాలంలో A నుంచి B వైపు చేరాలి. అయితే A నుంచి B వైపు రెక్కల పై వైపు నుంచి ఎక్కువ దూరం ప్రయాణించాలి. రెక్కల కింద తక్కువ దూరమే వుంది. దూరాన్ని కాలంతో భాగిస్తే వచ్చేదే వేగం కాబట్టి దూరాలు వేరయినా కాలం ఒకటే కాబట్టి పై పొరల వేగం కింది పొరల వేగం కన్నా ఎక్కువ వుంటుంది. అంటే బెర్నౌలీ సూత్రం ప్రకారం కింద ఎక్కువ పీడనం, పై వైపున తక్కువ పీడనంతో గాలి పొరలు వుంటాయి. కానీ A, B ల దగ్గర సమానం అవుతాయి. దీనర్థం ఏమిటంటే రెక్కల మీద నికర బలం భూమ్యాకర్షణకు వ్యతిరేక దిశలో పైవైపునకు పనిచేస్తున్నదన్న మాట. పీడనమంటేనే ప్రమాణ వైశాల్యం మీద ప్రవాహకాల పీడన బలం (Force of impact) కాబట్టి విమానాన్ని రెక్కలు వంగినందు వల్ల కలిగే సింగారం బెర్నౌలీ సూత్రాల ఫలితంగా ఎంతోకొంత మేరకు భూమ్యాకర్షణను అధిగమించేలా చేస్తున్నది. అయితే ఈ బలం ఒక్కటే విమానాన్ని కింద పడకుండా వుంచలేదు. విమానాల రెక్కల వంపు వల్ల మరో యింపైన ఊర్ధ్వోముఖబలం విమానాలను పై వైపు వుంచుతుంది. అదే న్యూటన్ మూడవ సూత్రం.



పటం -1

రెండవ పటం చూడండి. విమానాల రెక్కలు నిట్ట నిలువుగా కాకుండా, క్షితిజ సమాంతరం గాను కాకుండా ఏటవాలుగా వుండడం వల్ల విమానం ముందుకు వెళ్లే క్రమంలో విమానం రెక్క వల్ల విమాన రెక్కల ఉపరి తలానికి లంబ దిశలో (పటములో Q P దిశలో) గాలి మీద వత్తిడి పనిచేస్తుంది. అయితే ప్రతి చర్యకు వ్యతిరేకంగా (action) అంతే మోతాదులో ప్రతిచర్య (reaction) వుంటుందన్న న్యూటన్ 3వ సూత్రం ప్రకారం గాలి కూడా విమానాల రెక్కల మీద అదే దిశలో అదే మోతాదులో (P Q దిశలో) ప్రతిబలాన్ని ప్రయోగిస్తుంది. ఈ ప్రతిబలం విమానాన్ని కొంచెం వెనక్కు నెట్టినట్టుగాను (Q X) కొంచెం పైకి నెట్టినట్టుగాను (Q Y) విశదీకరణలో (action) వుంటుంది. Q X నిరోధాన్ని విమానపు గమనం అధిగమించుతుంది. Q Y బలం భూమ్యాకర్షణను అధిగమించేలా మునుపు చెప్పిన బెర్నౌలీ బలానికి తోడవుతుంది. మొత్తం మీద విమానం తన ఒంపు రెక్కలతో ముందుకు వెళ్లడం వల్ల పైపైకి వెళ్లే సామర్థ్యాన్ని అందిపుచ్చుకుంటుంది.



పటం -2

డియర్ రీడర్స్..

టెక్నాలజీపరంగా మీరేదైనా సమస్యను ఎదుర్కొన్నారా.. దానిని మీరెలా పరిష్కరించారు..? ఇలాంటి అనుభవాలేమైనా ఉంటే మాకు రాసి పంపండి.
మా చిరునామా : 'టెక్‌ప్లస్' పేజీ, నవ తెలంగాణ దినపత్రిక, ఎం.హెచ్.భవన్, ప్లాట్ నెం. 21/1, ఆజామాబాద్, ఆర్.టి.సి కళ్యాణ మండపం వీధి, హైదరాబాద్ - 500020.



ఆలోచించే స్మార్ట్‌ఫోన్లు

వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న వారిని ఆడియో ద్వారానే కాకుండా వీడియో ద్వారా చేరువచేసే సూపర్‌టెక్నాలజీ యుగంలో ఉన్నాం. వాయిస్‌తో కనెక్ట్ అయ్యే ఫీచర్లతో పనిచేసే స్మార్ట్‌ఫోన్లు, స్మార్ట్ డివైజ్‌లు అందుబాటులోకి వచ్చాయి. టెక్నాలజీలో రోజురోజుకు చోటు చేసుకుంటున్న మార్పుల నేపథ్యంలో వస్తున్న అనేక వినూత్నమైన ఫీచర్లు అబ్బురానికి గురిచేస్తున్నాయి. గత ఏడాది కంటే ఈ ఏడాది మరిన్ని నూతన ఆవిష్కరణలు స్మార్ట్‌రంగంలో చోటుచేసుకోనున్నాయి. వాటిలో అతి ముఖ్యమైన టెక్నాలజీ 'ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ టెక్నాలజీ'. దీని ద్వారా మనలా ఆలోచించే స్థాయిలో స్మార్ట్‌ఫోన్లు పనిచేస్తుంటాయి. మరో మనిషి మాదిరిగా ఇవి మన వెన్నంటి ఉంటాయి. ఇప్పటికే ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ టెక్నాలజీపై పరిశోధనలు వేగంగా జరుగుతున్నాయి. ఈ ఏడాది మార్కెట్‌లోకి వచ్చే కొన్ని స్మార్ట్‌ఫోన్లు 'ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ టెక్నాలజీ' ప్రధానంగా రూపుదిద్దుకుంటున్నాయి. ఏఐ టెక్నాలజీ అందుబాటులో ఉన్నవాటిలో కొన్నింటి పరిచయం..

ప్రస్తుతం వస్తున్న స్మార్ట్‌ఫోన్లలో నాణ్యమైన ఫీచర్స్ వినియోగదా రులను ఆకట్టుకునేలా ఉన్నాయి. వాటిలో కెమెరా, వాయిస్ కమాండ్‌తో పనిచేసే ఆప్షన్‌లను ప్రధానంగా చెప్పవచ్చు. ఈ స్మార్ట్‌ఫోన్లకే ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్(ఏఐ) టెక్నాలజీని చేర్చితే ఇక మన కన్నా స్పీడ్‌గా మన చేతిలోని స్మార్ట్‌ఫోన్ పని చేస్తుంది. ఉదాహరణకు ఒక ఫొటోను తీయాలనుకున్న ప్పుడు ఎదురుగా ఉన్న సబ్జెక్ట్‌ను మాత్రమే స్మార్ట్‌ఫోన్ కెమెరా క్యాప్చర్ చేస్తుంది. అయితే ఏఐ టెక్నాలజీ అందు బాటులో ఉన్న స్మార్ట్‌ఫోన్ ఎదురుగా ఉన్న సబ్జెక్ట్‌తో పాటు లాండ్‌స్కేప్, ఫుడ్, ఫైర్‌వర్క్ ఇలా ప్రతి వస్తువును వాటికి తగినట్లుగా ఫొటో తీయడంలో ఉపయోగ పడుతుంది.

ఒక భాష నుంచి మరో భాషకు టెక్ట్స్ ను మార్చాలంటే కొద్దిగా కష్ట మైన పనే. అయితే ఏఐ టెక్నాలజీతో లాంగ్వేజ్ ట్రాన్స్‌లేషన్ ఇకపై చాలా సులభం. రియల్‌టైమ్‌లో డిఫరెంట్ లాంగ్వేజ్ లను అనువదించ డానికి ఉపయోగపడుతుంది. ఫోన్‌కు మరింత సెక్యూరిటీ ఇవ్వడంలో ఇది మెరుగ్గా పనిచేస్తుంది.

యాపిల్ ఐఫోన్ ఎక్స్

యాపిల్ ఐఫోన్ ఎక్స్ ఫోన్‌లో న్యూరల్ ఇంజన్‌తో పాటు ఎ11 బయోనిక్ చిప్‌సెట్ టెక్నాలజీని ఉపయోగించారు. దీనిలో మెషీన్ లెర్నింగ్ ఏఐ ప్రాసెసింగ్ చాలా సులభం. ఈ ఫోన్‌లో అందుబాటులో ఉన్న ఫేసియల్ రికగ్నైజేషన్ సిస్టమ్ (ఫేస్ డీ) న్యూరల్ ఇంజన్ వల్ల పని చేస్తుంది. ఫింగర్ ప్రింట్ స్కానర్ ఏర్పాటు చేయడంతో అదనపు సెక్యూరిటీ కల్పించి..వినియోగదారులను బాగా ఆకర్షిస్తుంది.

గూగుల్ పిక్సెల్ 2

ఇటీవలే గూగుల్ మార్కెట్లో అందుబాటులోకి వచ్చిన గూగుల్ పిక్సెల్ 2, పిక్సెల్2 ఎక్స్‌ఎల్ ఫోన్లకు కూడా ఏఐ టెక్నాలజీని అనుసంధానిం చారు. విజువల్ కోర్ ప్రాసెసర్ వల్ల సూపర్ ఇమేజింగ్ సామర్థ్యం దీని సొంతం. వాయిస్ కమాండ్స్ ద్వారా పనిచేసే గూగుల్ అసిస్టెంట్ ఇందులో అందుబాటులో ఉంటుంది.





శాంసంగ్ గెలాక్సీ ఎస్8

అనేక పరిశోధన అనంతరం అందుబాటులోకి వస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్సీతో రూపొందించిన ఫోన్లలో శాంసంగ్ గెలాక్సీ ఎస్8, ఎస్8 ప్లస్, నోట్ 8 మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. ఇందులో ఉన్న బిక్స్ బే టెక్నాలజీ ద్వారా కమ్యూనికేషన్ జరుగుతుంది. కంపాటిబుల్ ఆప్స్ ద్వారా ఇది పనిచేస్తుంది. డివైజ్ వేగాన్ని పెంచుకోడానికి కూడా ఉపయోగపడుతుంది.

హానర్ వ్యూ 10 :

కిరిన్ 970 ప్రాసెసర్‌తో వచ్చిన ఫోన్ హానర్ వ్యూ 10. దీనిలో న్యూట్రల్ నెట్‌వర్క్ ప్రాసెసింగ్ యూనిట్ ఉపయోగించారు. సెక్యూర్ ఫేస్ అన్‌లాక్, కెమెరా బెనిఫిట్స్, ట్రాన్స్‌లేషన్స్, ఎన్‌హేన్సడ్ ఆటోమేషన్, వాయిస్ అసిస్టెంట్ లాంటి అధునాతన ఫీచర్లు ఈ ఫోన్‌లో అందుబాటులో ఉన్నాయి.

❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄



'టెలిగ్రాం' వచ్చింది..!

మెసేజింగ్ ఆప్ అంటేనే వాట్సాప్ అన్న విధంగా మారిపోయింది. ఇటీవల వాట్సాప్‌కు ప్రత్యామ్నాయంగా మరో మెసేజింగ్ ఆప్ అందుబాటులోకి వచ్చింది. ఇందులో వాట్సాప్‌కు దీటుగా కొత్తకొత్త ఫీచర్లు ఉన్నాయి. దీనితో ఇకనుంచి ఒక ఆండ్రాయిడ్ ఫోన్‌లో మూడు టెలిగ్రాం అకౌంట్లను ఉపయోగించవచ్చు. ఒకటి కన్నా ఎక్కువ టెలిగ్రాం అకౌంట్లు ఉన్నవారికి ఈ ఫీచర్ బాగా ఉపయోగ పడుతుంది. అయితే ఇది ఆండ్రాయిడ్ ఫోన్‌లో మాత్రమే అందుబాటులో ఉంది. ఐఓఎస్ ప్లాట్‌ఫాంపై లభిస్తున్న టెలిగ్రాం ఆప్‌లోనూ రెండు కొత్త థీమ్‌లను జత చేశారు. ఇక రెండు ప్లాట్‌ఫాంలపై కూడా టెలిగ్రాం యూజర్లు తమకు వచ్చే మెసేజ్‌లకు త్వరత్వరగా రిప్లై ఇవ్వవచ్చు. టెక్ట్స్, ఎమోజీ, స్టిక్కర్, జిఫ్ ఇమేజ్‌లను క్షణాల్లో పంపుకోవచ్చు. తాజా వెర్షన్ 4.7ను ఆండ్రాయిడ్, ఐఓఎస్ యూజర్లు తమ తమ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ప్రొఫొటో రిమోట్

నయామాల్

రోజురోజుకు టెక్నాలజీ రంగంలో వస్తున్న కొత్తకొత్త ఆవిష్కర ణలు ఎన్నో అద్భుతాలను సృష్టిస్తున్నాయి. సెల్‌ఫోన్‌లో కెమెరా అందుబాటులోకి రావడం ఒక విప్లవమైతే.. ఫొటోగ్రఫీ రంగంలో వస్తున్న వినూత్న టెక్నాలజీ సరికొత్త పరికరాలు నాణ్యమైన ఫొటోలను తీయడానికి అందుబాటులోకి వచ్చాయి. ఇటీవల మార్కెటులోకి వచ్చిన ఎయిర్ రిమోట్ ఫొట్రోగ్రఫీని ప్రొఫెషనల్‌గా తీసుకునేవారికి ఎంతో ఉపయోగ పడుతుంది. ఫూజీ ఫిల్మ్ – ప్రొఫొటో సంయుక్తంగా రూపొందించిన ఈ ఎయిర్ రిమోట్ టిటిఎల్–ఎఫ్, హెచ్‌ఎస్‌ఎస్‌ను మార్కెట్‌లో విడుదల చేశారు. ప్రస్తుతం అన్ని ఫొటోస్టోర్‌లలో ఇది లభిస్తున్నది. ఫూజీ ఫిల్మ్ సంస్థ గత కొన్ని సంవత్సరాలుగా ఫొటో రంగానికి నాణ్యమైన ఫొటో పేపర్‌ను సరఫరా చేస్తున్నారు. 35 ఎంఎం ఫిల్మ్ నుంచి కలర్ ఫిల్మ్ వరకు ఎంతో ప్రఖ్యాతి గాంచింది. ప్రస్తుతం ప్రొఫొటో సంస్థతో కలిసి పరిశోధనలు చేసి ఎయిర్ రిమోట్ టిటిఎల్–ఎఫ్, హెచ్‌ఎస్‌ఎస్‌ను అందుబాటు లోకి తెచ్చింది. దీనివల్ల ఫొటోలను అత్యంత కాంతివంతంగా తీయవచ్చు. ఎయిర్ టిటిఎల్–ఎఫ్‌తో మంచి ఎక్స్‌పోజర్ టైమ్ తీసుకొని నాణ్యమైన చిత్రాలను తీయవచ్చు.



ఇది పూర్తిగా వైర్‌లెస్ రేడియో రిమోట్ ట్రాన్స్‌మీటర్‌తో అటాచ్ చేసిన పరికరం. దీన్ని ఫూజీ కెమెరాలకే కాకుండా నికాన్, కెనాన్ కెమెరాలకు కూడా ఉపయోగించుకోవచ్చు. ఎయిర్ రిమోట్ టిటిఎల్–ఎఫ్ , హెచ్‌ఎస్‌ఎస్ పూర్తిగా బి1 ఎక్స్, బి1, బి2, డి2, పది ప్రొలైట్స్‌కు ఈ రిమోట్ ఉపయోగపడుతుంది. నాణ్యమైన చిత్రాలను బెటర్ టైమింగ్‌తో తీసేవీలు కలుగుతుంది.

❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄

రేడియేషన్ ముప్పు ... !

Awareness

సెల్‌ఫోన్లు నిత్యావసర వస్తువులుగా మారిపోయాయి. అవి లేకుండా ఒక్క క్షణం కూడా ఉండలేని స్థితిలో ఉన్నాం. ఈ విపరీత వాడకం వల్ల అనేక సమస్యలు వస్తున్నాయి. సెల్‌ఫోన్లు, సెల్ టవర్స్ నుంచి వచ్చే రేడియేషన్‌తో అనేక అనారోగ్యసమస్యలు తరంగాల్లా చుట్టుముడుతున్నాయి. వీటినుంచి వచ్చే రేడియేషన్ ముప్పు తప్పించుకోవాలంటే కొన్ని జాగ్రత్తలు తప్పనిసరి..

- స్మార్ట్ ఫోన్ల కన్నా ల్యాండ్ లైన్ ఫోన్లలో రేడియేషన్ చాలా తక్కువగా ఉంటుంది. వాటిని ఉపయోగించడం ద్వారా కూడా రేడియేషన్ ప్రభావం నుంచి బయటపడవచ్చు.
- ఫోన్‌ను వీలైనంత వరకు మీ శరీరానికి దూరంగా ఉంచండి. చాలామంది ఫోన్‌ను ఎప్పుడు షర్టు జేబులోనూ, ప్యాంట్ జేబులోనూ పెడతారు. ఇది మంచిపద్ధతి కాదు. ఆఫీస్‌లో ఉన్నప్పుడు డెస్క్‌పై ఫోన్ పెట్టండి. లేదంటే మిగతా సమయాల్లో శరీరానికి వీలైనంత దూరంగా సెల్‌ఫోన్లను ఉంచండి.
- ఫోన్ చేసినప్పుడు అవతలి వారు ఎత్తే వరకు ఫోన్ చెవి దగ్గర ఉంటుంది. దీనితో రేడియేషన్ ప్రభావం శరీరంపై ఎక్కువ పడుతుంది. ఫోన్ మాట్లాడే సమయం లో వీలయినంతవరకు ఇయర్‌ఫోన్స్‌తో కాని స్పీకర్ ఆన్ చేసి కాని మాట్లాడండి.
- సెల్‌సిగ్నల్ తక్కువగా ఉన్నప్పుడు, సెల్ బ్యాటరీ చార్జింగ్ తక్కువగా ఉన్నప్పుడు ఫోన్‌లో మాట్లాడవద్దు.
- సెల్ ఫోన్ ఛార్జింగ్ పెట్టి చాలా మంది ఫోన్‌కాల్స్ మాట్లాడు తుంటారు. ఛార్జింగ్ చేసే సమయంలో రేడియేషన్ సాధారణ స్థాయికన్నా అధిక స్థాయిలో విడుదలవుతుంది. ఈ సమయంలో ఫోన్ మాట్లాడటం మంచిది కాదు. కొన్ని సార్లు ఫోన్ పేలిపోయే ప్రమాదం ఉంటుంది.



- మాట్లాడడం కన్నా టెక్ట్స్ మెసేజ్ పంపడం వల్ల రేడియేషన్ ప్రభావం చాలా తక్కువగా ఉంటుంది. అత్యవసరం అయితేనే ఫోన్ మాట్లాడండి.
- చాలామంది డ్రైవ్ చేస్తూ..ఫోన్ మాట్లాడుతుంటారు. దీనివల్ల రోడ్డు ప్రమాదాలే కాదు.. ఫ్రీక్వెన్సీ పవర్ ఎక్కువగా విడుదలై మీ మెదడుపై ప్రభావం చూపిస్తుంది.
- రాత్రి పూట నిద్రించేటప్పుడు చాలా మంది ఫోన్‌ను తల పక్కనే పెట్టుకుని నిద్రిస్తారు. కానీ అలా చేయ రాదు. తలపక్కన ఫోన్ పెట్టకూడదు.దీంతో పాటు ఫోన్లను ప్రత్యేక పర్సులలో పెట్టుకోండి. జేబుల్లో పెట్టుకోకండి.
- ఫోన్‌ను చార్జింగ్ పెట్టినప్పుడు వాడకండి. అలాంటి సమయంలో వాటి నుంచి సాధారణ సమయాల్లో కన్నా అధిక రేడియేషన్ విడుదలవుతుంది. కనుక వాటిని చార్జింగ్ తీసి వాడితే మంచిది. అలాగే సెల్‌ఫోన్‌ల వెనుక భాగంలో వేసే యాంటీ రేడియేషన్ స్టిక్కర్లు వాడితే రేడియేషన్ ముప్పును కొంత వరకు తగ్గించుకోవచ్చు.
- ఫోన్ వాడకం తగ్గించడం చాలా కష్టం. అయితే వీలైనంతగా తగ్గిం చడానికి ప్రయత్నించడం చాలా మంచిది. ముఖ్యంగా గర్భిణీలు సెల్‌ఫోన్లను వీలైనంత తక్కువ వాడాలి. లేదంటే కడుపులోని శిశువు ఆరోగ్యంపై ప్రభావం ఉంటుంది.

హెచ్‌సీఏలో సస్పెన్షన్ రగడ

- ఏడాదికాలం ఉండగానే కమిటీలో లుకలుకలు
- అవినీతి ఆరోపణలతోనే సస్పెండ్: వివేక్
- దోపిడీని అడ్డుకున్నందుకే: శేష్ నారాయణ

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ)లో 'సస్పెన్షన్' రగడ మొదలైంది. అవినీతి ఆరోపణలోనే కార్యదర్శి శేష్‌నారాయణను సస్పెండ్ చేసినట్టు హెచ్‌సీఏ అధ్యక్షులు వివేక్ ప్రకటించగా, వారి దోపిడీనీ అడ్డుకుంటున్నందుకే ఈ సస్పెన్షన్ డ్రామా అని శేష్‌నారాయణ చెబుతున్నారు. కమిటీ పదవికాలం ఇంకా ఏడాది ఉండగానే లుకలుకలు రావడం గమనార్హం. శుక్రవారం ఉదయం జరిగిన ప్రెస్‌మీట్‌లో హెచ్‌సీఏ అధ్యక్షులు జి వివేక్ మాట్లాడుతూ...హైదరాబాద్ క్రికెట్ సెలక్షన్స్‌లో అక్రమాలకు పాల్పడటంతో పాటు అపెక్స్ కౌన్సిల్ నిర్ణయాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తుండటంతో [illegible] మీటింగ్‌లో శేష్‌నారాయణ సస్పెన్షన్‌పై నిర్ణయం తీసకున్నామని తెలిపారు. ఆరోపణలపై అంబుడ్స్‌మెన్‌కు చార్జిషీట్ ఇచ్చామనీ, ఆరునెలల్లో విచారణ చేసి పూర్తిస్థాయి నివేదిక ఇస్తుందని చెప్పారు. కాగా ఈ ఆరోపణలపై శేష్‌నారాయణ మాట్లాడుతూ... అధికారాన్ని అడ్డుపెట్టుకుని వివేక్ బెదిరిస్తున్నారనీ, అయినా భయపడబోనని అన్నారు. తనకు, తన కుటుంబానికి వివేక్ నుంచి ప్రాణహాని ఉందన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు వివేక్ హెచ్‌సీఏ అధ్యక్ష పదవికి అర్హులు కాదని తెలిపారు. సస్పెన్షన్‌పై న్యాయపోరాటం చేస్తానని ఆయన 'నవతెలంగాణ'తో చెప్పారు.

జాతీయ కబడ్డీ విజేత మహారాష్ట్ర

- మహిళల చాంపియన్ హిమాచల్ ప్రదేశ్
- 65వ జాతీయ సీనియర్ కబడ్డీ చాంపియన్‌షిప్స్



ఈ తెలా గాణ క్రీడాప్రతినిధి-హైదరాబాద్

జాతీయ సీనియర్ కబడ్డీ చాంపియన్‌గా మహారాష్ట్ర టైటిల్ సొంతం చేసుకున్నది. సర్వీసెస్‌తో నువ్వా నేనా అన్నట్టు సాగిన ఫైనల్లో పైచేయి సాధించిన మహాజట్టు 34-29తో విజయం సాధించింది. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన జాతీయ కబడ్డీ అంతిమ పోటీలు అభిమానులను ఉర్రూతూలూగించాయి. టైటిల్ పోరులో విరామ సమయానికి 17-12తో ఆధిక్యంలో నిలిచిన మహారాష్ట్ర.. ద్వితీయార్ధంలో పట్టు కోల్పోయింది. డిఫెండర్ల మెరుపు టాకిల్స్, రైడర్ల పాయింట్ల కూతతో సర్వీసెస్ రేసులోకి దూసుకొచ్చింది. ఓ దశలో 23-23తో సమవుజ్జీగా నిలవటమే కాదు 25-23తో ముందంజ వేసింది. కానీ ఆఖర్లో నిమిషానికోసారి ఆధిక్యం చేతులు మారటంతో ఫలితం ఉత్కంఠ రేగింది. సర్వీసెస్ జోరుతో ఒత్తిడిలో పడి నట్టే కనిపించిన మహారాష్ట్ర.. అనూహ్యంగా పుంజుకున్నది. 34-29తో విజయం సాధించి జాతీయ చాంపియన్‌గా అవతరించింది. హెూరాహెూరీగా సాగిన సెమీఫైనల్స్‌లో కర్ణాటక, హర్యానాలు ఇంటిముఖం పట్టాయి. ఆఖరు రైడ్ వరకూ ఉత్కంఠ రేపిన తొలి సెమీస్‌లో 35-34తో కర్ణాటకపై మహారాష్ట్ర విజయం సాధించింది. హర్యానాపై 32-28తో సర్వీసెస్ అలవోక విజయం నమోదు చేసింది.

మహిళల విభాగం ఫైనల్లో రైల్వేస్‌పై హిమాచల్ అమ్మాయిలు ఘన విజయం సాధించారు. ఆసక్తికరంగా సాగిన టైటిల్ పోరులో 38-25తో హిమాచల్ ప్రదేశ్ గెలుపొందింది. విరామ సమయానికి 17-11తో ఆధిక్యంలో కొనసాగిన హిమాచల్ అమ్మాయిలు ద్వితీయార్ధంలోనూ అదే జోరు కొనసాగించారు. నిధి శర్మ, పుష్ప దేవిలు హిమాచల్ తరపున ఆకట్టుకునే ప్రదర్శన చేశారు. అంతకముందు జరిగిన సెమీఫైనల్స్‌లో పంజాబ్‌పై రైల్వేస్ 30-23, హర్యానాపై హిమాచల్ ప్రదేశ్ 30-26తో గెలుపొందాయి.

• నార్త్‌ఈస్టర్న్ విజయం

చెన్నై : పీబీఎల్ పోరులో నార్త్‌ఈస్టర్న్ వారియర్స్‌కు తొలి విజయం. శుక్రవారం జరిగిన షటిల్ సమరంలో బెంగళూరు బ్లాస్టర్స్‌పై 3-2తో నార్త్‌ఈస్టర్న్ జట్టు గెలుపొందింది. అజయ్ జయరాం రాణించాడు. ప్రత్యర్థి ఎన్నుకున్న ట్రంప్ మ్యాచ్‌ను వరుస సెట్లలో నెగ్గాడు. మిచెల్ లీ మహిళల సింగిల్స్‌లో ట్రంప్ మ్యాచ్ విజయంతో రెండు టై పాయింట్లు సాధించింది. మిగతా పోరుల్లో పైచేయి సాధించినా.. ట్రంప్ మ్యాచ్ ఓటమితో నెగటివ్ స్కోరు మూటగట్టుకున్న బెంగళూరు 2-3తో ఓటమిపాలైంది.

షరపోవా ఔట్

రెడీమియులో 1-2తో కటెరినా చేతిలో ఓటమి



షెన్‌జెన్(చైనా): రష్యా టెన్నిస్ స్టార్, మాజీ ప్రపంచ నెంబర్ వన్ మరియా షరపోవా షెన్‌జెన్ ఓపెన్ నుంచి నిష్క్రమించింది. శుక్రవారం జరిగిన సెమీస్ సమరంలో ఆరో సీడ్ కటెరినా సినియకోవా (చెక్ రిపబ్లిక్) చేతిలో 2-6, 6-3, 3-6తో పోరాడి ఓడింది. సీజన్ తొలి పోరులో అన్‌సీడెడ్‌గా బరిలో దిగినా తన పోరాట పటిమతో మెప్పించింది. తొలి సెట్‌లో ఓడినా రెండో గేమ్ నెగ్గి పోటీని నిర్ణాయక మూడో సెట్‌కు తీసుకెళ్లింది. షరపోవా అనవసర తప్పిదాలతో లాభ పడిన ప్రత్యర్థి మూడు సెట్ల పోరులో 2-1తో నెగ్గి ఫైనల్‌కు చేరుకున్నది. మరో ఆల్ రోమేనియన్ సెమీస్ మ్యాచ్‌లో టాప్ సీడ్ సిమోన హాలెప్‌కు ఇరినా కామెలియా బెగు షాకిచ్చింది. 6-1, 6-4తో వరుస సెట్లలో అలవోకగా గెలుపొందింది. టైటిల్‌కోసం నేడు ఇరినా, సినియకోవాలు తలపడనున్నారు.

షెన్‌జెన్ ఓపెన్

సుశీల్ కుమార్‌కు నోటీసులు

అభిమానుల ఘర్షణపై వివరణ కోరిన డబ్ల్యూఎఫ్ఐ

న్యూఢిల్లీ : రెండుసార్లు ఒలింపిక్ పతకాల విజేత, స్టార్ రెజ్లర్ సుశీల్ కుమార్‌కు రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఎఫ్ఐ) నోటీసులు జారీ చేసింది. గత నెల కామన్ వెల్త్ క్రీడల సెలక్షన్ ట్రయల్స్ సందర్భంగా సుశీల్ కుమార్, రెజ్లర్ పర్వీన్ రానాల అభిమానుల మధ్య ఘర్షణ జరిగిన విషయం తెలిసిందే. సుశీల్‌తో బరిలో దిగే సాహసం చేసినందుకు తనపై, తన అన్నను సుశీల్ వర్గీయులు దాడికి దిగారని రానా ఆరోపించగా, బౌట్‌లో రానా తనను గాయపరిచాడని సుశీల్ ప్రత్యారోపణ చేశాడు. సుశీల్ వర్గీయులు, రానా మద్దతుదారుల కొట్లాటతో ఈ విషయం పెనుదుమారం రేపింది. పర్వీన్ సోదరుడి ఫిర్యాదు మేరకు న్యూఢిల్లీ పోలీసులు సుశీల్‌కుమార్‌పై కేసు నమోదు చేశారు. ఇంతటితో శాంతించని రానా తాజాగా ఘర్షణపై డబ్ల్యూఎఫ్ఐకు ఫిర్యాదు చేశాడు. దీంతో గతేడాది డిసెంబర్ 29న జరిగిన సంఘటనపై వివరణ కోరుతూ డబ్ల్యూఎఫ్ఐ సుశీల్‌కు నోటీసులిచ్చింది. మూడు వారాల్లోగా వివరణ ఇవ్వాలని తెలిపింది. లేదంటే తదుపరి చర్యలకు ఆదేశాలు జారీ చేస్తామని నోటీసులో పేర్కొన్నది.





టీమ్ ఇండియా ఆనందహేళ..
డుప్లెసిస్ వికెట్ తీసిన హార్దిక్ పాండ్య



భువీ భళా!

భువనేశ్వర్ దెబ్బకు దక్షిణాఫ్రికా టాప్ ఆర్డర్ విలవిల

భువనేశ్వర్ 19-4-87-4

తొలి ఇన్నింగ్స్‌లో సఫారీలు 286 పరుగులకే ఆలౌట్

భారత పేస్ బృందం మెరిసింది. కేప్‌టౌన్‌లో నిప్పులు చెరిగిన ఫాస్ట్ బౌలర్ భువనేశ్వర్ కుమార్ దక్షిణాఫ్రికా టాప్ ఆర్డర్‌ను పేక మేడలా కూల్చేశాడు. నాల్గు వికెట్లు తీసిన భువీకి మిగిలిన పేసర్లు తోడయ్యారు. బరిలో దిగిన ఏకైక స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఆఖర్లో రెండు వికెట్లు పడగొట్టాడు. బౌలర్లకు అనుకూలిస్తున్న పిచ్‌పై భారత టాప్ ఆర్డర్ సైతం తడబడింది. తొలి రోజు ఆటముగిసే సమయానికి భారత్ 28/3తో కొనసాగుతున్నది.

నవ తెలంగాణ - కేప్‌టౌన్

అద్భుత ఫామ్‌తో సఫారీ గడ్డపై అడుగుపెట్టిన కోహ్లి సేన తొలి రోజు సత్తా చాటింది. పేసర్ భువనేశ్వర్ కుమార్ (4/87) మెరుపులతో దక్షిణాఫ్రికా టాప్ ఆర్డర్ కుప్ప కూలగా మిగతా బ్యాట్స్‌మెన్ పరుగులు చేయటానికి ఆపసోపాలు పడ్డారు. పేస బృందం అంతా రాణించగా ఆఖర్లో స్పిన్నర్ రవి చంద్రన్ అశ్విన్ మెరిశాడు. టెస్టుల్లోకి ఆరంగేట్రం చేసిన జశ్‌ప్రీత్ బుమ్రా కీలక డివిలియర్స్ వికెట్‌ను పడగొట్టి మెప్పించాడు. డివిలియర్స్ (65), డుప్లెసిస్ (62) అర్ధ శతకాలతో దక్షిణాఫ్రికా 286 పరుగులు చేయగల్గింది. ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్ సైతం ఆదిలోనే టాప్ ఆర్డర్ వికెట్లు పారేసుకున్నా, భారత బ్యాట్స్‌మెన్ నేడు నిలదొక్కుకుని ఇన్నింగ్స్‌ను ఆధిక్యం దిశగా నడిపే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

భువనేశ్వర్ దూకుడు..: భారత ఉన్నత శ్రేణి పేసర్ భువనేశ్వర్ కుమార్ తన మార్క్ బౌలింగ్‌తో దక్షిణాఫ్రికా టాప్ ఆర్డర్‌ను కుప్ప కూల్చాడు. 2017 ఏడాదిలో అద్భుత ఫామ్ కనబరిచిన ఎల్గార్‌ను తొలి ఓవర్ మూడో బంతికే పెవిలియన్ చేర్చాడు. కీపర్ సాహకు క్యాచ్ ఇచ్చి డకౌట్ అయ్యాడు ఎల్గార్. సఫారీ జట్టు స్కోరు 7 పరుగుల వద్ద ఉన్నపుడు, మరో ఓపెనర్ ఎయిడెన్ మార్క్‌రం (5)ను ఎల్బీ చేశాడు భువీ. వన్ డౌన్‌లో బ్యాటింగ్‌కు దిగిన హాషీమ్ ఆమ్లా (3) సైతం భువీ భీకర పేస్‌కు తలవంచాడు. ఈ దశలో ఎబీ డివిలియర్స్ (65) కాసేపు భారత బౌలర్ల సహనాన్ని పరీక్షించాడు. పది ఫోర్ల సాయంతో 55 బంతుల్లో హాఫ్ సెంచరీ కొట్టిన డివిలియర్స్‌కు సారథి డుప్లెసిస్ (62) సహకారం అందించాడు. ఫోర్లతో విరుచుకుపడిన ఈ జోడీ నాల్గో వికెట్‌కు శతక భాగస్వామ్యం నెలకొల్పారు. ఇనింగ్స్‌కు కీలక భాగస్వామ్యం అందించిన జోడీని ఆరంగేట్ర పేసర్ జశ్‌ప్రీత్ బుమ్రా విడగొట్టాడు. దక్షిణాఫ్రికా స్టార్ బ్యాట్స్‌మెన్ అయిన డివిలియర్స్‌ను ఏకంగా బౌల్డ్ చేశాడు. లంచ్ విరామానంతరం ఆట ప్రారంభమైన కొద్ది సేపటికే ఇన్నింగ్స్ 33వ ఓవర్ ఆఖరి బంతికి ఏబీ మైదానాన్ని వీడాడు. అంతకు ముందు భారత బౌలర్లు దాదాపు గంటసేపు వికెట్ కోసం నిరీక్షించారు. 35వ ఓవర్లో కెరీర్‌లో 36వ అర్ధ శతకం సాధించిన డుప్లెసిస్ తర్వాతి ఓవర్ లోనే టీమ్ ఇండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య చేతిలో ఔటయ్యాడు. వికెట్ల వెనుక మెరుపులా కదిలిన కీపర్ సాహా క్యాచ్ పట్టటంతో డుప్లెసిస్ వెనుదిరిగాడు. ఈ దశలో క్వింటన్ డికాక్ (43), వెర్నన్ ఫిలాండర్ (23) మరో భారీ భాగస్వామ్యం నెలకొల్పజూశారు. కానీ అద్భుతమైన బంతితో భువీ డికాక్‌ను ఔట్ చేసి నాల్గో వికెట్ ఖాతాలో వేసుకున్నాడు. ఆపై భారత బౌలర్ల సహనాన్ని పరీక్షించాడు కేశవ్ మహరాజ్ (35). వికెట్ పడకుండా పరుగులు రాబట్టిన మహరాజ్.. షమి బౌలింగ్‌లో సింగిల్ తీసే ప్రయత్నంలో అశ్విన్ చేతిలో రనౌట్ అయ్యాడు. ఆఖర్లో టెయిలెండర్లు కగిసో రబాడా (26), మోర్నె మెర్కెల్ (2)ల వికెట్లను అశ్విన్ పడగొట్టాడు. డేల్ స్టెయిన్ 16 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. మొత్తం 73.1 ఓవర్లకే ఆలౌట్ అయిన సఫారీలు 286 పరుగులు చేయగలిగారు



టాప్ ఆర్డర్ తడబాటు..: బౌలర్లకు సహకరిస్తున్న పిచ్‌పై మనోళ్లు తడబడ్డారు. ఓపెనర్ మురళీ విజయ్ (1), శిఖర్ ధావన్ (16)లు వెనుదిరగగా.. పరుగుల యంత్రం కోహ్లి సైతం మోర్కెల్ బంతికి డికాక్‌కు క్యాచ్ ఇచ్చాడు. 11 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 28 పరుగులు చేసింది భారత్. తొలి రోజు ఆటముగిసే సమయానికి చటేశ్వర్ పుజారా (5 బ్యాటింగ్), రోహిత్ శర్మ (0 బ్యాటింగ్) అజేయంగా నిలిచారు.

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ : డీన్ ఎల్గార్ (సి) వృద్ధిమాన్ సాహా (బి) భువనేశ్వర్ కుమార్ 0, ఏడెన్ మార్క్‌రం ఎల్‌బి (బి) భువనేశ్వర్ కుమార్ 5, హాషీం ఆమ్లా (సి) వృద్ధిమాన్ సాహా (బి) భువనేశ్వర్ కుమార్ 3, ఏబీ డివిలియర్స్ (బి) జశ్‌ప్రీత్ బుమ్రా 65, డుప్లెసిస్ (సి) వృద్ధిమాన్ సాహా (బి) హార్దిక్ పాండ్య 62, క్వింటన్ డికాక్ (సి) వృద్ధిమాన్ సాహా (బి) భువనేశ్వర్ కుమార్ 43, వెర్నర్ ఫిలాండర్ (బి) మహమ్మద్ షమి 23, కేశవ్ మహరాజ్ రనౌట్ (అశ్విన్) 35, కగిసో రబాడా (సి) వృద్ధిమాన్ సాహా (బి) రవిచంద్రన్ అశ్విన్ 26, డేల్ స్టెయిన్ నాటౌట్ 16, మోర్నె మోర్కెల్ ఎల్‌బి (బి) రవిచంద్రన్ అశ్విన్ 2, ఎక్స్‌ట్రాలు 6, **మొత్తం : (73.1 ఓవర్లలో 10 వికెట్లకు) 286.**

వికెట్ల పతనం : 1-0, 2-7, 3-12, 4-126, 5-142, 6-202, 7-221,చ 8-258, 9-280, 10-286.

బౌలింగ్ : భువనేశ్వర్ కుమార్ 19-4-87-4, మహమ్మద్ షమి 16-6-47-1, జశ్‌ప్రీత్ బుమ్రా 19-1-73-1, హార్దిక్ పాండ్య 12-1-53-1, రవిచంద్రన్ అశ్విన్ 7.1-1-21-2.

భారత్ తొలి ఇన్నింగ్స్ : విజయ్ (సి) ఎల్గర్ (బి) ఫిలాండర్ 1, శిఖర్ ధావన్ (సి,బి) స్టెయిన్ 16, చటేశ్వర్ పుజారా బ్యాటింగ్ 5, విరాట్ కోహ్లి (సి) డికాక్ (బి) మోర్నె మోర్కెల్ 5, రోహిత్ బ్యాటింగ్ 0, ఎక్స్‌ట్రాలు 1, **మొత్తం : (11 ఓవర్లలో 3 వికెట్లకు) 28.**

వికెట్ల పతనం : 1-16, 2-18, 3-27.

బౌలింగ్ : వెర్నన్ ఫిలాండర్ 4-1-13-1, డేల్ స్టెయిన్ 4-1-13-1, మోర్నె మోర్కెల్ 2-2-0-1, కగిసో రబాడా 1-0-1-0.

రాణించిన ఖవాజా, స్మిత్

తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 193/2

యాషెస్ ఐదో టెస్టు రెండో రోజు

సిడ్నీ : తుది యాషెస్ సమరంలో ఆసీస్ ఊపందుకుంటోంది. కంగారూల సేనాని స్టీవెన్ స్మిత్ (44 బ్యాటింగ్), ఉస్మాన్ ఖవాజా (91 బ్యాటింగ్) సహా ఓపెనర్ డెవిడ్ వార్నర్ (56) అర్ధ శతకంతో మెరిశారు. దీంతో తొలి ఇనింగ్స్‌లో రెండు వికెట్ల నష్టానికి 193 పరుగులు చేసిన ఆస్ట్రేలియా.. 153 పరుగుల వెనుకంజలో కొనసాగుతోంది. మరో పక్క పరువు పోరులో ఇంగ్లాండ్ తడబడుతోంది. పరుగులు చేయటంలో చూపిన జోరు వికెట్ల వేటలో కనిపించటంలేదు. 233/5తో శుక్రవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లాండ్ త్వర త్వరగా వికెట్లు పారేసుకున్నది. టెయిలెండర్ల సాయంతో నెట్టుకొస్తాడనుకున్న డావిడ్ మలన్ (62) మిచెల్ స్టార్క్ బౌలింగ్‌లో స్మిత్ చేతికి చిక్కి.. ఇంగ్లాండ్ వికెట్ల పతనానికి పునాది వేశాడు. మోయిన్ అలీ (30), టామ్ కరన్ (39) సహా స్టువర్ట్ బ్రాడ్ (31)లు ఓ మోస్తరుగా పరుగులు చేశారు. దీంతో అన్ని వికెట్లు కోల్పోయిన ఇంగ్లాండ్ 346 పరుగుల వద్ద ఇన్నింగ్స్ ముగించింది. ఆసీస్ బౌలర్లలో పాట్ కమిన్స్ నాల్గు వికెట్లు కూల్చాడు. మిచెల్ స్టార్క్, జోష్ హాజిల్‌వుడ్‌లు రెండేసి వికెట్లు పడగొట్టారు. నాథన్ లైయన్‌కి ఒక వికెట్ దక్కింది. బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్‌కు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్ కామెరూన్ బాన్‌క్రాఫ్ట్ డకౌట్‌గా నిష్క్రమించాడు. రెండో ఓవర్లో స్టువర్ట్ బ్రాడ్ వేసిన ఫుల్ లెంగ్త్ బంతి నేరుగా వికెట్లకు తాకింది.



అయితే మరో ఓపెనర్ డెవిడ్ వార్నర్ (56) ఇంగ్లాండ్‌కు మరో వికెట్ ఇవ్వకుండా ఆడుకున్నాడు. వన్ డౌన్‌లో వచ్చిన ఉస్మాన్ ఖవాజా తోడుగా చెలరేగాడు. అర్ధశతక మార్కు దాటుకున్నాక జేమ్స్ ఆండర్సన్ బౌలింగ్‌లో వికెట్ కీపర్ జానీ బెయిరిస్టో చేతిలో క్యాచౌట్ అయ్యాడు వార్నర్. ఈ దశలో బరిలో దిగిన స్టీవెన్ స్మిత్ ఇంగ్లాండ్ మరో వికెట్ తీయకుండా అడ్డుకున్నాడు. చెత్త బంతులకే పరుగులు తీస్తూ స్కోరు బోర్డును కదిలించాడు. ఆట ముగిసే సమయానికి ఖవాజా శతకానికి తొమ్మిది పరుగుల దూరంలో నిలువగా, స్మిత్ హాఫ్ సెంచరీకి ఆరు పరుగుల దూరంలో నిలిచాడు. నేడు ఇదే జోరు కొనసాగించి తొలి ఇన్నింగ్స్‌లో భారీ ఆధిక్యం దిశగా దూసుకెళ్లాలని ఆసీస్ యోచన. అయితే వికెట్ల వేటలో వేగం పుంజుకుంటే ఇంగ్లాండ్ ఆధిపత్యాన్ని కాపాడుకొనే అవకాశం ఉన్నది.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.